సురవరం సుధాకరరెడ్డి
వ్యాసాలు - లేఖలు
రూ॥200/- పేజీలు:290
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

మిషన్ భగీరథ ట్యాంక్‌లో దిగి ఊపిరాడక ముగ్గురు కార్మికులు మృతి 03

బిహార్‌లో సిపిఐ ప్రబల శక్తి అందుకు తగ్గట్లుగానే సీట్లు కోరుతున్నాం సిపిఐ ప్రధాన కార్యదర్శి రాజా 04

సంపుటి 08, సంచిక: 280 | బుధవారం | 10-09-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్

**ఎన్‌డిఎ అభ్యర్థికి 452, ఇండియా అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు**

- ఓటు వేసిన 767 మంది ఎంపిలు
- చెల్లని ఓట్లు 15
- 98.2 శాతం ఓటింగ్
- రాజ్యాంగంకోసం పోరు కొనసాగుతుంది : జస్టిస్ సుదర్శన్‌రెడ్డి





**న్యూఢిల్లీ:** భారత ఉపరాష్ట్రపతిగా సిపి రాధాకృష్ణ ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో ఎన్‌డిఎ తరఫున పోటీచేసిన రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు వచ్చాయి. 'ఇండియా కూటమి' ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు లభించాయి. అధికారపార్టీ అభ్యర్థి రాధాకృష్ణన్‌కు ఊహించినదానికంటే ఎక్కువగా 152 ఓట్ల మెజారిటీ లభించింది. ప్రతిపక్ష శిబిరం నుండి కూడా ఆయనకు ఓట్లు పడ్డాయి. రిటర్నింగ్ అధికారి పి.సి.మోదీ (రాజ్యసభ సెక్రటరీ జనరల్) మంగళవారం రాత్రి ఉపరాష్ట్రపతి ఎన్నిక ఫలితాన్ని వెల్లడించారు. రాధాకృష్ణన్ దేశ ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారని ఆయన ప్రకటించారు. ఈ ఎన్నికల ఫలితాన్ని ఎన్నికకమిషన్‌కు తెలియజేస్తానన్నారు. 752 ఓట్లు చెల్లుబాటుకాగా, 15 ఓట్లు చెల్లుబాటు కాకుండా వృధా అయ్యాయని చెప్పారు. పార్లమెంటు ఉభయసభలకు చెందిన మొత్తం 781 మంది సభ్యులకుగాను 767 మంది ఎంపీలు ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి నిర్ణీత ప్రకారం 315 ఓట్లు రావాల్సి ఉండగా 15 ఓట్లు తక్కువ వచ్చాయి. ఫలితాలు రావడానికి ముందుగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరామ్ రమేశ్ మాట్లాడుతూ, ప్రతిపక్షం ఐక్యంగా ఉందని, 315 మంది ఎంపీలు ఓట్లు వేశారని చెప్పారు. ఐతే దీనిపై బిజెపి నాయకులు స్పందిస్తూ, ప్రతిపక్షంలో కొందరు ఎంపీలు ఉద్దేశపూర్వకంగా తరువాయి 2లో

# నేపాల్‌లో హింసాకాండ

## ప్రధానమంత్రి ఓలి రాజీనామా

## జనరేషన్ జెడ్ ఉద్యమంతో రాజకీయ సంక్షోభం

- పార్లమెంటు భవనం దగ్ధం చేసిన నిరసనకారులు
- ఓలి సహా పలువురి నాయకుల ఇళ్ళకు నిప్పు
- సోషల్ మీడియాపై నిషేధం రద్దు, దర్యాప్తునకు ఆదేశం
- రెండోరోజు ఆగని హింస, కర్ఫ్యూ ఉల్లంఘన
- విమాన రాకపోకలు రద్దు,రంగంలోకి సైన్యం



**ఖాట్మండు:** నేపాల్‌లో సోషల్ మీడియాపై నిషేధానికి వ్యతిరేకంగా మొదలైన ''జనరేషన్ జెడ్ ఉద్యమం'' రాజకీయ భూకంపం పుట్టించింది. ప్రధానమంత్రి కె.పి.శర్మఓలి రాజీనామా చేయగా, ప్రదర్శకులు పార్లమెంటు భవనానికి నిప్పుపెట్టారు. మంటల్లో పార్లమెంటు భవనం దగ్ధమవుతున్న దృశ్యాలను అంతర్జాతీయ మీడియా చూపించింది. ప్రధానమంత్రి సహా పలువురు నాయకుల ఇళ్ళను ప్రదర్శకులు దగ్ధం చేశారు. సోమవారం రాత్రి పొద్దుపోయాక సోషల్ మీడియాపై నిషేధాన్ని రద్దుచేశారు. ఐతే మంగళవారం మధ్యాహ్నం యువకులు పెద్దసంఖ్యలో ఆయన అధికారిక కార్యాలయంలోకి ప్రవేశించి, పోలీసు కాల్పుల్లో 19 మంది మరణించిన ఘటనలకు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, యువకులు చేసిన డిమాండ్‌ను గౌరవించి వెంటనే ఆయన రాజీనామా సమర్పించారు. దేశంలో పరిస్థితులు చక్కబడి శాంతి నెలకొనేవరకూ సైన్యమే ప్రధానపాత్ర నిర్వహించే అవకాశం ఉంది. కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ నేపాల్ (యూనిఫైడ్ మార్క్సిస్ట్–లెనినిస్ట్స్), కాంగ్రెస్‌పార్టీ నాయకత్వానగల కూటమి ప్రభుత్వం 2024 జులై 15 నుండి అధికారంలో కొనసాగుతోంది. ఓలి రాజీనామాకు ముందుగా, దేశంలో ఈ అల్లర్లు వెనుక కారణాలు, అసలు సమస్యపై లోతుగా దర్యాప్తు జరపాలని అధికారులను తరువాయి 2లో

# గ్రూప్–1 పరీక్ష పేపర్లు పునః మూల్యాంకనం

- కుదరకపోతే మళ్లీ పరీక్ష నిర్వహించాలి
- మొత్తం ప్రక్రియ ఎనిమిది నెలల్లోపు పూర్తిచేయాలి
- హైకోర్టు కీలక తీర్పు
- తుది మార్కులు, జనరల్ ర్యాంకింగ్ రద్దుచేసిన ఉన్నత న్యాయస్థానం

ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రూప్ –1 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు మంగళవారం కీలక తీర్పు చెప్పింది. మెయిన్స్ పరీక్ష పేపర్లను పునః మూల్యాంకనం చేయాలని టిజిపిఎస్‌సిని ఆదేశించింది. ఇప్పటికే ప్రకటించిన తుది మార్కుల జాబితా, జనరల్ ర్యాంకింగ్ జాబితాలను రద్దు చేసింది మెయిన్స్ అభ్యర్థుల పేపర్లు పునఃమూల్యాంకనం చేసి అర్హుల జాబితాను ప్రకటించాలని ఆదేశించింది. అనంతరం నోటిఫికేషన్‌లో పేర్కొన్న మేరకు 563 గ్రూప్ 1 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలని, సుప్రీం కోర్టు సంజయ్ సింగ్ వర్సెస్ యుపిఎస్‌సి కేసు తీర్పులోని గైడ్‌లైన్స్ మేరకు మోడరేషన్ విధానంలో పునః మూల్యాంకాన్ని మాన్యువల్ పద్ధతిలో చేయాలని పేర్కొంది. పునః మూల్యాంకనం చేయలేకపోతే తిరిగి గ్రూప్ 1 పరీక్ష నిర్వహించాలని ఆదేశించింది. ఇదంతా ఎనిమిది నెలల్లోగా పూర్తి చేయాలని తెలిపింది. గ్రూప్–1 తరువాయి 2లో



03
మళ్ళీ పరీక్ష నిర్వహించాలి : కెటిఆర్
పరీక్ష నిర్వహణలో ప్రభుత్వం విఫలం : బిజెపి
తగిన నిర్ణయం తీసుకుంటాం : మంత్రి జూపల్లి
నిరుద్యోగులకు మంచిచేసే చర్యలే చేపడతాం : ఎంపి చామల

బంగారం ధరకు రెక్కలు
ఒక్కరోజే రూ.5వేలు పెరిగిన పసిడి ధర!

హిమాచల్‌కు రూ. 1500కోట్లు పంజాబ్‌కు రూ. 1600 కోట్లు
తక్షణ సాయం ప్రకటించిన ప్రధాని మోదీ
05

## ఫార్ములా ఇ-రేస్ కేసు

# చార్జిషీట్ దాఖలుకు అనుమతివ్వండి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు లేఖ రాసిన ఎసిబి?
- దర్యాప్తు నివేదిక ప్రభుత్వానికి అందజేత
- లై డిటెక్టర్ పరీక్ష చేసుకోవచ్చు : కెటిఆర్



ప్రజాపక్షం/హైదరాబాద్

ఫార్ములా ఇ–కార్ రేస్ కేసులో అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు విచారణ పూర్తి చేశారు. ఈ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసేందుకు తమకు అనుమతి ఇవ్వాలంటూ ఎసిబి అధికారులు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు లేఖ రాసినట్లు సమాచారం. కొత్త చట్టాల ప్రకారం ప్రజాప్రతినిధిని ఏదైనా కేసులో అరెస్టు చేయాలన్నా, చార్జిషీట్ దాఖలు చేయాలన్నా గవర్నర్ అనుమతి తప్పనిసరి. అయితే ఫార్ములా ఇ–కార్ రేస్ 2023లో చోటుచేసుకుంది. ఇందులో ఎ1గా ఎమ్మెల్యే కెటిఆర్ ఉండడంతో గవర్నర్ అనుమతి తప్పనిసరి అయ్యింది. గవర్నర్ అనుమతి రాగానే కెటిఆర్‌ను ఆరెస్టు చేయవచ్చు లేదంటే చార్జిషీట్ దాఖలు చేయవచ్చు. ఈ మేరకు దాదాపు 9 నెలల పాటు కేసులో విచారణ జరిపిన ఎసిబి అధికారులు పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. అదేవిధంగా కేసులో నిందితులుగా ఉన్న వారిపై చార్జిషీట్ దాఖలు చేసేందుకు గవర్నర్ అనుమతి కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఫార్ములా ఇ–రేసు కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ మేరకు దాదాపు 9 నెలల పాటు కేసులో విచారణ జరిపిన ఎసిబి అధికారులు పూర్తి నివేదికను ఇవాళ ప్రభుత్వానికి అందజేశారు. అదేవిధంగా కేసులో నిందితులుగా ఉన్న వారిపై చార్జిషీట్ దాఖలు చేసేందుకు గవర్నర్ అనుమతి కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వద్దకు రిపోర్టు చేరింది. అక్కడి నుంచి అనుమతి రాగానే ఫార్ములా ఈరేసు కేసులో ఎ1గా ఉన్న తరువాయి 2లో

# రూ.4 లక్షలు లంచం పట్టుబడిన అధికారిణి

- ఎల్‌ఆర్‌ఎస్ క్లియర్ చేసేందుకు రూ.10 లక్షలు డిమాండ్ చేసిన మణిహారిక
- నార్సింగ్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఎసిబి అధికారులు



ప్రజాపక్షం/గండిపేట

నార్సింగి మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి మణిహారిక 4 లక్షలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు రెడ్ హాండెడ్ పట్టుబడింది. ఈ సంఘటన సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే మంచిరేవులలో వినోద్ అనే వ్యక్తి తన ప్లాట్ విషయంలో ఎల్‌ఆర్‌ఎస్ క్లియర్ చేయడానికి దరఖాస్తు చేసుకున్నాడు ఎల్‌ఆర్‌ఎస్ క్లియర్ తరువాయి 12లో



## తెలంగాణలో విద్యాభివృద్ధికి

# అండగా నిలవండి

- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు సిఎం రేవంత్ రెడ్డి వినతి
- యంగ్ ఇండియా స్కూళ్లు, ఇతర విద్యా సంస్థల అభివృద్ధికి రూ.30 వేల కోట్ల వ్యయం అవుతుందని వెల్లడి
- గత ప్రభుత్వం తీసుకున్న రుణాల రీస్ట్రక్చరింగ్‌కు అనుమతివ్వాలని విజ్ఞప్తి

హైదరాబాద్/హైదరాబాద్

తెలంగాణ విద్యా రంగంలో సమూల మార్పులు తీసుకురావడానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషికి మద్దతు ఇవ్వాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అత్యాధునిక వసతులు, ల్యాబ్‌లు, స్టేడియాలతో నిర్మించే ఈ 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రూ.21 వేల కోట్ల వ్యయమవుతుందని వివరించారు. రాష్ట్రంలో జూనియర్, డిగ్రీ, సాంకేతిక కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో ఆధునిక ల్యాబ్‌లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు రూ.9 వేల కోట్లు వెచ్చించనున్నట్లు కేంద్ర మంత్రికి సిఎం తెలిపారు. ఈ నిధుల తరువాయి 12లో

# ఇజ్రాయెల్ ఘాతుకం

# హమాస్ అగ్రనేతలపై బాంబుదాడులు

## ఖతార్ రాజధాని దోహాలో శాంతిచర్చలకు వెళ్లినవారిపై దుశ్చర్య తీవ్రంగా ఖండించిన ఐరాస సెక్రెటరీ జనరల్



(హమాస్ నేతల ఫైల్ ఫోటో)

**గాజా:** ఖతార్ దేశం రాజధాని దోహానగరంలోని కేంద్ర కార్యాలయంలో హమాస్ అగ్ర నాయకత్వం చర్చలు జరుపుతుండగా వారిని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ ఐడిఎఫ్, ఐఎస్ఎలు మంగళవారం బాంబు దాడులు చేశాయి. హమాస్ అగ్రనాయకత్వం హతమైనట్లు తాము ఆశాభావంతో ఉన్నామని ఇజ్రాయెల్ మంగళవారం రాత్రి ప్రకటించింది. ఈ దాడుల్లో 2023 అక్టోబరు ఏడో తేదీన ఇజ్రాయెల్‌పై దాడికి ప్రత్యక్ష సూత్రధారులు ఖలీల్ హయ్యా, ఖాలెద్ మషాల్ తదితరులు ఉన్నట్లు సమాచారం. ఐతే బాంబు దాడుల్లో హమాస్ కీలక నేతలు ఎవరైనా మరణించారా? లేదా గాయపడ్డారా? అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఖతార్‌లో అనేకచోట్ల బాంబుపేలుళ్ళు సంభవించాయి. హమాస్ సంస్థ నాయకులపై ఇజ్రాయెల్ గురిపెట్టి లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు చేసింది. ఖతార్‌లో దాడులు చేసేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ ముందుగానే తెలియజేశారని, అందుకు ట్రంప్ అనుమతించారని ఇజ్రాయెలీ సీనియర్ అధికారులు చానెల్–12 కు చెప్పారు. దోహాలో దాడులు చేసేందుకు నెతన్యాహూ ఐడిఎఫ్‌కు ముందుగానే పూర్తి అనుమతి మంజూరుచేశారు. ఖతార్‌లో జరిగిన దాడులను ఆ దేశ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి గుటెర్రెస్ కూడా ఈ దాడులను తరువాయి 12లో




నిబంధనావళిలో పెనుమార్పులు తెచ్చిన సిపిఐ 5వ కాంగ్రెస్ – 6లో



# ప్రపంచం
WORLD NEWS

## జపాన్ ప్రధాని రేసులో నలుగురు



**టోక్యో :** జపాన్ ప్రధానమంత్రి పదవికి కొత్త నాయకుణ్ణి అక్టోబరు నాలుగో తేదీన ఎన్నుకుంటారు. ఈ పోటీలో అధికార ఎల్‌డిపి నుండి నలుగురి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అందులో తకయుకి కొబయాషి, కొయిజుమి, తకైచి, యోషిమస హామాషి పోటీ పడుతున్నారు. పార్టీ అధ్యక్ష పదవికి, ప్రధానమంత్రి పదవికి షిగెరు ఇషిబా (78) మూడురోజులక్రితం రాజీనామా చేశారు. అధికార లిబరల్ డెమోక్రటిక్‌పార్టీ (ఎల్‌డిపి)లో తీవ్ర అసంతృప్తి, వ్యతిరేకత రావడంతో రాజీనామా చేశారు. లిబరల్ డెమోక్రటిక్‌పార్టీ వచ్చేనెల మొదటివారంలో సమావేశమై కొత్త నాయకుణ్ణి ఎన్నుకున్న తర్వాత పార్లమెంటు సమావేశం జరుగుతుంది.

## రష్యా ఆర్థికవ్యవస్థ పతనం కాలేదు..
# ఏకాకి కాలేదు



యూరప్ కల చెదిరింది :లావరోవ్ విమర్శ

**మాస్కో :** రష్యా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుందని, ప్రపంచదేశాలతో సంబంధం లేకుండా ఏకాకిగా మారుతుందని యూరోపియన్ యూనియన్ దేశాలు కన్న కలలు నెరవేరలేదని రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లావ్‌రోవ్ విమర్శించారు. పశ్చిమదేశాలతో సమానంగా రష్యా కూడా కొనుగోలు శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవడంద్వారా యూరప్‌లో అతిపెద్ద ఐదవ ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు. కొనుగోళ్ళకు సంబంధించి కరెన్సీ ఎక్స్ఛేంజ్ రేట్లలో సమానత్వం సాధించి ప్రపంచంలో అమెరికా, చైనా, భారత్ తర్వాత నాలుగోస్థానంలో రష్యా నిలిచిందని, యూరప్ దేశాలతో సమానమైన కొనుగోలు సామర్థ్యాన్ని (పిపిపి) సాధించి ఆ ఖండంలో ఐదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థ స్థానంలో నిలబడిందని సాక్షాత్తూ ప్రపంచబ్యాంకు, పశ్చిమ దేవాల బ్యాంకుల గణాంకాలే చెబుతున్నాయని ఎంజిఐఎంఒ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగిస్తూ లావరోవ్ చెప్పారు. 2022 ఫిబ్రవరి 24న ఉక్రేన్‌లో యుద్ధం ప్రారంభించిన తర్వాత రష్యా ఆర్థిక వ్యవస్థ సంపూర్ణంగా పతనం అవుతుందని పశ్చిమ దేశాలు అంచనా వేశాయని, వారి కలలు నెరవేరకపోవడంతో నిరాశచెందాయన్నారు. షాంఘై సహకార సంస్థ సదస్సు, బ్రిక్స్ సదస్సుల నేపథ్యంలో రష్యా ప్రాధాన్యత బయటపడిందని, పశ్చిమదేశాలు చేస్తున్న ప్రచారం వట్టి బూటకం అని తేలిపోయిందని విమర్శించారు.

# రష్యా– ఉక్రేన్ పరస్పర దాడులు



### డోనెట్స్క్‌లో 21 మంది వృద్ధులు మృతి
### ఒక్కరోజులో 1,425 మంది సైనికులు మృతి

**కీవ్:** ఉక్రేన్–రష్యా మంగళవారం పరస్పర యుద్ధ దాడు లు చేసుకున్నాయి. తూర్పు ఉక్రేన్‌పై రష్యా గ్లైబ్ బాంబులతో చేసిన దాడులల్లో మంగళవారం 21 మంది మరణించారు. మరో పాతికమంది మరణించారు. డోనెట్స్క్ రీజియన్ లోని యరోవా గ్రామంపై రష్యా ప్రయోగించిన బాంబు లు పడ్డాయని, పెన్షన్‌కోసం లైను లో నిలబడిన వృద్ధులు ఈ దాడిలో మరణించారని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. దీనిని కిరాతకమైన చర్యగా పేర్కొంటూ అంతర్జాతీయ సమాజం వెంటనే స్పం దించాలని కోరారు. అదేవిధంగా ఉక్రేన్ కూడా బెలగొరేడ్ ప్రాంతంపై 89 డ్రోన్లు ప్రయోగించిందని ఆ ప్రాంత గవర్నర్ వ్యాచస్లేవ్ గ్లాడ్‌కోవ్ చెప్పారు. బెల్గొరోడస్కీ జిల్లాలోని ఐదు గ్రామాలపై ఉక్రేన్ మానవ రహిత దాడులు చేసి విధ్వంసం సృష్టించిందని తెలిపారు. వీటిల్లో ఏడు డ్రోన్లు వాల్యుస్కీ జిల్లాలోని వివిధ ప్రాంతాలలో దాడులు చేసినట్లు చెప్పారు. క్రాన్స్‌నోయరుఝుస్కీ జిల్లాలో డ్రోన్ల దాడివల్ల ఎక్కువ నష్టం జరిగిందని చెప్పారు. అదేవిధంగా రష్యా సైనికవర్గాలు మంగళవారం ఒక ప్రకటన చేస్తూ గడచిన 24 గంటల్లో నలుచెరగులా ప్రధాన యుద్ధ ప్రాంతాలలో 1,425 మంది ఉక్రేన్ సైనికులు మరణించారని తెలిపింది. టాస్‌వార్తా సంస్థ ఈ విషయం వెల్లడిస్తూ, ఉత్తరప్రాంత సరిహద్దులో జరిగిన యుద్ధంలో 165 మంది ఉక్రేన్ సైనికులు మరణించారని తెలిపింది. పశ్చిమప్రాంత యుద్ధభూమిలో 240 మంది, దక్షిణప్రాంత యుద్ధప్రాంతంలో 230 మంది ఉక్రేన్ సైనికులు మరణించారు. సెంట్రల్ బ్యాటిల్‌గ్రూప్‌కు చెందిన 515 మంది, ఈస్ట్‌బ్యాటిల్‌గ్రూప్‌లో 265 మంది మరణించారు. కాగా జెలెన్‌స్కీ ఒక ప్రకటన చేస్తూ, రష్యాపై పూర్తిస్థాయిలో ఆంక్షలు విధించాలని ప్రపంచ దేశాలను కోరారు. ప్రపంచదేశాలు ఈ విషయంలో మౌనం పాటించకూడదన్నారు. ఈ విషయంల అమెరికా, యూరప్ దేశాలు వెంటనే ప్రతిస్పందించాలన్నారు. జి–20 కూడా తన అభిప్రాయం చెప్పాలని జెలెన్‌స్కీ కోరారు. డోనెట్స్క్ గవర్నర్ వాడైమ్ ఫిలాష్కిన్ ఒక ప్రకటన చేస్తూ, ఇది యుద్ధం కాదనీ, ఇది పూర్తిగా ఉగ్రవాదమని విమర్శించారు.

## నార్వేలో వరుసగా రెండోసారి
# వామపక్ష లేబర్‌పార్టీ విజయభేరి




**ఓస్లో:** నార్వేలో వామపక్ష లేబర్‌పార్టీ దేశాధికారాన్ని నిలబెట్టుకుంది. వామపక్ష లేబర్‌పార్టీ ప్రధానమంత్రి జోనాస్ గహర్ స్టోయిర్ (65) పార్లమెంటు ఎన్నికల్లో వరుసగా రెండోసారి విజయం సాధించి ప్రధానమంత్రి పదవి నిలబెట్టుకున్నారు. 28 శాతం ఓట్లు లేబర్‌పార్టీ సంపాదించుకుంది. 99 శాతం ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి లేబర్‌పార్టీతోపాటు దానికి మద్దతుగా ఉన్న ఇతర వామపక్షాలు కూడా కలిసి మొత్తం 87 పార్లమెంటరీ స్థానాలు గెలుచుకున్నాయి. మిగిలిన 82 స్థానాలకు పచ్చిమితవాద ప్రోగ్రెస్ పార్టీ, సెంటర్ రైట్ పార్టీలు గట్టిపోటీ ఇస్తున్నాయి. ఐతే 2021 నాటి కంటే ఈ ఎన్నికల్లో మితవాదులు తమ బలాన్ని రెట్టింపు చేసుకుని సవాలు విసిరారు. ద్రవ్యోల్బణం, సంపదపన్ను రద్దు, ప్రజాజీవనంలో నాణ్యతా ప్రమాణాల పెరుగుదల వంటి అంశాలే ఈ సారి ఎన్నికల్లో ప్రధాన ప్రచారాస్త్రాలుగా మారాయి. ఉక్రేన్‌లో యుద్ధం, డోనాల్డ్ ట్రంప్ భారీ సుంకాలు, గాజాలో ఇజ్రాయెల్ దారుణకాండ వంటి అంశాలు కూడా ఎన్నికల్లో ప్రధానంగా చర్చకు వచ్చాయి. దేశంలో ఆర్థికవ్యవస్థ స్థిరత్వాన్ని కోరుకుంటున్న ప్రజలు లేబర్‌పార్టీకే పట్టం కట్టారని విశ్లేషకులు చెప్పారు. లేబర్‌పార్టీకి మద్దతుగా మరో నాలుగు వామపక్ష పార్టీలు కూడా అధికారంలో భాగం పంచుకుంటూ ఆయనకు పూర్తి భరోసా ఇస్తున్నాయి. 2021 నుండీ ఆయన నార్వే ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల పార్టీలో ఎదురైన అంతర్గత ఆటుపోట్లు తట్టుకుని నిలబడి పార్టీని ఎన్నికల్లో గెలుపుతీరాలకు తీసుకువెళ్ళారు. దేశంలో జీవన వ్యయాల భారాలు లేకుండా చేస్తానని, ప్రజలకు అందుబాటులో సరుకులు ఉంచుతానని, వారి వేతన స్థితిగతులను మెరుగుపరుస్తానని, అంతర్జాతీయంగా నార్వేదేశాన్ని కేంద్రస్థానంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని ప్రజలకు ఆయన వాగ్దానం చేశారు. దేశంలో మితవాదులు విజృంభిస్తున్నప్పటికీ తట్టుకుని నిలబడి దేశంలో సోషల్ డెమోక్రసీని నిలబెట్టుకోగలిగామని ఆయన తన సందేశంలో చెప్పారు. జోనాస్ గహర్ స్టోయిర్ 2014 నుండీ లేబర్‌పార్టీ నాయకుడుగా కొనసాగుతున్నారు. జెన్స్‌స్టోల్టెన్‌బెర్గ్ ప్రధానమంత్రిగా ఉండగా గహర్ స్టోయిర్ 2005 నుండి 2012 వరకూ విదేశాంగమంత్రిగా పనిచేశారు. తర్వాత మరో ఏడాది ఆరోగ్యశాఖామంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. రాయల్ నార్వేజియన్ నేవల్ అకాడమీలో ఆయన తొలుత ఉన్నతాధికారిగా పనిచేశారు. రాజనీతి శాస్త్రం చదువుకున్నారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో విద్యార్థిగా అంతర్జాతీయ సంబంధాలపై అధ్యయనం చేశారు. రష్యా,ఫిన్లాండ్,స్వీడన్ సరిహద్దులుగా ఉన్న ఉత్తర యూరప్ దేశం నార్వే.

## నేపాల్‌లో హింసాకాండ
(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. దీర్ఘకాలంగా నేపాల్ రాజకీయాల్లో కొనసాగుతున్న కె.పి.శర్మ ఓలి ఇంతకుముందు రెండుసార్లు ప్రధానమంత్రి బాధ్యతలు నిర్వహించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తున్నారని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నారన్న కారణంతోపాటు ఆన్‌లైన్ వేదికలు ప్రభుత్వంవద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవడంలో విఫలం కావడంతో ఓలి మంత్రివర్గం సోషల్‌మీడియాపై గడచిన గురువారం నిషేధం విధించింది. దేశం లో కొద్దిరోజులుగా ''జనరేషన్ జెడ్ ఉద్యమం'' అవినీతికి వ్యతిరేకంగా సోషల్ మీడియా వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేస్తోంది. ఇటీవల 'నెపోకిడ్స్' సోషల్‌మీడియా వేదిక ద్వారా ప్రభుత్వ వ్యతిరేక దుష్ప్రచారం విపరీతంగా పెరిగిపోయింది. సోమవారం అర్థరాత్రి ప్రభుత్వం సోషల్ మీడియాపై నిషేధం రద్దుచేసినప్పటికీ, యువకుల మృతికి, దేశంలో అవినీతికి బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ యువకులు రెండోరోజు నిరసనలు కొనసాగించారు. విద్యార్థులను చంపకండి అంటూ వారు నినాదాలు చేశారు. మంత్రులపై భౌతక దాడులు చేశారు. 2008లో నేపాల్‌లో రాచరిక వ్యవస్థ అంతమై ప్రజాస్వామ్య పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థ ఆవిర్భవించింది. కర్ఫ్యూను ఉల్లంఘించి యువకులు కొనసాగించిన ప్రభుత్వ వ్యతిరేక నిరసనప్రదర్శనలు, హింస రెండోరోజు ఉద్ధృతరూపం దాల్చింది. సమస్య పరిష్కరించేందుకు ఆయనకంటే ముందుగా మరో నలుగురు మంత్రులు రాజీనామాలు సమర్పించారు. తొలుత సోమవారం రాత్రి నేపాల్ హోంమంత్రి రమేశ్ లేఖక్ రాజీనామా చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. ప్రధానమంత్రి రాజీనామా చేయాలని ప్రదర్శకులు డిమాండ్ చేస్తూ రెండోరోజు రాజకీయ నాయకుల ప్రైవేటు నివాసాలను లక్ష్యంగా చేసుకుని గృహ దహనాలకు, ప్రభుత్వ భవంతులపై దాడులకు పాల్పడ్డారు. ప్రధానమంత్రి ప్రైవేటు గృహాన్ని దగ్ధం చేశారు. దేశాధ్యక్షుడు పౌడల్, సోమవారం రాజీనామా చేసిన మాజీ హోంమంత్రి రమేశ్ లేఖక్ నివాసాన్ని, కమ్యూనిస్టు నేత ప్రచండ, నేపాలీ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ప్రధానమంత్రి షేర్ బహదూర్ దూబే తదితరుల ఇళ్ళను దగ్ధం చేశారు. ఆర్థికమంత్రి విష్ణుప్రసాద్ పౌడేల్‌ను ప్రదర్శకులు వీధుల్లో వెంబడించి దాడిచేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. షేర్‌బహదూర్ దూబే, ఆయన భార్య, విదేశాంగమంత్రి అర్జున్ రాణా దేవుబాలపై కూడా ప్రదర్శకులు దాడి చేశారు. దేశవ్యాప్తంగా కలంకి, కలిమతి, తహ్‌ఛల్, బనేశ్వర్‌లలో కూడా హింసాకాండ కొనసాగింది. లలిత్‌పూర్ జిల్లాలోని ఛ్యాసల్, ఛాపగావు, థెచోయో ప్రాంతాలలో కూడా నిరసన ప్రదర్శనలు కొనసాగాయి. పరిణామాలతో అధికారపార్టీ, ఇతర పార్టీల నాయకుల కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాయి. ప్రదర్శకులు త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలోకి దూసుకువెళ్ళడంతో విమానాల రాకపోకలను రద్దుచేసి భద్రతను కట్టుదిట్టం చేశారు.

సోషల్ మీడియాపై నిషేధం విధించడాన్ని వ్యతిరేకిస్తూ అంతకుముందురోజు ఆదివారం నేపాల్ జర్నలిస్టులు నిరసన ప్రదర్శన జరిపారు. ముఖ్యమైన సోషల్ మీడియాపై నిషేధంవల్ల నేపాల్ దేశం, ప్రజలు డిజిటల్ టెక్నాలజీలో ప్రపంచంకంటే వెనుకబడిపోతారని నేపాల్ కంప్యూటర్ అసోసియేషన్ (సిఎఎన్) అధ్యక్షుడు సునైనా ఘిమైర్ హెచ్చరించారు. అందరితో చర్చించి ఆచరణాత్మక పరిష్కారం సాధించాలని కోరారు.

నేపాల్ ప్రభుత్వం ఈనెల 4వ తేదీన మొత్తం 26 సోషల్ మీడియా వేదికలను నిషేధించింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. చైనాకు చెందిన ''టిక్‌టాక్'' తప్ప సోషల్ మీడియా వేదికలన్నీ నేపాల కమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ ఇచ్చిన గడువుతేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవడంలో విఫలమయ్యాయని అం దుకే నిషేధం విధించామని ప్రభుత్వం పేర్కొంది. దేశాన్ని కించపరచేవిధంగా అహంకారపూరితమైన ద్వేష ప్రచారం చేస్తే సహించబోమని, ప్రభుత్వాన్ని వ్యతిరేకించేవారి చేతుల్లో ప్రదర్శకులు తోలుబొమ్మల్లా మారారని ప్రధానమంత్రి కె.పి. శర్మ ఓలి ఆదివారం విమర్శించారు. అధికారపార్టీ సోషల్ మీడియాకు వ్యతిరేకం కాదన్నారు.

### భారత్ సరిహద్దులు కట్టుదిట్టం

నేపాల్‌లో జనరేషన్ జెడ్ ఉద్యమం ఉద్ధృతరూపం దాల్చి హింసాత్మకంగా మారడంతో భారత ప్రభు త్వం సరిహద్దు ప్రాంతాన్ని కట్టుదిట్టం చేసింది. ప్రజలు వలసలు రాకుండా అడ్డుకునేందుకు సరిహద్దు భద్రతాదళం అప్రమత్తమైంది. నేపాల్‌లో ఉన్న భారత జాతీయులు జాగ్రత్తలు పాటించాలని, హింసకు దూరంగా సురక్షితంగా ఉండాలని సలహా ఇచ్చింది. ఆ దేశానికి కొద్దిరోజులు రాకపోకలను రద్దుచేసుకోవాలని కూడా కేంద్ర ప్రభు త్వం భారతీయులకు సలహా ఇచ్చింది. ఆ దేశంలో ఏర్పడిన రాజకీయ అస్థిరత, ఇతర పరిణామాలను కూడా జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్లు భారత విదేశీమంత్రిత్వశాఖ ప్రకటించింది. తోటి సన్నిహితదేశంలో రాజకీయ పరిణామాలపై విదేశాంగశాఖ స్పందిస్తూ, చర్చల ద్వారా వారు సమస్యలు పరిష్కరించుకుంటారన్న ఆశాభావం వ్యక్తం చేసింది.

## పునః మూల్యాంకనం
(మొదటి పేజీ తరువాయి)

మూల్యాంకనాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై రెండు ఆప్షన్స్‌తో కూడిన కీలక తీర్పును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు మంగళవారం వెలువరించారు. గ్రూప్ 1 మూల్యాంకనం తిరిగి నిర్వహించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కొందరు అభ్యర్థులు, ఉద్యోగ ఎంపిక ప్రక్రియ మొదలయ్యే దశలో కోర్టు జోక్యం చేసుకోరాదని మరికొందరు అభ్యర్థులు దాఖలు చేసిన సుమారు 20 పిటిషన్లపై న్యాయమూర్తి సుదీర్ఘంగా వాదనలు విన్నాక తీర్పును గత జులై 7న వాయిదా వేశారు. మంగళవారం 222 పేజీల తీర్పును వెలువరించారు. సర్వీస్ కమిషన్ గ్రూప్ 1 పరీక్షల నిర్వహణలో అనేక లోపాలకు పాల్పడిందన్నారు. ఆచరణలో అనేక అవకతవకలు జరిగాయని గుర్తించినట్లు పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు, వాళ్లు సమర్పించిన పత్రాల పరిశీలన, విశ్లేషణ తరువాత గ్రూప్–1 మెయిన్స్ పరీక్షను కమిషన్ పారదర్శకంగా నిర్వహించలేదని తేలిందన్నారు. కమిషన్ పారదర్శకత, సమగ్రతను కొనసాగించలేదని, పక్షపాతంతో వ్యవహరించిందని తప్పుపట్టారు. కమిషన్ ఉద్యోగ నియామక నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందన్నారు. నిర్లక్ష్యం, అసమర్థత కనబడ్డాయన్నారు. నిరుద్యోగ యువత ఎంతో శ్రమించి గ్రూప్ 1 ఉద్యోగం సాధించాలనే ప్రయత్నాలకు అవరోధం కల్పించిందన్నారు. నిత్యం పది గంటలకుపైగా చదువుకోవడం, కోచింగ్ సెంటర్స్‌కు వెచ్చించడం, ఉన్న ఉద్యోగానికి రాజీనామా చేసి చదివిన అభ్యర్థులకు నిరాశ చేకూర్చిందన్నారు. మూల్యాంకన వ్యవహారంతోపాటు విధానపరంగా కూడా కమిషన్ లోపాలకు పాల్పడిందన్నారు. గతంలో రెండుసార్లు గ్రూప్–1 పరీక్ష రద్దు అయ్యాయని, ఈ మేరకు హైకోర్టు వెలువరించిన తీర్పుల తర్వాత కమిషన్‌లో మార్పులు రాలేదన్నారు. గత మార్చి 10వ తేదీన వెలువరించిన తుది మార్కుల జాబితాను, 30వ తేదీ నాటి జనరల్ ర్యాంకింగ్ లిస్ట్‌లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. సంజయ్ సింగ్– యు.పి. పబ్లిక్ సర్వీస్ కమిషన్ కేసులో సుప్రీం కోర్టు తీర్పులోని సూచనల మేరకు మోడరేషన్ పద్ధతిలో గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల సమాధాన పత్రాలను మాన్యువల్‌గా తిరిగి మూల్యాంకనం చేయాలని కమిషన్‌ను ఆదేశించారు. ఇలా చేశాకే ఫలితాలను వెల్లడించి నోటిఫికేషన్‌కు అనుగుణంగా పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఒకవేళ పునః మూల్యాంకనం చేయలేకపోతే, గ్రూప్–1 మెయిన్స్ పరీక్షను రద్దు చేయాలని, ప్రిలిమ్స్ పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థులకు తిరిగి మెయిన్స్ పరీక్ష జరపాలన్నారు. గత ఏడాది ఫిబ్రవరి 19వ వెలువడిన ఉద్యోగ నోటిఫికేషన్ (నెం.02/ 2024) మేరకు పరీక్షలను నిర్వహించాలన్నారు. ఈ ప్రక్రియ 8 నెలల్లోగా పూర్తి చేయాలన్నారు.

జనరల్ ర్యాకింగ్స్‌ను రద్దు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. తమ తీర్పుకు అనుగుణంగా మళ్లీ మూల్యాంకనం చేయాలని, పునః మూల్యాంకనం సాధ్యం కాకపోతే మళ్లీ మెయిన్స్ నిర్వహించాలన్నారు.2024 సంవత్సరం ఫిబ్రవరి 19వ తేదీన 563 గ్రూప్ 1 పోస్టుల భర్తీకి సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్‌కు అనుగుణంగానే తిరిగి పోస్టుల భర్తీ ఉండాలన్నారు అదే ఏడాది మే/జూన్ నెలల్లో ప్రిలిమ్స్, అక్టోబర్‌లో మెయిన్స్ పరీక్షలు జరిగాయని, ఈ ఏడాది మార్చిలో మెయిన్స్ ఫలితాలు వెలువడ్డాయని, గత ఏప్రిల్‌లో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికేషన్ వెరిఫికేషన్ కూడా పూర్తైందని తీర్పులో ప్రస్తావించారు. అర్హత సాధించిన పలువురు అభ్యర్థులు పోస్టింగుల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో అవకతవకలు, అక్రమాలు జరిగాయంటూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు.ఈ నేపథ్యంలో హైకోర్టు, న్యాయమూర్తి టీజీపీఎస్సీకి రెండు ఆప్షన్లు హైకోర్టు రెండు సూచనలు చేశారు. మెయిన్స్ అభ్యర్థుల పేపర్లు పునః మూల్యాంకనం చేయాలని, పునః మూల్యాంకనం సాధ్యం కాకపోతే మళ్లీ మెయిన్స్ నిర్వహించాలని కమిషన్‌ను ఆదేశించారు. ఇదిలా ఉండగా, సింగిల్ జడ్జి తీర్పుపై ద్విసభ్య ధర్మాసనం ఎదుట అప్పీల్ దాఖలు చేయాలనే అంశంపై ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

## అండగా నిలవండి
(మొదటి పేజీ తరువాయి)

సమీకరణకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు అనుమతించడంతో పాటు ఎఫ్‌ఆర్‌బిఎం పరిమితి నుంచి మినహాయించాలని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను సిఎం రేవంత్‌రెడ్డి కోరారు. తెలంగాణలో సుమారు 90 శాతంగా ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ వర్గాలలోని పిల్లలకు కార్పొరేట్ తరహా విద్యను అందించేందుకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సిఎం వివరించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో నార్త్ బ్లాక్‌లోని ఆమె కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై చేస్తున్న వ్యయాన్ని పెట్టుబడిగా పరిగణించాలని కేంద్ర మంత్రికి సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని 105 శాసనసభ నియోజకవర్గాల్లో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మించనున్నట్లు సిఎం వివరించారు. ఇప్పటికే నాలుగు పాఠశాలల నిర్మాణ పనులు మొదలయ్యాయని, మిగతా పాఠశాలలకు సంబంధించి టెండర్లు ముగిశాయన్నారు. ఒక్కో పాఠశాలలో 2,560 మంది విద్యార్థులు ఉంటారని, 2.70 లక్షల మంది విద్యార్థులకు ఈ పాఠశాలలలో చదువుకునే అవకాశం లభిస్తుందని కేంద్ర మంత్రికి సిఎం వివరించారు.

### రుణాల రీస్ట్రక్చరింగ్‌కు అనుమతించండి

గత ప్రభుత్వం ఇష్టానుసారంగా అధిక వడ్డీలకు అప్పులు తీసుకువచ్చిందని, వాటి చెల్లింపు రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారిన నేపథ్యంలో వాటి రీస్ట్రక్చరింగ్‌కు అనుమతించాలని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను సిఎం రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందించారు. సమావేశంలో ఎంపిలు డాక్టర్ మల్లు రవి, పోరిక బలరాం నాయక్, సురేశ్ షెట్కార్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కేంద్ర ప్రాజెక్టులు, పథకాల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

## ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్
(మొదటి పేజీ తరువాయి)

15 ఓట్లు చెల్లుబాటు కాకుండా వృధా చేశారన్న సంకేతాలు కనిపిస్తున్నాయని, వారంతా పరోక్షంగా రాధాకృష్ణన్‌కు అనుకూల ఓటు వేశారని చెప్పుకున్నారు. బిజెపి ఎంపి సంజయ్ జైశ్వాల్ మాట్లాడుతూ, దాదాపు 40 మంది ఎంపీలు తమ మనస్సాక్షి చెప్పినట్లుగా విని ఎన్‌డిఎ అభ్యర్థికి మద్దతు ఇచ్చి ఓటు వేశారని, అందుకే అనేక ఓట్లు వృధా చేసినట్లు కనిపిస్తోందన్నారు.

పార్లమెంటు కొత్త భవనం 'వసుధ'లోని రూమ్ నెంబర్ 101లో ఉదయం పది గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. సాయంత్రం ఐదు గంటలకు పోలింగ్ ముగిసేనాటికి 98.2 శాతం ఎంపీలు ఓటుహక్కు ఉపయోగించుకున్నారు. 12 మంది ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొనలేదు. పోలింగ్ పూర్తయిన గంట తర్వాత కొత్త పార్లమెంటు భవనంలో పి.సి.మోదీ పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. ''ఇండియా కూటమి'' అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, రాధాకృష్ణన్ మధ్య ముఖాముఖీ పోటీ జరిగింది. ప్రతిపక్షాలు ఈ ఎన్నికను మతఛాందసవాదులకు,ప్రజాస్వామ్యవాదులకు మధ్య సైద్ధాంతిక పోరాటంగా ప్రకటించాయి. ఈ ఎన్నికల్లో పార్టీల తరపున ఎలాంటి విప్ అమలులో లేదు.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అందరికంటే మొదట ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. ''ఉపరాష్ట్రపతి ఎన్నిక–2025లో ఓటుహక్కు ఉపయోగించుకున్నాను'' అని పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ వరదప్రాంతాలలో పర్యటనకు బయలుదేరేముందు, ఎక్స్‌వేదికగా మోదీ పోస్టింగ్ పెట్టారు. ప్రధానమంత్రి తర్వాత ముందుగా ఓటువేసినవారిలో కాంగ్రెస్‌పార్టీ మాజీఅధ్యక్షురాలు సోనియాగాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, మాజీ ప్రధానమంత్రి హెచ్.డి.దేవెగౌడ, సమాజ్‌వాదీపార్టీ నాయకుడు రామ్‌గోపాల్ యాదవ్, కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేశ్, నస్సెర్ హుస్సేన్, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, అర్జున్ రామ్ మేఘవాల్, ప్రహ్లాద్ జోషి, రాజ్యసభ డిప్యూటీ ఛైర్‌పర్సన్ హరివంశ్, జితేంద్రసింగ్, ఎల్.మురుగన్ తదితర పలువురు ప్రముఖులు ఓటు వేశారు. 92 ఏళ్ళ వయసుగల మాజీ ప్రధానమంత్రి హెచ్.డి.దేవెగౌడ వీల్‌ఛైర్‌లో వచ్చి ఓటు వేశారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ఇద్దరూ చేయి చేయా పట్టుకుని నడుచుకుంటూ పోలింగ్ బూత్ వద్దకు రావడం కనిపించింది. ఉదయం నుండే ఎంపీలు క్యూలైనులో నిలబడ్డారు. బిఆర్‌ఎస్ (4), బిజెడి(7)పార్టీలకు చెందిన 11 మంది ఎంపీలు ఈ ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో తాము పాల్గొనడం లేదని ఆ పార్టీల నాయకత్వాలు ముందే ప్రకటించాయి. మధ్యాహ్నంలోపే ముమ్మర ఓటింగ్ జరిగింది. జమ్మూ,కశ్మీరు బారాముల్లా నుండి లోక్‌సభ ఎంపి, ఇంజనీర్ రషీద్ (58) పోలీసు కస్టడీ మధ్య కోర్టు అనుమతితో ఓటు వేసేందుకు వచ్చారు. 2019 నుండీ రషీద్ తీహార్ జైలులో ఉన్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) రైసీద్‌ను చట్టవిరుద్ధమైన కార్యకలాపాల నియంత్రణ చట్టం కింద అరెస్టు చేసింది. రషీద్ ఉగ్రవాదులకు నిధులు సమకూరుస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

### ప్రధానమంత్రి అభినందన

ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి మోదీ రాధాకృష్ణన్‌కు అభినందనలు తెలియజేశారు. రాధాకృష్ణన్ ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్ పదవిలో ఉన్నారు. ఆయన కరడుగట్టిన ఆర్‌ఎస్‌ఎస్ వాది. తొలుత ఆయన జనసంఘ్‌లో ఉన్నారు. తర్వాత తమిళనాడు బిజెపిలో పాత్ర వహించారు. ''అభినందనలు తిరు సి.పి.రాధాకృష్ణన్‌జీ, మీరు మీ జీవితాన్ని సమాజ సేవకే అంకిం చేశారు, పేదల సాధికారతకు ధారవోశారు'' అని మోదీ తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు. ఇంకా రెండు సంవత్సరాలు గడువు ఉండగానే, జగదీప్ ధన్‌కర్ జులై 21న ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు.

### రాజ్యాంగం కోసం పోరు కొనసాగుతుంది
### జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

ఈ ఎన్నిక రాజ్యాంగంకోసం జరిగే పోరాటమని, ఈ ఎన్నిక తర్వాత కూడా ఈ పోరాటం కొనసాగుతుందని 'ఇండియా కూటమి' ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి చెప్పారు. (''ప్రజల మనస్సాక్షిని మేల్కొలిపేందుకు మాత్రమే నేను ప్రయత్నం చేస్తున్నారు, ది రాజ్యాంగంకోసం జరిగే పోరాటం, ఈ పోరు కొనసాగుతుంది, నామీద ప్రేమచూపించి నన్ను పోటీలో ఉంచిన అందరికీ, ప్రతిస్పందించిన పౌర సమాజానికీ నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను'' అని సుదర్శన్‌రెడ్డి చెప్పారు.

ఎన్‌డిఎ అధికార కూటమి తరపున ఎన్నికల ప్రక్రియకు ఏజంట్లుగా కేంద్రమంత్రి కిరెణ్ రిజిజు, రామ్ మోహన్ నాయుడుతో పాటు శివసేన లోక్‌సభ ఎంపి శ్రీకాంత్ షిండే నియమితులయ్యారు. మేం కేవలం గెలుస్తామనే భరోసా మాత్రమే కాదు, చాలా ఖచ్చితమైన విజయం సాధిస్తామన్న విశ్వాసం ఉంది అని కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ పోలింగ్ సమయంలో పాత్రికేయులతో అన్నారు.

## ఆర్‌ఆర్‌ఆర్‌కు 90శాతం భూసేకరణ పూర్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రీజినల్ రింగు రోడ్డుకు (ఉత్తర భాగం) సంబంధించి 90 శాతం భూ సేకరణ పూర్తయినందున పనుల ప్రారంభానికి ఆర్థిక, క్యాబినెట్ అనుమతులు ఇప్పించాలని కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కోరారు. జాతీయ రహదారులు, రోడ్డు రవాణా శాఖ (ఎంఆర్‌టిహెచ్) నిబంధనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన డిపిఆర్‌కు అనగుణంగా రీజినల్ రింగు రోడ్డు (దక్షిణ భాగం) కు అనుమతులు ఇప్పించాలని సిఎం విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ మంగళవారం సాయంత్రం కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సిఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రావిర్యాల ఆమన్‌గల్ మన్ననూర్ రహదారిని నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిగా నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. మన్ననూర్‌శ్రీశైలం (ఎన్‌హెచ్ 765) నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్‌కు అనుమతించాలని కేంద్ర మంత్రి గడ్కరీని సిఎం రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్ మంచిర్యాల మధ్య నూతన గ్రీన్ ఫీల్డ్ రహదారిని జాతీయ రహదారిగా మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు 12 వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారికి అనుమతి ఇవ్వాలని కేంద్ర మంత్రికి సిఎం విజ్ఞప్తి చేశారు.

# పత్తిపై దిగుమతి సుంకం ఎత్తివేత

### మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అమెరికా దిగుమతి పత్తిపై దిగుమతి సుంకాన్ని ఎత్తివేయడం మన రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టడమేనని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఒకవైపు తెలంగాణ ప్రభుత్వం పామాయిల్ పంటపై దిగుమతి సుంకాలను పెంచి పామాయిల్ రైతులను రక్షించాలని కేంద్రాన్ని కోరుతుంటే, అమెరికా నుండి దిగుమతి అయ్యే పత్తిపై సుంకాన్ని ఎత్తివేయడం కేంద్ర ద్వంద్వ వైఖరిని ప్రతిబింబిస్తోందని మంత్రి అన్నారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద పత్తి ఉత్పత్తిదారుల్లో ఒకటైనప్పటికీ, అమెరికా ఒత్తిడికి మేరకు పత్తి దిగుమతులపై అమలులో ఉన్న 11 శాతం సుంకాన్ని (బిసిడి + ఎఐడిసి+ ఎస్‌డబ్ల్యుఎస్) ప్రధాని మోదీ ప్రభుత్వం ఎత్తివేసిన నిర్ణయం దేశీయ రైతులకు తీవ్రమైన దెబ్బ అన్నారు. ఆగస్టు 19 నుండి సెప్టెంబర్ 30వ తేదీ వరకు మాత్రమేనని ప్రకటించిన ఈ మినహాయింపును తాజాగా డిసెంబర్ 31వ తేదీ వరకు పొడిగించడం రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకమని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ సదస్సులో రైతుల ప్రయోజనమే తమ ప్రథమ కర్తవ్యమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించి అందుకు వ్యతిరేకంగా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం శోచనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల పత్తి రైతులు ఆర్థికంగా నష్టపోనున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా వాడకాన్ని తగ్గించడానికి శాశ్వత చర్యలు తీసుకొనేందుకు వీలుగా రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు కల్పించాలని, ఆర్గానిక్ పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించి దేశంలో యూరియా వాడకాన్ని తగ్గించేలా దీర్ఘకాల చర్యలు చేపట్టాలని మంత్రి కేంద్రాన్ని డిమాండ్ చేశారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## మిషన్ భగీరథ ట్యాంక్‌లో దిగి ఊపిరాడక ముగ్గురు కార్మికులు మృతి



ప్రజాపక్షం/చర్ల : మండల పరిధిలోని ఉంజుపల్లి గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌లో సెంట్రింగ్ సరిచేసే నిమిత్తం దిగిన ముగ్గురు కార్మికులు మృతి చెందారు. మొదట దిగిన కూలీ ఊపిరాడక అపస్మారక స్థితిలోకి వెళ్లగా అతన్ని కాపాడేందుకు వెళ్లిన మరో ముగ్గురు కూలీల్లో ఇద్దరు కూడా మృతి చెందారు. వారిని చర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించగా ఇద్దరి మృతి చెందగా, మరో ఇద్దర్ని భద్రాచలం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారిలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. మృత చెందిన వారిలో కాకా మహేష్, నీలం తులసీ రామ్, ఏపిలోని చోడవరంకు చెందిన మరో వ్యక్తి ఉన్నారు. సిఐ రాజు వర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజా ఉద్యమ దిక్సూచి సురవరం

వందేళ్ల పోరాట నవ యవ్వని సిపిఐ
ప్రజా ఉద్యమ నిర్మాణమే
సురవరానికి సరైన నివాళి
సంస్మరణ సభలో
అఖిలపక్ష నేతలు




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : అరవై ఐదేళ్ల ప్రజా జీవితంలో ఎన్నో ఉద్యమాలకు నేతృత్వం వహించి చారిత్రిక ఉద్యమ విజయాలను చవిచూసిన సురవరం సుధాకర్‌రెడ్డి ప్రజా ఉద్యమ దిక్సూచి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. విద్యార్థి దశ నుంచే ధిక్కార స్వరంతో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన సురవరం అంచలంచెలుగా ఎదిగి కమ్యూనిస్టు పార్టీలో అత్యున్నత స్థాయికి చేరారని ఆయన జీవితం ఎందరికో ఆదర్శమని ఆయన స్ఫూర్తి భవిష్యత్తు ఉద్యమానికి ప్రేరణ అని ఆయన తెలిపారు. ఇటీవల మరణించిన సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో జరిగింది. సభకు ముందు సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి వివిధ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సురవరం సుధాకర్‌రెడ్డి మరణానికి సంతాప సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి నిరంతర అధ్యయనశీలి అని తన వాదన పటిమతో ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపారన్నారు. కమ్యూనిస్టులు మరణించి సైతం ప్రజల మదిలో జీవిస్తారని సుధాకర్ రెడ్డి అదే కొవకు చెందిన వారన్నారు. వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి మరణంతో ఓ ప్రజా గొంతుక మూగబోయిందన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం తపించిన సుధాకర్‌రెడ్డి భారత కమ్యూనిస్టు పార్టీలో చంద్ర రాజేశ్వరరావు తర్వాత అత్యున్నత స్థాయికి చేరిన తెలుగుబిడ్డ అని ఆయన తెలిపారు. పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలోనే తాను ఓనమాలు నేర్చుకున్నానని సుధాకర్‌రెడ్డి లాంటి నేతలు మరణించడం ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. కమ్యూనిస్టులకు ప్రజలే ముఖ్యమని పదవులు కాదని తెలిపిన పాయం తాను ఇప్పటికీ ఎప్పటికీ కమ్యూనిస్టులను గౌరవిస్తూనే ఉంటానన్నారు. మాజీ శాసన సభ్యులు గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ కమ్యూనిస్టులు మరణించిన ప్రజల గుండెల్లో జీవించి ఉంటారని ఆయన తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఆవునూరి మధు, సిపిఎం నాయకులు అన్నవరపు సత్యనారాయణ, మాజీ జెడ్పి ఛైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, ఆళ్ల మురళి, టిడిపి నాయకులు కె.అనంతరాములు, వివిధ ప్రజా సంఘాల నేతలతో పాటు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, వెంకటేశ్వరరావు, కె.సారయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మి కుమారి, నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేందర్, ఉదయ్ భాస్కర్, కొత్తగూడెం సొసైటీ ఛైర్మన్ మండే వీరహన్మంతరావు, గ్రంథాలయ ఛైర్మన్ పసుపులేటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు. కంచర్ల జమలయ్య ఆహుతులను వేదికపైకి ఆహ్వానించారు.

# పెట్టుబడులతో తెలంగాణకు రండి

తిరుపూరు పారిశ్రామికవేత్తలతో
మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణాలో దుస్తుల (అప్పెరల్) పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాల్సిందిగా రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తమిళనాడులోని తిరుపూరు దుస్తుల తయారీపరిశ్రమల యాజమాన్యాలను ఆహ్వానించారు. ఇక్కడి ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో వస్త్ర పరిశ్రమలు నెలకొల్పడానికి ప్రపంచస్థాయి మౌలిక వసతులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. తమిళనాడులోని కోయంబత్తూరు, తిరుపూరులను మంగళవారం ఆయన సందర్శించిన సందర్భంగా అక్కడి పారిశ్రామిక వర్గాలు, ఎగుమతిదారులతో మాట్లాడారు. అతి పెద్ద అప్పెరల్ తయారీ కేంద్రంగా తిరుపూరు గ్లోబల్ లీడర్‌గా ఎదిగిందని ఆయన అన్నారు. 10 వేల దుస్తుల పరిశ్రమలతో 'నిట్ వేర్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా'గా తిరుపూరు లక్షల మందికి ఉపాధి కల్పిస్తోందని ప్రశంసించారు. దేశంలోని 90 శాతం దుస్తులు, క్యాజువల్ వేర్, స్పోర్ట్స్‌వేర్, సాక్సులు, టోపీల లాంటివి కాటన్ ఉత్పత్తులు తిరుపూరు నుంచే ఎగుమతి అవుతున్నాయని చెప్పారు. 1990 నుంచి తిరుపూరు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన దుస్తులను ఎగుమతి చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేసారు. నాణ్యతతో కూడిన రెడీమేడ్స్ తయారీకి అవసరమయ్యే లాంగ్ స్టేపుల్ (పొడవు పోగుల) కాటన్ తెలంగాణాలో సమృద్ధిగా అందుబాటులో ఉందని శ్రీధర్‌బాబు వారికి వివరించారు. తెలంగాణా వ్యవసాయ, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసే రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరు కావాల్సిందిగా వారిని కోరారు. త్వరలో దీనికి సంబంధించిన సమాచారం అందజేస్తామని తెలిపారు.

అందరితో చర్చించిన తర్వాత తెలంగాణా నూతన టెక్స్ టైల్స్ పాలసీని రూపొందిస్తామని వెల్లడించారు. అమెరికా విధించిన 50 శాతం సుంకాల నేపథ్యంలో ఎగుమతులు దెబ్బతిన్నాయని, ఈ సమయంలో వస్త్ర పరిశ్రమ చేపట్టాల్సిన కార్యాచరణపైన కూడా చర్చించవచ్చని శ్రీధర్ బాబు అన్నా రు. ఈ సందర్భంగా ఆయన హీరో ఫ్యాషన్ గ్రూప్ (రామ్ రాజ్ కాటన్స్) ఛైర్మన్ కెఆర్ నాగరాజన్, ఎండి సుందరమూర్తిలను ప్రత్యేకంగా కలిసారు. సౌత్ ఇండియా మిల్స్ అసోసియేషన్ (సిమా) సెక్రటరీ జనరల్ కె.సెల్వరాజ్, సంస్థ సభ్యులను తెలంగాణాలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరారు. సులభతరపారిశ్రామిక విధానాల అమలుతోతమ ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేసారు. తిరుపూరు ఎగుమతిదారుల సంఘం గౌరవఛైర్మన్ డా.ఎ.శక్తివేల్, అధ్యక్షుడు కెఎం.సుబ్రమణియన్, కార్యవర్గ సభ్యులు తితుకుమరన్, కుమార్ దొరైస్వామి, సౌత్ ఇండియా మిల్స్ అసోసియేషన్‌కు చెందిన కె.సెల్వరాజ్, గోపీ కుమార్ (చంద్ర గ్రూప్), ప్రతినిధి ఎం.ప్రభ దామోదరన్(ఇండియన్ టెక్స్ ప్రెన్యూర్స్ ఫెడరేషన్ కోయంబత్తూరు)లతో శ్రీధర్‌బాబు సమావేశమయ్యారు. పెట్టుబడులతో వస్తే వారికి కావాల్సిన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు తిరుపూరులోని నేతాజీ అప్పెరల్ పార్కును సందర్శించి ఇండస్ట్రీ ప్రతినిధులతో మాట్లాడారు. పర్యటనలో టిజిఐఐసి ఎండీ శశాంక, తెలంగాణా టెక్స్‌టైల్స్, అప్పెరల్ విభాగం డైరెక్టర్ ధరణి కుమార్ కోగంటి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు క్రమశిక్షణకు సూచిక

'ఆల్ ఇండియా ప్రిజన్స్ డ్యూటీ మీట్-2025' ప్రారంభ సభలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ




ప్రజాపక్షం/హైదరాబాద్: క్రీడలు పోటీలకు మాత్రమే కాకుండా క్రమశిక్షణ, విధులు, అంకిత భావానికి సూచికగా నిలుస్తాయని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. హైదరాబాద్‌లోని ఆర్‌బివిఆర్‌ఆర్ తెలంగాణ పోలీసు అకాడమీలో జరిగిన 7వ ఆల్ ఇండియా ప్రిజన్స్ డ్యూటీ మీట్2025 ప్రారంభోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. అనంతరం దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాల జైళ్ల శాఖల నుంచి వచ్చిన క్రీడాకారులను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ.. జైళ్ల శాఖ అధికారులు, సిబ్బంది క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావాన్ని ఆయన ప్రశంసించారు. ప్రిజన్ సిబ్బంది, ప్రజల దృష్టికి దూరంగా ఉన్నప్పటికీ, అంతర్గత భద్రతను కాపాడడంలో జైళ్లలో సంస్కరణలను సాధ్యం చేయడంలో కీలక పాత్ర పోషిస్తారని ఆయన హైలైట్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం జైళ్ల సంస్కరణలలో చేస్తున్న ప్రగతిశీల చర్యలను ఆయన కొనియాడారు. 2024 రిపబ్లిక్ డే సందర్భంగా 231 మంది ఖైదీలను మంచి ప్రవర్తన కారణంగా విడుదల చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ విడుదల కేవలం శిక్షా రాయితీలు మాత్రమే కాక, వారికి కొత్త జీవితాన్ని అందించే ఆశాకిరణాలని ఆయన అన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో 7వ అఖిల భారత జైలు డ్యూటీ మీట్ – 2025 సెప్టెంబర్ 9 నుండి 11 వరకు హైదరాబాదులోని ఆర్‌బివిఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో ఘనంగా ప్రారంభమయ్యాయి. దేశంలోని 21 రాష్ట్రాలు మరియు 3 కేంద్రపాలిత ప్రాంతాల నుండి వచ్చిన 1,300 మందికి పైగా జైలు సిబ్బంది (ఇందులో 184 మంది మహిళలు) పాల్గొని 36 విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. వీటిలో ప్రథమ చికిత్స, వెల్ఫేర్ పథకాలు, క్విజ్, కంప్యూటర్ నైపుణ్యం వంటి వృత్తి సంబంధిత పోటీలు, అలాగే అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, కరాటే, క్రావ్ మాగా, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం వంటి క్రీడలు, సాంస్కృతిక పోటీలు ఉంటాయి. ఈ ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్రం రెండవసారి ఆతిథ్యం ఇస్తోంది. 2015లో తొలిసారి నిర్వహించగా, 2022లో అహ్మదాబాద్‌లో జరిగిన 6వ జైలు డ్యూటీ మీట్‌లో తెలంగాణ రాష్ట్రం ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. ఈసారి తొలిసారిగా ఆల్ ఇండియా టెక్నో ఎక్స్‌పో మరియు జైలు ఉత్పత్తుల ప్రదర్శన స్టాళ్లు కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జైళ్ల శాఖ డిజి డా.సౌమ్య మిశ్రా, డిజిపి డాక్టర్ జితేందర్, అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్తా తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ పరీక్షలు నిర్వహించాలి

హైకోర్ట్ తీర్పు చరిత్రాత్మకం..
బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
కెటి.రామారావు డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్: గ్రూప్ 1 పరీక్షల అంశంలో హైకోర్టు చరిత్రాత్మక తీర్పునిచ్చిందని, ప్రభుత్వం కేవలం రీవాల్యుయేషన్‌కు పోకుండా, గతంలో తప్పు చేసిన వారి చేతికే మళ్లీ సమస్యను అప్పగించకుండా తిరిగి పరీక్షలను నిర్వహించాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు డిమాండ్ చేశారు. టిఎస్‌పిఎస్‌సి అవినీతి, పరీక్షల అస్తవ్యస్త నిర్వహణపై సిట్టింగ్ హైకోర్ట్ లేదా సుప్రీం కోర్ట్ జడ్జితో జ్యూడిషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసి, సమగ్రంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలను అమ్ముకుంటూ వ్యాపారం చేసిన బ్రోకర్లు, తప్పిదాలు చేసిన అధికారులు బయటకు రావాలన్నారు. ఎవరు ఉద్యోగాలను అమ్ముకున్నారో తేలాల్సిన అవసరం ఉందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్ని ఉద్యోగాలు ఇస్తుందో తేల్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రెండు లక్షల ఉద్యోగాల విషయంలో వాస్తవాల కోసం ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. గతంలో ప్రశ్నాపత్రం లీక్ ఘటన వెలుగులోకి వచ్చినప్పుడు అప్పటి సిఎం కెసిఆర్ వెంటనే పరీక్షను రద్దు చేశారని కెటిఆర్ గుర్తు చేశారు.

**'గ్రూప్–1 తీర్పు' ప్రభుత్వానికి చెంపపెట్టు : రాంచందర్ రావు**

గ్రూప్1 పరీక్ష పత్రాల రీవాల్యుయేషన్ చేయాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. గ్రూప్1 పరీక్ష నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. నోటిఫికేషన్ విడుదల నుండి మూల్యాంకణం వరకు అన్ని తప్పుడు పద్ధతులలోనే టిజిపిఎస్‌సి అవలంభించిందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని, వేలాది మంది అభ్యర్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెలగాటమాడిందని దుయ్యబట్టారు. ఒకే పరీక్ష కేంద్రంలోని ఒకే గదిలో ఎక్కువ మంది అభ్యర్థులు ఎంపిక కావడం, మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని రాంచందర్ రావు ఆరోపించారు.

**తీర్పును పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటాం : మంత్రి జూపల్లి**

గ్రూప్ 1 విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. కోర్టు తీర్పును పరిశీలించి ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని మంత్రి చెప్పారు. పదేళ్లు గ్రూప్ 1 పరీక్ష నిర్వహించలేని అసమర్ధత గత బిఆర్‌ఎస్ ప్రభుత్వానిదని మండిపడ్డారు.

**నిరుద్యోగులకు మంచి చేసే నిర్ణయం తీసుకుంటాం : ఎంపి చామల**

నిరుద్యోగులకు మంచి చేసే విధంగా టిజిపిఎస్‌సి, ప్రభుత్వం కలిసి నిర్ణయం తీసుకుంటుందని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. గ్రూప్ 1 విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బిఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు అడ్డగోలుగా కామెంట్స్ చేస్తున్నారని విమర్శించారు. బిఆర్‌ఎస్ నేతలు మీరు పరిష్కారం గురించి మాట్లాడాల్సింది పోయి రాజకీయంగా మాట్లాడుతుండడం దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. డిఎస్‌సి, గ్రూప్1,2,4 పరీక్షలు పెట్టని బిఆర్‌ఎస్ నేతలు నేడు మాట్లాడడం గర్హనీయమన్నారు. టిజిపిఎస్‌సి పరీక్ష పేపర్లను జిరాక్స్ సెంటర్ల వద్ద అమ్ముకున్నది బిఆర్‌ఎస్ నేతలు కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత డిఎస్‌సి ద్వారా11 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, గ్రూప్ 1,2 పరీక్షలు పెట్టామని, ఉద్యోగాలను భర్తీ చేయాలనే ఆలోచనతో ముందుకెళ్తున్నామన్నారు.

## ఎల్లంపల్లి ప్రాజెక్టును పూర్తి చేసింది టిఆర్‌ఎస్సే : హరీశ్‌రావు



ప్రజాపక్షం/హైదరాబాద్: టిఆర్‌ఎస్ అధికారంలోనికి వచ్చిన తర్వాత ఎల్లంపల్లి ప్రాజెక్టును రూ.2052 కోట్లతో పూర్తి చేసి, 2016లో పూర్తిస్థాయిలో 20 టిఎంసిల నీటిని నింపామని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఎల్లంపల్లి నుండి మిడ్ మానేరు వరకు కెనాల్స్, గ్రావిటీ కెనాల్, రిజర్వాయర్లు, సబ్ స్టేషన్లు, పంప్ హౌస్‌లను నిర్మించిందే బిఆర్‌ఎస్ అని, ఇవన్నీ కాళేశ్వరం ప్రాజెక్ట్ భాగంగానే నిర్మించామని వివరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌ఎలు సబితా ఇంద్రారెడ్డి, ముఠాగోపాల్, కాలేరువెంకటేష్‌తో కలిసి హరీశ్‌రావు మాట్లాడుతూ సిఎం శంకుస్థాపన చేసిన వాటికి కూడా బిఆర్‌ఎస్ నిర్మించిన కాళేశ్వరం నీళ్లనే తీసుకెళ్తున్నారన్నారు. ఎల్లంపల్లి కెపాసిటీ 20 టిఎంసిలులు డెడ్ స్టోరేజ్ మూడు టిఎంసిలు, మిగిలిన 17 టిఎంసిల్లో సొంత ఆయకట్టు 1,65,000 ఎకరాలు అంటే 12 టిఎంసిలు పోతాయని, ఎన్‌టిపిసి విద్యుత్ ఉత్పత్తికి ఆరున్నర టిఎంసిలు అని అన్నారు. ఎల్లంపల్లి కెపాసిటీకి మించి మరో 20 టిఎంసిలు హైదరాబాద్‌కు ఎలా తెస్తారని ఆయన సిఎంను ప్రశ్నించారు. ఎల్లంపల్లి నుండి మల్లన్న సాగర్‌కు నీళ్ల గాలిలో వస్తున్నాయా అని ఎద్దేవా చేశారు. ఎల్లంపల్లి నుండి హైదరాబాద్‌కు మంచినీళ్ల తీసుకొచ్చే లైన్‌లో రైల్వే, మిలిటరీ స్థలాల అనుమతులు పెండింగ్ ఉంటే, రెండు సంవత్సరాల్లో రైల్వే, మిలిటరీ అధికారులను ఒప్పించి, తాము మెప్పించి హైదరాబాద్‌కు వాటర్ సప్లై స్కీమ్‌ను పూర్తి చేశామని హరీశ్‌రావు వివరించారు. కృష్ణ ఫేజ్ నాలుగు పనులను కూడా పూర్తి చేసి కృష్ణ నీళ్లను కూడా హైదరాబాద్ తెచ్చిందే కెసిఆర్ అని, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రూ 1600 కోట్లను ఖర్చు చేసి 56 రిజర్వాయర్లు, 2600 కిలోమీటర్ల పైప్‌లైన్లు ఏర్పాటు చేశామన్నారు. నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజ్ నుంచి కూడా నీళ్ల తీసుకోవాలని,భవిష్యత్తులో వందేళ్ల కోసం నాగార్జునసాగర్ నుండి 60 టిఎంసిల నీళ్ల తీసుకోరావాలని సుంకిశాలను ప్రారంభించామని తెలిపారు.

## 16న హ్యూమన్ ట్రాఫికింగ్ – బాండెడ్ లేబర్ సమస్యలపై మీడియా వర్క్‌షాప్

ప్రజాపక్షం/హైదరాబాద్: 'హ్యూమన్ ట్రాఫికింగ్ – బాండెడ్ లేబర్' అంశాలపై ప్రత్యేక మీడియా వర్క్‌షాప్‌ను ఈ నెల 16వ తేదీన ఉదయం 10 గంటలకు తెలంగాణ మీడియా అకాడమి, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ (ఐజెఎం) సంయుక్త ఆధ్వర్యంలో జరగనుంది. మీడియా ప్రతినిధులకు అవగాహన పెంపొందించడం, నేరాల తీవ్రతను అర్థం చేసుకోవడం, బాధితుల పట్ల ప్రదర్శించే వైఖరి లక్ష్యంతో ఈ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో హ్యూమన్ ట్రాఫికింగ్, బాండెడ్ లేబర్ బాధితుల పునరావాసం, న్యాయపరమైన, సమాజపరమైన మద్దతు అంశాలపై నిపుణులు ప్రసంగించనున్నారు. మీడియా పాత్ర, బాధితుల గౌరవాన్ని కాపాడుతూ సమగ్ర కథనాలను తయారు చేయడం వంటి అంశాలపై ప్రత్యేక చర్చలు జరుగుతాయి. సివిల్ సొసైటీ ప్రతినిధులు, న్యాయ నిపుణులు, అనుభవజ్ఞులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. ఈ వేదిక జర్నలిస్టులు, ఎడిటోరియల్ టీమ్‌లకు అత్యంత ఉపయోగకరంగా ఉండనుంది. తెలంగాణ మీడియా అకాడమి ఈ సమస్యపై జర్నలిజానికి అవసరమైన అవగాహనను పెంచే లక్ష్యంతో ఇటువంటి శిక్షణా కార్యక్రమాలను నిత్యం నిర్వహిస్తూ వస్తోందని తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ఐజెఎం సంస్థ ఈ రంగంలో దేశవ్యాప్తంగా చేసిన అవిశ్రాంత సేవను మనందరికీ పరిచయం చేస్తూ, న్యాయవ్యవస్థతో కలిసి పనిచేస్తోందని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనదలచిన మీడియా ప్రతినిధులు ఈనెల 15వ తేదీన మధ్యాహ్నం 1 గంట వరకు తమ పేరు, సంస్థ పేరు, హోదా, పనిచేస్తున్న ప్రదేశంతోపాటు తమ మొబైల్ నెంబర్‌ను మీడియా అకాడమి కార్యాలయ మేనేజర్ మొబైల్ నెంబర్ 7093600977కు వాట్సాప్ ద్వారా రిజిష్టర్ చేసుకోవాలన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై సిబిఐ విచారణలో కుట్ర

బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సిబిఐ విచారణ జరిపించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని బిజెపి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బిఆర్‌ఎస్‌ను కాపాడే ప్రయత్నంలో భాగంగానే కేవలం మూడు బ్యారేజీలపై మాత్రమే విచారణకు అప్పగిస్తూ జిఓ జారీ చేసిందని విమర్శించారు. కానీ మూడు బ్యారేజీల విలువ కేవలం రూ.12 వేల కోట్లు మాత్రమేనని, మిగతా లక్షల కోట్ల అవినీతిపై స్పష్టత లేదన్నారు. ఘోష్ కమిషన్ ఏర్పాటు చేసినా, మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలకు మరమ్మతులు చేశారని, నేషనల్ డ్యామ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ సలహాలు కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. ఒక కేసుపై విచారణ మొదలైనప్పుడు ఆధారాలను చెడగొట్టడం నేరమని, ఘోష్ కమిషన్ ఏర్పడిన తర్వాత రిపేర్లు చేయించడం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలో స్పష్టంగా ఉందన్నారు. ప్రభుత్వం జిఓలో 'టరమ్స్ అండ్ రిఫరెన్స్'ను ఎందుకు చేర్చలేకపోతుందని ప్రశ్నించారు. వేల కోట్ల రూపాయల విలువైన కాంట్రాక్టులను టెండర్లు లేకుండా ఎవరికి ఇచ్చారు, నాణ్యత లేకుండా పనులు చేసిన కంపెనీలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే అంశాలను జిఓలో పేర్కొనలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అన్ని అవినీతి అంశాలపై పూర్తి విచారణ జరగాలంటే జిఓలో సవరణలు తప్పనిసరి అని పాయల్ శంకర్ అన్నారు. లేకపోతే కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలు కుమ్మక్కైనట్లే భావించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి 15 రోజుల గడువు ఇస్తున్నామని, జిఓను సవరించి పూర్తిస్థాయి సిబిఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈ జిఓ సవరణపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు.

## కెటిఆర్..నీ నోటి దూల తగ్గించుకో..

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ప్రజాపక్షం/హైదరాబాద్: పార్టీ ఫిరాయింపులపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెగ వాగుతున్నాడని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆరోపించారు. గాంధీభవన్‌లో మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. కెటిఆర్.. నీ నోటి దూల తగ్గించుకో.. బజారు మాటలు ఆపు అంటూ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మారిన ఎంఎల్‌ఎలను ఆడా కాదు మగా కాదు అని నోటికొచ్చినట్లు మాట్లాడుతవా..? అని కెటిఆర్‌ను ప్రశ్నించారు. పదేళ్లలో నీ పార్టీలో చేరిన వారంతా అదే కోవకు చెందుతారా..? నువ్వు మొగాడివి అయితే చెప్పు ముందు అని అన్నారు. ప్రతిపక్ష పార్టీ ఎంఎల్‌ఎలని మంత్రి వర్గంలోకి తీసుకున్నవారు ఏ జాబితాలోకి వస్తారు..? ఆ నాడు నీకు ఈ జాతులు గుర్తుకు రాలేదా అని కెటిఆర్‌ను సూటిగా ప్రశ్నించారు. పార్టీ మారినట్లు ఆరోపణలు ఉన్న పది మంది ఎంఎల్‌ఎలకు స్పీకర్ నోటీసులు ఇచ్చారు. అందుకు వాళ్లు సమాధానం ఇస్తారు.. దాని ఆధారంగా స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని అన్నారు.

## దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు

మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రజాపక్షం/హైదరాబాద్: ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఎక్కువ మంది ప్రజలు కోరుతున్నారని ధరణి సమస్యలు, పాస్ పుస్తకాల జారీపై ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయని, దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులకు మంజూరు చేస్తామని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. గాంధీభవన్‌లో మంగళవారం మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొని ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. చర్లపల్లిలోని డ్రగ్స్ తయారీ ఫ్యాక్టరీ కేసులో విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చామని, నివేదిక ఆధారంగా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

## మేధావులను కలుస్తా :కవిత



ప్రజాపక్షం/హైదరాబాద్: సామాజిక తెలంగాణ కోసం లెఫ్ట్, రైట్ వింగ్ నాయకులు, మేధావులను కలుస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కెసిఆర్ మూడవ సారి గెలిస్తే సామాజిక తెలంగాణ చేసే వారని, ఆయన అజెండాను జాగృతి ముందుకు తీసుకెళ్తుందన్నారు. 'కాళోజీ నారాయణ జయంతి, చాకలి ఐలమ్మ వర్ధంతి' సందర్భంగా హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో వారి చిత్రపటాలకు కవిత మంగళవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలిందన్న సిఎం రేవంత్ రెడ్డి అదే ప్రాజెక్ట్‌లోని మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు నీళ్లు ఎలా తెస్తున్నారని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్ట్‌లో రేవంత్‌రెడ్డి భారీగా అవినీతికి పాల్పడుతున్నారని కవిత ఆరోపించారు. ఈ సమావేశంలో ప్రముఖ కవులు, రచయితలు ఉషారాణి, డాక్టర్ కాంచనపల్లి, డాక్టర్ చమన్ సింగ్, లక్ష్మీనారాయణ, తిరుమల శ్రీనివాస్ ఆర్య, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: మల్కాజ్‌గిరి సర్కిల్-28**
NIT No. 33/EE-28/SBZ/GHMC/2025-2026 టెండర్ ప్రకటన
పని పేరు: నిర్వహణ పనులు - ఇతరాలు-01, అంచనా విలువ: రూ.5.20లక్షలు, బిడ్స్ దాఖలుకు ప్రారంభ తేది & సమయం / ఆఖరి తేది & సమయం: 09.09.2025న మ.01.00గం.ల నుండి 16.09.2025న మ.01.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్: 9154796465, 7331189186. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 7808-PP/CL/ADVT/1/2025-26, Date: 09-09-2025

**కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం**
ఇ-మెయిల్: knrcmnr@rediffmail.com
No. E1/DB/MCK/8201/recall/MCK/2025-26 'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ రీకాల్ టెండర్ ప్రకటన తేది: 08.09.2025
వివిధ గ్రాంట్ల కింద రూ.135.74లక్షల అంచనా వ్యయంతో 20 పనులకుగాను వివిధ అభివృద్ధి, నిర్వహణ మరియు వెహికిల్ ఇన్సూరెన్స్. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 09.09.2025న సా.04.00గం.ల నుండి, బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ఆఖరి తేది: 19.09.2025న సా.04.00గం.ల వరకు, మరిన్ని వివరాలకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- కమిషనర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్
DIPR R.O. No. : 7777-PP/CL/ADVT/1/2025-26, Date: 09-09-2025

భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సి.పి. రాధాకృష్ణన్‌కు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రోబో టెక్నాలజీతో పూడిక తొలగింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అమీర్ పేట మెట్రో స్టేషన్ పరిసరాలు జలమయం అయిన నేపథ్యంలో, అక్కడ చేపట్టిన పూడిక తొలగింపు పనులను హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ మంగళవారం పరిశీలించారు. సంబంధిత శాఖలు నిర్వహించిన అధ్యయనంలో, మెట్రో స్టేషన్ కింద ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లైన్లు మూసుకుపోయినట్లు గుర్తించారు. దీంతో హైడ్రా, జిహెచ్‌ఎంసి సంయుక్తంగా రోబో టెక్నాలజీతో పూడిక తొలగింపు పనులను ప్రారంభించాయి.

## రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోనే ఉద్యమకారులకు గుర్తింపు

### స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలోనే ఉద్యమకారులకు గుర్తింపు లభించిందని స్పోర్ట్స్ అథారిటి ఛైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. కవి తెలంగాణ ఉద్యమ కారుడు స్వాతంత్ర సమరయోధుడు పద్మ విభూషణ్ స్వర్గీయ కాళోజి నారాయణరావు 111వ జయంతి సందర్భంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ..కాళోజి నారాయణరావ్ తన జీవితాంతం ప్రజా సంఘాలతో మమేకమై సామాజిక సమస్యలపై, ప్రాంతీయ వివక్షతలపై , నిరంతరం తన రచనలతో జనాన్ని జాగృతం చేసిన ప్రజల మనిషని అని అన్నారు. ప్రజా గొంతుకలా నిలబడ్డ ఉద్యమ ప్రతిధ్వని కాళోజి అని అన్నారు. నిజాం నిరంకుశ పాలనకు దమన నీతికి అరాచకత్వానికి వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర సమరయోధుడు స్వర్గీయప్రధాని పివి నరసింహారావు అత్యంత సన్నిహితుడైన కాళోజి నారాయణరావు పద్మ విభూషణ్ తో కాంగ్రెస్ ప్రభుత్వం సత్కరించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్,సుజాత, పద్మావతి, ఇంజనీర్ అశోక్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్లు కేఆర్ భాట్టర్,కళ్యాణి, పి.ఆర్.ఓ సురేష్ కాలేరు, కోచ్ లు, కార్యాలయ సిబ్బంది నాలుగో తరగతి సిబ్బంది పలువురు పాల్గొన్నారు.



## జలమండలిలో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జలమండలి పర్సనల్ డైరెక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, ఆపరేషన్స్ డైరెక్టర్ వినోద్ భార్గవ, సిజిఎంలు పద్మజ, సురేష్ పాల్గొన్నారు.

### బిసి కమిషన్ కార్యాలయంలో..

ప్రజాకవి కాళోజీ నారాయణరావు 111వ జయంతి వేడుకలను బిసి కమిషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మిలు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ జి. నిరంజన్ మాట్లాడుతూ కాళోజీ గొప్ప కవి, ప్రజల పక్షపాతి అని కొనియాడారు. తెలంగాణ యాసను అవహేళన చేసినవారికి తమ కవితలతో ధీటైన సమాధానం ఇచ్చారని గుర్తుచేశారు. నిజాం వ్యతిరేక పోరాటంలో, ఆంధ్ర మహాసభలో ఆయన చురుకుగా పాల్గొన్నారని, శాసన మండలి సభ్యుడిగా కూడా సేవలందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ ఎన్. సునీత, సెక్షన్ ఆఫీసర్ సతీష్ కుమార్, రీసెర్చ్ అసోసియేట్ లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

## తెలంగాణ సమాజాన్ని జాగృతం చేసిన ప్రజాకవి కాళోజీ

### జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ సమాజాన్ని తన కవితలతో జాగృతం చేసిన గొప్ప ప్రజాకవి కాళోజీ అని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అన్నారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కర్ణన్ మాట్లాడుతూ తెలంగాణ భాషా సాహిత్యానికి కాళోజీ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ యాస, భాష కోసం ఆయన చేసిన కృషికి గుర్తింపుగా కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ గీతా రాధిక, చీఫ్ ఇంజనీర్ (నిర్వహణ) సహదేవ్ రత్నాకర్, విజిలెన్స్ అదనపు ఎస్‌పి, సుదర్శన్, డి.ఎస్.పి. నరసింహ రెడ్డి, పిఆర్ఓ మామిండ్ల దశరథం పాల్గొన్నారు.

### కాలుష్య నియంత్రణ మండలిలో..

## తెలంగాణ భాషా దినోత్సవం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాకవి పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టిజిపిసిబి) కార్యాలయంలో తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ వేడుకల్లో బోర్డు ఉన్నతాధికారులు కాళోజీ తెలంగాణ సాహిత్యం, స్వాతంత్ర్య పోరాటం, సామాజిక సేవలో చేసిన విశిష్టమైన కృషిని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ డి. కృపానంద్, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ వినయ్ కుమార్ నాయుడు, ప్రాజెక్ట్ ఆఫీసర్ బి. నాగేశ్వర రావులతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఐటిసి నుంచి అధిక ప్రోటీన్ కలిగిన ఆశీర్వాద్ ఆటా విడుదల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతదేశపు ప్రముఖ ప్యాకేజ్డ్ ఆటా బ్రాండ్ ఆశీర్వాద్ తమ కొత్త ఉత్పత్తి అత్యధిక ప్రోటీన్ తో ఆశీర్వాద్ గోధుమపిండిని విడుదల చేసింది. రోజువారీ ప్రోటీన్ అవసరాలను సాధారణ ఆహారం ద్వారా తీర్చే లక్ష్యంతో ఈ కొత్త ఆవిష్కరణను తీసుకొచ్చినట్లు ఐటిసి సంస్థ తెలిపింది. ప్రస్తుత జీవనశైలిలో ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్నారని, అందులో భాగంగా ప్రోటీన్ ఆహారాలను వెతుకుతున్నారని ఐటిసి పేర్కొంది. అధిక ప్రోటీన్ ఆహారాలు ఖర్చుతో కూడుకున్నవి కావడంతో, అందరికీ అందుబాటులో ఉండేలా ఈ ఆటాను రూపొందించారు. ఈ పిండిని ఎంతో జాగ్రత్తగా ఎంపిక చేసిన గోధుమ, 10 శాతం సోయా, శెనగలు, ఓట్స్ మిశ్రమంతో తయారు చేశారు. ఈ ఆటాలో ప్రతి 100 గ్రాములకు 15 గ్రాముల ప్రోటీన్ ఉంటుందని కంపెనీ తెలిపింది. ఈ పిండితో తయారు చేసిన మూడు రోటీలు ఒక వ్యక్తి రోజువారీ ప్రోటీన్ అవసరాలలో నాలుగో వంతును తీర్చగలదని ఐటిసి లిమిటెడ్ ఫుడ్స్ డివిజన్ ఆపరేటింగ్ ఆఫీసర్ అనుజ్ రుస్తగి తెలిపారు. గతంలో ప్రోటీన్ వినియోగం కేవలం జిమ్‌కు వెళ్లేవారు, ఫిట్‌నెస్ పట్ల ఆసక్తి ఉన్నవారికి మాత్రమే పరిమితమయ్యేదని, కానీ ఇప్పుడు ఈ పరిస్థితి మారిందని రుస్తగి అన్నారు. ఇంటి నుండి ప్రారంభమయ్యే ఆహారంలో ప్రోటీన్‌ను చేర్చడం ముఖ్యమని తాము నమ్ముతున్నామని, ఈ ఆటా భవిష్యత్తులో భారతీయ కుటుంబాలకు ప్రోటీన్ ప్రధాన ఆహారంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఆశీర్వాద్ హై ప్రోటీన్ ఆటా ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలోని ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో 1 కిలో, 5 కిలోల ప్యాకెట్లలో లభిస్తుందన్నారు.

## 2027 డిసెంబర్ నాటికి

# ఎస్ఎల్‌బిసి పనులు పూర్తి చేస్తాం

### మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎస్.ఎల్.బి.సి పునరుద్ధరణ అంశంపై నీటి పారుదల శాఖ ఇంజినీర్లు రూపొందించిన నివేదికపైన ఈ నెల 15న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో చర్చించి,ఆమోదం తెలిపన తర్వాత పనులు మొదలు పెడతామని నీటిపారదుల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. వచ్చే 2027, డిసెంబర్ నాటికి ఎస్.ఎల్.బి.సి పనులను పూర్తి చేస్తామన్నారు. తద్వారా నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు సమృద్ధిగా అందించడంతో పాటు సురక్షితమైన తాగునీటిని కూడా అందిస్తామని ఆయన తెలిపారు. హైదరాబాద్, ఎర్రమంజిల్, జలసౌధలోని నీటి పారుదల శాఖ కార్యాలయంలో నల్లగొండ,భువనగిరి లోకసభ నియోజకవర్గాలలో పరిధిలోని ప్రాజెక్టుల పురోగతిపై ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజాప్రతినిధులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్, ఎంఎల్ఎలు బాలు నాయక్,వేముల వీరేశం, కుంభం అనిల్ రెడ్డి, కుందూరు జయవీర్‌రెడ్డి,బత్తుల లక్ష్మారెడ్డి, మందుల సామ్యూల్,నీటి పారుదల శాఖ సలహాదారులు అదిత్యా దాస్ నాథ్,లెఫ్టినెంట్ జెనరల్ హార్పల్ సింగ్,ప్రత్యేక అధికారి పరిక్షిత్ మేహ్రా, ఆర్,ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు,నల్లగొండ, భోనగిరి యాదాద్రి, సూర్యపేట జిల్లాల కలెక్టర్లు ఇల త్రిపాఠి, మంత్రిప్రగడ హనుమంత రావు,తేజస్ నందాలాల్ పవర్‌లతో పాటు ఇ.ఎన్.సి లు అంజద్ హుస్సేన్, శ్రీనివాస్,రమేష్ బాబు సి.ఇ అజయ్ కుమార్ ఇతర నీటిపారుదల శాఖ ఇంజినీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మెల్‌బోర్న్ హెలిక్యాప్టర్ సర్వే నిర్వహించి ఎస్.ఎల్.బి.సి పనుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోబోతున్నామన్నారు. అందుకు సంబంధించిన టన్నెల్1,పెండ్లిపాకల రిజర్వాయర్,టన్నెల్2 ను పూర్తి చేసుకుని 25 కిలో మీటర్ల మెయిన్ కెనాల్ ద్వారా హైలెవల్ కేనాల్ లో కలిపి సాగునీటిని అందిస్తామన్నారు. దీనికి సంబంధించిన ముసాయిదా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఎస్.ఎల్.బి.సి పూర్తయితే హైలెవల్ కేనాల్ ద్వారా 2 .20 వేలు,ఉదయసముద్రం ద్వారా లక్ష ఎకరాలకు, లో లెవల్ కేనాల్ ద్వారా 80,000 వేల ఏకరాలకు సాగు నీరు మారుమూల గ్రామాలకు సురక్షిత తాగునీరు అందిస్తామని ఆయన పునరుద్ఘాటించారు. డిండి ఎత్తిపోతల పథకం పూర్తి చేయడం ద్వారా 8 రిజర్వాయర్ల నుండి 3.61 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంగా పనులు సాగుతున్నాయన్నారు. సింగరాజ్ పల్లి రిజర్వాయర్ ద్వారా 13,000 వేల ఎకరాలకు,ఎర్రబెల్లిగోకారం ద్వారా 6,000 వేల ఎకరాలకు,ఇర్విన్ ద్వారా 10,000 వేల ఏకరాలకు,గొట్టెముక్కల ద్వారా 28,000 వేల ఏకరాలకు,చింతపల్లి ద్వారా 15,000 వేల ఎకరాలకు,కృష్ణరాంపల్లి ద్వారా లక్ష ఏకరాలకు,శివన్నగూడెం ద్వారా 1,55,000 ఎకరాలకు అందించేందుకు గాను పనులు వేగవంతం చేస్తున్నామని ఉత్తమ్ వివరించారు. ఇప్పటికే డిండి ప్రాజెక్టుకింద 30,000 వేల ఏకరాలు ,ఉలపర కింద 4,000 ఎకరాలకు నీరు అందుతోందన్నారు.

పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ఎదుల్ల రిజర్వాయర్ నుండి దుందుభి వాగు వరకు నీటిని రప్పించేందుకు ఐదు ప్యాకేజిలుగా విభజించి పనులను ప్రారంభించామన్నారు. అటవీ శాఖ అనుమతులు ఇతరత్రా కారణంగా నిలిచిపోయిన చింతపల్లి,ఇర్విన్ రిజర్వాయర్ల పూర్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అధికారులను ఆదేశించారు. హెడ్ రిచ్ నుండి కాలువల నిర్మణాలకు గాను త్వరితగతిన సర్వే పూర్తి చేసి టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని అధికారులకు సూచించారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న పిల్లాయిపల్లి,ధర్మారెడ్డి పల్లి, బునాదిగాని కాలువల పూర్తికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, పిల్లాయి పల్లి కాలువ ద్వారా 22,500 ఏకరాలకు సాగునీరు అందుతుందని, అందులో 16,525 ఎకరాల స్థిరీకరణతో పాటు 5,975 ఏకారల కొత్త ఆయకట్టు సేద్యంలోకి వస్తుందని ఆయన చెప్పారు. గందమల్ల రిజర్వాయర్ పరిధిలోని రావెల్ కోల్ లింక్ కెనాల్,ప్యాకేజ్ 16,తురకపల్లి కేనాల్,యం.తురకపల్లి పనులు పురోగతిలో ఉన్నాయని, త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## బిఆర్ఎస్ పార్టీ చరిత్రలో కలిసిపోతోంది

### కాంగ్రెస్ ఎంఎల్‌సి అద్దంకి దయాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ పార్టీ చరిత్ర కాలగర్భంలో కలిసి పోతున్న పార్టీ అని, తెలంగాణ ప్రజలను మోసం చేసి ప్రజాధనాన్ని వృధా చేసిందని కాంగ్రెస్ ఎంఎల్‌సి అద్దంకి దయాకర్ విమర్శించారు. సిఎల్‌పి మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని, అది ఒక 'ఔట్ డేటెడ్ పార్టీ' అన్నారు. 2009లో వైఎస్ఆర్ ప్రారంభించిన ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహట్టి వద్ద నిర్మించారని, సహజంగా గోదావరి నీళ్లు తీసుకుంటుంటే వాటిని కాళేశ్వరం నీళ్లు ఎలా అంటారని దయాకర్ ప్రశ్నించారు. బిఆర్ఎస్ పార్టీ కేవలం పైసల కోసమే ప్రాజెక్టులు కట్టిందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఏ ప్రాజెక్టు ప్రారంభించినా కెటిఆర్ శాపనార్థాలు పెడుతున్నారని ఆరోపించారు. మూసీ నదికి గోదావరి నీళ్లను తరలించడం ద్వారా నల్లగొండ ప్రజలను మురికి నుండి విముక్తం చేస్తామంటే బిఆర్ఎస్, బిజెపి అడ్డుపడుతున్నాయని దయాకర్ విమర్శించారు. మూసీ నది మురికి నల్లగొండ జిల్లాకు క్యాన్సర్‌గా మారిందన్నారు. మల్లన్న సాగర్ నుంచి నీళ్లు తీసుకుంటే ఖర్చు తక్కువని, కేవలం రెండు చోట్ల పంపింగ్ చేస్తే సరిపోతుందని, కానీ కొండపోచమ్మ సాగర్ నుంచి అయితే ఐదు చోట్ల పంపింగ్ చేయాల్సి వస్తుందన్నారు. గోదావరి నీళ్లను పెన్నా బేసిన్‌కు తీసుకువెళ్లే ప్రయత్నం చేశారని ఆరోపించారు. 10 ఏళ్లలో హైదరాబాద్‌కు ఎందుకు నీళ్లు తేలేకపోయారని కేటీఆర్‌ను దయాకర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోతున్నారని, కనీసం కవిత అడిగిన ప్రశ్నలకు అయినా సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. 'చవట, చౌకబారు మాటలు బంద్ చేయండి' అని దయాకర్ కెటిఆర్‌ను ఉద్దేశించి అన్నారు. గ్రూప్1 వ్యవహారం హైకోర్టు పరిధిలో ఉందని, టిజిపిఎస్‌సి ఆ విషయాన్ని చూసుకుంటుందన్నారు. కృష్ణా నది నుంచి నీళ్లు తీసుకుంటే లీటరుకు రూ.48 ఖర్చు అయితే, గోదావరి నుంచి అయితే రూ.4 మాత్రమే అవుతుందని క్యాబినెట్ అంచనా చేసిందని దయాకర్ తెలిపారు.

## కాళోజీకి సిఎం రేవంత్ రెడ్డి నివాళులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ సమాజాన్ని తన కాలంతో జాగృతం చేసిన గొప్ప ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణ రావు అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కొనియడారు. ప్రజాకవి కాళోజీ నారాయణ రావు 111వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్రానికి చెందిన ఎంపిలు మల్లు రవి, రఘురామ్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కడియం కావ్య పాల్గొని, కాళోజీ నారాయణ రావుకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోళోజీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం తెలంగాణ సమాజాన్ని జాగృతం చేసిన తీరును గుర్తు చేసుకున్నారు.

## గీత కార్మికులకు రూ.13 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిలు

# తక్షణమే విడుదల చేయాలి

### తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో గీత కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన రూ. 13 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిలను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి డి.జి. సాయిలు గౌడ్ రాష్ట్ర సమన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం, రాష్ట్ర ఉపాధ్యాక్షులు కెవిఎల్‌లు రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం సమర్పించారు. గీత వృత్తిలో ప్రమాదవశాత్తు చెట్లపై నుండి పడి చనిపోయిన లేదా వికలాంగులుగా మారిన కార్మికుల కుటుంబాలు జీవనాధారం కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని, వారికి సకాలంలో ఎక్స్‌గ్రేషియా అందకపోవడం సమస్యను మరింత తీవ్రం చేస్తుందని సంఘం నాయకులు మంత్రి దృష్టికి తెచ్చారు. మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడానికి ఉద్దేశించిన ఎక్స్‌గ్రేషియా బకాయిలు గత కొంతకాలంగా నిలిచిపోయాయని, దీనివల్ల బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని వారు మంత్రి దృష్టికి తెచ్చారు. మానవతా దృక్పథంతో ఈ బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అలాగే వృత్తిలో మరణించిన గీత కార్మికుల భార్యలకు వితంతు పెన్షన్ మంజూరు చేయడంలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని, వాటిని సవరించి అర్హులైన వారికి వెంటనే పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఇస్తున్న వృద్ధాప్య పెన్షన్‌ను రూ. 2,000 నుంచి రూ.5,000లకు పెంచాలని కూడా సంఘం ప్రతినిధులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. గీత కార్మికులకు వృత్తి రక్షణ పరికరాలను కూడా అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమస్యపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని మంత్రి జూపల్లి హామీ ఇచ్చినట్లు నాగభూషణం తెలిపారు.

## రాష్ట్రంలో త్వరలో..

# ఏకీకృత భవన నిర్మాణ నిబంధనలు

### ప్రక్రియను ప్రారంభించిన ప్రభుత్వం

### అన్ని శాఖల ఉన్నతాధికారుల వర్క్‌షాప్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పట్టణాభివృద్ధి కోసం యూనిఫైడ్ డెవలప్‌మెంట్ బిల్డింగ్ కోడ్ (యుడిబిసి ) రూపకల్పన ప్రక్రియను ప్రారంభించింది. ఈ దిశగా, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండిఏ), ఎర్నస్ట్, యంగ్ (ఈవై) సంస్థతో కలిసి మంగళవారం స్టేక్‌హోల్డర్స్ కన్సల్టేషన్ వర్క్‌షాప్‌ను నిర్వహించాయి. ఈ వర్క్‌షాప్‌లో ప్రభుత్వ, ప్రభుత్వేతర విభాగాల నుంచి సూచనలు, అభిప్రాయాలు సేకరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ సస్టైనబిలిటీ, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (ఇఓడిబి), ఇన్‌క్లూజివిటీ అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ఈ కోడ్‌ను రూపొందిస్తున్నామని తెలిపారు. ఇది దేశంలోనే తొలిసారి ప్రవేశపెట్టేలా ఉండాలనేది తమ లక్ష్యమని వెల్లడించారు. ఈ యూడిబిసి రాష్ట్రంలో బలమైన, భవిష్యత్ దృష్టితో కూడిన కోడ్‌గా నిలుస్తుందని తెలిపారు. ఇది పట్టణ, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి మార్గదర్శనం చేస్తుందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో వచ్చిన సూచనలు పారదర్శకమైన, సమయానుకూలమైన నిబంధనల రూపకల్పనకు పునాదిగా పనిచేస్తాయని సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో జిహెచ్ ఎంసి, సిడిఎంఏ, జలమండలి, విద్యుత్ శాఖ, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ బోర్డు, హైదరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ (హైడ్రా), మున్సిపల్ కార్పొరేషన్లు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, డిటిసిపి కీలక ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు డిటిసిపి డైరక్టర్ ఎస్. దేవేందర్ రెడ్డి, హెచ్‌ఎండిఏ డైరక్టర్‌లు రాజేంద్ర ప్రసాద్ నాయక్, విద్యాధర్, హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్, జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్లు, పట్టణ ప్రణాళిక(టౌన్‌ప్లానింగ్) అధికారులు పాల్గొన్నారు.

**కొత్త నిబంధనల కోసం దేశవిదేశాల్లో అధ్యాయనం..**

యూనిఫైడ్ డెవలప్‌మెంట్ బిల్డింగ్ కోడ్ (యుడిబిసి ) రూపకల్పన ప్రక్రియ కోసం కన్సల్టెన్సీ ఏజెన్సీలు దేశవిదేశాలలో అధ్యాయనం చేశాయి. సింగపూర్, లండన్‌తో పాటు దేశంలోని తమిళనాడు, గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, ఢిల్లీ నగరాలలో టౌన్‌ప్లానింగ్‌లో అవలంభిస్తున్న విధానాలను పరిశీలించారు. అక్కడ సులభతరంగా ఉన్న వివిధ విధానాలను తెలంగాణలో అమలు చేసే అంశాలను పరిలిశీస్తామని సమావేశంలో ఉన్నతాధికారులు వెల్లడించారు.

# బీహార్‌లో సిపిఐ ప్రబల శక్తి


**● అందుకు తగ్గట్లుగానే సీట్లు కోరుతున్నాం ● సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా**




**పట్నా:** బీహార్‌లో సిపిఐ ప్రబలశక్తిగా ఉందని... రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధిక స్థానాల్లో పోటీ చేయాలని పార్టీ కోరుకుంటున్నట్లు సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా స్పష్టం చేశారు. ఈ మేరకు మహాఘట్బంధన్‌లో ప్రధాన పార్టీలైన ఆర్జేడీ, కాంగ్రెస్‌లు పార్టీలు పొత్తులో భాగంగా సిపిఐకి సహేతుక రీతిలో సీట్లను కేటాయిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సిపిఐ రాష్ట్ర మహాసభల్లో పాల్గొనేందుకు పట్నా వచ్చిన రాజా... మీడియాతో మాట్లాడుతూ... బీహార్‌లో సిపిఐ సంస్థాగతంగా బలంగా ఉందన్నారు. గణనీయ సంఖ్యలో ఓట్లు పొందగలదని తెలిపారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు స్థానాల్లో మాత్రమే పోటీ చేసినందున ఈసారి అంతకన్నా ఎక్కువ స్థానాలు పొందాలన్న పార్టీ వైఖరిని ఆయన సమర్థించారు. ''మేము మా కోరికను అనధికారికంగా లాలు ప్రసాద్ (ఆర్జేడీ అధ్యక్షుడు), తేజస్వి యాదవ్‌కు తెలియజేశాం. కూటమిలోని ఇతర పార్టీలు సైతం ఈసారి ఎక్కువ సీట్లను డిమాండ్ చేస్తున్నాయి. కాబట్టి, ఆర్జేడీ, కాంగ్రెస్ వాస్తవికంగా ఉండాలి. బీహార్‌లో సిపిఐ ఉనికిని దెబ్బతీయని రీతిలో సీట్లు ఇవ్వాలి'' అని ఆయన అన్నారు. ముఖ్యంగా సిపిఐ (ఎంఎల్) లిబరేషన్, ముకేశ్ సాహ్నికి చెందిన వికాస్‌షీల్ ఇన్సాన్ వంటి పార్టీలు ఎక్కువ స్థానాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో సిపిఐ అంచనాల గురించి విలేకరులడిగిన ప్రశ్నలకు సమాధానంగా ఆయనపై విధంగా స్పందించారు. మరొక ప్రశ్నకు స్పందిస్తూ... ఓటు హక్కు కోసం ఆధార్ కార్డులను 12వ పత్రంగా పరిగణించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ ఏం చేస్తుందో మేము నిశితంగా గమనిస్తామని తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ 25వ బీహార్ రాష్ట్ర మహాసభలు పట్నాలో ప్రారంభమయ్యాయి. పార్టీ జెండాను సిపిఐ జాతీయ కార్యదర్శి నాగేంద్రనాథ్ ఓఝా ఆవిష్కరించారు. మహాసభలకు పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి గిరీశ్ చంద్ర శర్మ రాష్ట్ర కార్యదర్శి రామ్ నరేశ్ పాండే, రాష్ట్ర నాయకులు, పార్టీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బీహార్‌లో ప్రజల హక్కులను కాపాడటానికి , ప్రగతిశీల, ప్రజాస్వామ్య బీహార్ నిర్మాణానికి ఉద్యమ కార్యాచరణపై ఈ మహాసభల్లో చర్చించనున్నారు.

## 'తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి' విస్తృత ఏర్పాట్లు చేయాలి : సిఎస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఈ నెల 17వ తేదీన నిర్వహించే 'తెలంగాణా ప్రజాపాలన దినోత్సవానికి' విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ఏర్పాట్లపై హైదరాబాద్‌లోని బి.ఆర్.అంబేడ్కర్ సచివాలయంలో మంగళవారం ఉన్నతాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, డిజిపి జితేందర్, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.విఆనంద్, ఇంటలిజెన్స్ అడిషనల్ డిజి శివధర్ రెడ్డి, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి రఘునందన్ రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ ఈనెల 17న ఉదయం గన్‌పార్క్ వద్ద 'అమరవీరుల స్తూపం' వద్ద ముఖ్యమంత్రి నివాళులు అర్పిస్తారని, అనంతరం పబ్లిక్ గార్డెన్‌లో జరిగే ప్రజాపాలన దినోత్సవంలో పాల్గొంటారని వివరించారు. గన్‌పార్క్ వద్ద జరిగే కార్యక్రమానికి జి హెచ్‌ఎంసి కమిషనర్ నోడల్ అధికారిగా వ్యవహారిస్తారన్నారు. పబ్లిక్ గార్డెన్ లో నిర్వహించే సమావేశానికి తగిన ఏర్పాటు చేయాలని రోడ్లు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి వివిఐపిలతో పాటు ప్రజాప్రతిధులందరికీ ఆహ్వాన పత్రికలను అందచేయాలని ఆదేశించారు. ఈ సమావేశానికి అగ్నిమాపక సర్వీసుల డిజి నాగిరెడ్డి, మున్సిపల్ శాఖ కార్యదర్శి ఇలంబర్తి, ప్రోటోకాల్ శాఖ డైరెక్టర్ శివలింగయ్య, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక తదితర అధికారులు హాజరయ్యారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఢిల్లీ హైకోర్టులో ఐశ్వర్యా రాయ్ పిటిషన్

**న్యూఢిల్లీ:** అనుమతి లేకుండా తన ఫొటోలు, వీడియోలు వాడుతున్నారని ప్రముఖ సినీనటి ఐశ్వర్య రాయ్ దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన వ్యక్తిగత హక్కులను కాపాడాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. కొంతమంది వ్యక్తులు తన పేరు, చిత్రాలు ఏఐ ఆధారిత అశ్లీల కంటెంట్‌లో అనధికారికంగా వాడుతున్నారని, వాటిని వినియోగించకుండా నిరోధించాలని కోరారు. సినీనటి తరఫున సీనియర్ న్యాయవాది సందీప్ సేథీ వాదిస్తూ 'పూర్తిగా అసత్యమైన సన్నిహిత ఫొటోలు ఇంటర్నెట్‌లో ప్రచారమవుతున్నాయి. ఎవరికీ ఆమె ఫొటోలు, పేరు వాడుకునే హక్కు లేదు. ఒక వ్యక్తి ఆమె పేరు, ఫొటోలతో డబ్బు వసూలు చేస్తున్నాడు. ఆమె పేరును, రూపాన్ని ఇష్టానుసారం వాడటం దురదృష్టకరం' అని కోర్టుకు వివరించారు. కొందరు వ్యక్తులు ఐశ్వర్య ఫొటోలను మార్ఫింగ్ చేసి ఉపయోగించుకుంటున్నారని సందీప్ సేథి న్యాయస్థానం దష్టికి తీసుకొచ్చారు.

## బంగారం ధరకు రెక్కలు

### ఒక్కరోజే రూ.5వేలు పెరిగిన పసిడి ధర!



**న్యూఢిల్లీ :** బలమైన ప్రపంచ ధోరణులకు అనుగుణంగా మంగళవారం దేశ రాజధాని ఢిల్లీలో బంగారం ధర అమాంతం పెరిగింది. 10 గ్రాముల పసిడి ధర రూ.5,080 పెరిగి రూ.1,12,750కి చేరుకుని జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం, సోమవారం 99.9 శాతం స్వచ్ఛమైన బంగారం రూ.1,07,670 వద్ద ముగిసింది. అయితే మంగళవారం పసిడి ధర ఢిల్లీలో భారీగా పెరిగి రూ.1,12,750 చేరింది. మరోవైపు మంగళవారం వెండి ధర కూడా కిలోకు రూ.2,800 పెరిగి రూ.1,28,800కి (అన్ని పన్నులు కలిపి) చేరుకుంది. జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. గత మార్కెట్ సెషన్‌లో ఈ విలువైన లోహం కిలోకు రూ.1,26,000 వద్ద స్థిర పడింది. మరోవైపు, ప్రపంచవ్యాప్తంగా మంగళవారం ఔన్సు బంగారం ధర 3,6 59.27 డాలర్లకు చేరుకుంది. స్పాట్ గోల్ ఔన్సు 3,658.38 డాలర్లు వద్ద ట్రేడ్ అయింది.

**ఆ పరిస్థితులే కారణం**

గత వారం అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు వెలువడడంతో బంగారానికి భారీగా డిమాండ్ ఏర్పడిందని వ్యాపారులు తెలిపారు. యుఎస్‌లో బలహీనమైన లేబర్ మార్కెట్ డేటా ద్రవ్య విధాన సడలింపు అవకాశాలను పెంచిందని, ఇది పెట్టుబడిదారులను బంగారం వంటి సురక్షితమైన ఆస్తుల్లో ఇన్వెస్ట్ చేసేందుకు కారణమైందని అభిప్రాయపడ్డారు. డాలర్ ఇండెక్స్ బలహీనపడడం కూడా మరో కారణమని భావిస్తున్నారు. కాగా, డాలర్ ఇండెక్స్ 0.17 శాతం తగ్గి, 97.29 వద్ద ట్రేడవుతోంది.

**విశ్లేషకులు ఏమన్నారంటే?**

బంగారం ధరలు మంగళవారం మరోసారి ఆల్ టైమ్ హైని టచ్ చేశాయని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్‌లోని కమోడిటీస్ సీనియర్ విశ్లేషకుడు సౌమిల్ గాంధీ తెలిపారు. కేంద్ర బ్యాంకుల నుంచి బలమైన డిమాండ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లలోకి పెట్టుబడులు, రేటు కోతలకు సంబంధించిన ఊహాగానాలు విలువైన లోహాలలో ఈ రికార్డు ర్యాలీకి ఆజ్యం పోశాయని అభిప్రాయపడ్డారు. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల ప్రభావం గురించి ఆందోళనలు కూడా ఈ ర్యాలీకి దోహదపడ్డాయని పేర్కొన్నారు.

## ఆశ లేకపోతే.. జీవితమే లేదు


### సిఎం పోస్టుపై డికె ఆసక్తికర వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో అధికార మార్పిడి వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు అంశంపై ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ మరోసారి స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆశ లేకపోతే. జీవితమే లేదని, కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుందంటూ పేర్కొన్నారు. ప్రముఖ జాతీయ మీడియా ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్ 2025 సదస్సులో డికె శివకుమార్ పాల్గొన్నారు.'కాంగ్రెస్ ప్రభు త్వంలోని రెండో సగభాగం ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారా..?' అన్న ప్రశ్న ఆయనకు ఎదురైంది. దీనికి డికె స్పందిస్తూ.. 'నేను దీనికి సమాధానం చెప్పలేను. కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుంది. ఎవరైనా సరే ఆశతో జీవించాలి. ఆశ లేకపోతే.. జీవితమే లేదు' అంటూ చెప్పుకొచ్చారు. సిఎం మార్పు నిర్ణయం పూ ర్తిగా కాంగ్రెస్ హైకమాండ్‌దేనని తెలిపారు. హైకమాండ్ నిర్ణయం, ఆదేశాల ప్ర కారం ముందుకెళ్తామని చెప్పారు. హైకమాండ్ ఏం నిర్ణయిస్తే.. దాన్ని అంగీ కరిస్తామని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఆయన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.

## జగదీప్ ధన్కడ్ ఎక్కడ?

### ఉపరాష్ట్రపతి ఎన్నిక ప్రారంభ వేళ జైరాం రమేశ్ నిలదీత



**న్యూఢిల్లీ:** జగదీప్ ధన్కర్ ఎక్కడ? అని భారతదేశ తదుపరి ఉపరాష్ట్రపతిని ఎన్నుకునే ఓటింగ్ మంగళవారం ఉదయం ప్రారంభమైన సమయంలోనే కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ మరోసారి ప్రశ్నించారు. ఆరోగ్య సమస్యలను పేర్కొంటూ జులై 21న ధన్కడ్ అకస్మాత్తుగా ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఆయనతో సంబంధాలు లేకుండా ఉ న్నారు. 'జగదీప్ ధన్కర్ 50 రోజులుగా అసా ధారణ మౌనాన్ని కొనసాగిస్తున్నారు' అని జైరాం రమేశ్ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఈరోజు తన వారసుడి కోసం ఎన్నికలు జరుగుతున్నందున మోదీ ప్రభుత్వం రైతులను తీవ్రంగా నిర్లక్ష్యం చేయడం, అధికారంలో ఉన్నవారి 'అహంకారం' వల్ల ఎదురయ్యే ప్రమాదాలు మొదలైన వాటిపై తన ఆందోళనలను వ్యక్తం చేసిన తర్వాత ఉపరాష్ట్రపతి పదవికి ఊహించని రాజీనామా తర్వాత దేశం ఆయన మాట్లాడటానికి వేచి ఉంది' అని అన్నారు. ధన్కర్ ఆకస్మిక నిష్క్రమణ రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఆయన రాజీనామా తర్వాత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నుంచి 'ఆయనకు మంచి ఆరోగ్యం' కోరుకుంటూ సంక్షిప్త వీడ్కోలు ప్రకటన వచ్చింది. కానీ ప్రభుత్వం నుంచి వివరణాత్మక వ్యాఖ్య లేదు. ధన్కడ్ కొన్ని నిర్ణయాలతో మోదీ ప్రభుత్వానికి కోపం తెప్పించాడని, ఆయన రాజీనామా చేయవలసి వచ్చిందని చాలా మంది భావిస్తారు. అయితే కేంద్ర హోం అమిత్ షా దానిని తిరస్కరించారు. 19931998 మధ్య కాంగ్రెస్ ఎమ్మెల్యేగా రాష్ట్ర అసెంబ్లీలో కిషన్‌గఢ్‌కు ప్రాతినిధ్యం వహించారు. జులై 2019 వరకు ఆయన పెన్షన్ పొందినప్పటికీ, పశ్చిమ బెంగాల్ గవర్నర్ అయినప్పుడు అది నిలిచిపోయింది. ప్రస్తుతం 74 ఏళ్ల ధన్కర్ నెలకు రూ.42 వేల పెన్షన్‌కు అర్హులు. రాజీనామా చేసినప్పటి నుంచి నెలకు పైగా ఇంటికే పరిమితమైన తర్వాత దంత పరీక్ష కోసం సెప్టెంబరు 1న ఆయన తన అధికారిక నివాసం నుంచి బయటకు వచ్చారు.

## జైల్లో ఉండలేను..విషమివ్వండి

### కోర్టును కోరిన నటుడు దర్శన్

**బెంగళూరు:** తాను చాలా రోజులుగా సూర్యకాంతిని చూడలేదని... తనకు 'విషం' ఇవ్వాలని జైలులో ఉన్న కన్నడ నటుడు దర్శన్ మంగళవారం కోర్టును కోరారు. రేణుకస్వామి హత్య కేసులో విచారణ సందర్భంగా వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా సిటీ సివిల్... సెషన్స్ కోర్టు ముందు హాజరయిన దర్శన్... తన చేతుల్లో ఫంగస్ పెరిగిందని కూడా అన్నారు. జైలులో బయటకు అడుగు పెట్టడానికి అనుమతించకపోవడంతో చాలా రోజులుగా సూర్యకాంతిని చూడలేదని ఆయన అన్నారు. తన బట్టలు దుర్వాసన వస్తున్నాయని, జైలులో తాను తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నానని తెలిపారు.

## రాష్ట్రపతి, గవర్నర్లు కేవలం 'నామమాత్రపు అధిపతులే'

### 'సుప్రీం' ముందు వాదనలు వినిపించిన కర్ణాటక ప్రభుత్వం



**కేంద్రంలో, రాష్ట్రాల్లో కేబినెట్ సలహాను బట్టి నడుచుకోవాల్సి ఉంటుందని రాజ్యాంగ ధర్మాసనానికి వెల్లడి**

**8వ రోజు కొనసాగిన విచారణ**

**న్యూఢిల్లీ :** రాజ్యాంగం పథకం ప్రకారం రాష్ట్రపతి, గవర్నర్లు కేవలం 'నామమాత్రపు అధిపతులు' మాత్రమేనని, కేంద్రంలో, రాష్ట్రాల్లో మంత్రి మండలి సహాయం, సలహాను బట్టి నడుచుకోవాల్సి ఉంటుందని కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని కర్ణాటక ప్రభుత్వం మంగళవారం సుప్రీంకోర్టు ముందు గట్టిగా నొక్కిచెప్పింది. కర్ణాటక ప్రభుత్వం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ సుబ్రమణియన్ ప్రధాన న్యాయమూర్తి బిఆర్. గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ముందు తన వాదనలు వినిపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 361 ప్రకారం రాష్ట్రపతి, గవర్నర్‌కు ఎటువంటి కార్యనిర్వాహక విధులను నిర్వహించనందున వారికి క్రిమినల్ చర్యల నుండి బలం లభిస్తుందని చెప్పారు. సుప్రీంకోర్టు ఇచ్చిన వివిధ తీర్పులను ప్రస్తావిస్తూ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ చర్యతీసుకోవడానికి అవసరమైన సంతృప్తే మంత్రి మండలి సంతృప్తి అని సుబ్రమణియన్ జస్టిస్ సూర్యకాంత్, విక్రమ్ నాథ్, పిఎస్.నరసింహ, ఎఎస్.చందుర్కర్‌లు కూడా ప్రాతినిథ్యం వహించిన ధర్మాసనం ముం దు విపులీకరించారు. రాష్ట్రపతి ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి పరిష్కరించేందుకు కోర్టు కాలపరిమితిని విధించవచ్చా అనే విషయమై రాష్ట్రపతి సూచనపై 8వ రోజు విచారణను తిరిగి ప్రారంభిస్తూ, ఎన్నికైన ప్రభుత్వంతోపాటు రాజ్యాంగం ఎలాంటి సమాంతర పరిపాలనను అందించలేదని సుబ్రమణియన్ వాదించారు. సుబ్రమణియన్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన వివిధ తీర్పులు ఉన్నాయన్నారు. గవర్నర్ మంత్రి మండలి సహాయం, సలహాల నుంచి స్వతంత్రంగా వ్యవహరిస్తారని, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (ఐపిసి)లోని సెక్షన్ 197కు సంబంధించి తన విచక్షణను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. సెప్టెంబరు 3న పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానంలో వాదిస్తూ బిల్లు రూపంలో ప్రజల అభీష్టాన్ని గవర్నర్లు, రాష్ట్రపతి ఇష్టాయిష్టాలకు లోబడి ఉంచరాదని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఎందుకంటే శాసనప్రక్రియలో కార్యనిర్వాహకుడు జోక్యం చేసుకోకుండా నిషేధించబడింది. తృణమూల్ పాలిత రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ సార్వభౌమాధికారి ఇష్టాన్ని ప్రశ్నించలేరని, అసెంబ్లీ ఆమోదించిన బిల్లు శాసనసామర్థ్యాన్ని పరిశీలించడానికి ముందుకు సాగలేరని గట్టిగా చెప్పింది. ఇది న్యాయవ్యవస్థ పరిధిలోకి వస్తుంది. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను పరిష్కరించేటప్పుడు రాష్ట్రపతి విచక్షణాధికారాన్ని వినియోగించడానికి న్యాయపరమైన ఉత్తర్వులు, సమయం విధించవచ్చో లేదో తెలుసుకోడానికి మే నెలలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆర్టికల్ 143 (1) కింద అధికారాలను ఉపయోగించారు.

## పాత నిల్వలకూ కొత్త ఎంఆర్‌పి

### జీఎస్టీ రేట్లపై కేంద్రం నిర్ణయం



**న్యూఢిల్లీ:** వస్తు, సేవలు పన్ను (జీఎస్టీ) రేట్లకు సంబంధించి అటు విని యోగదారులకు, ఇటు కంపెనీలకు ఊరట నిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పాత స్టాక్‌కూ గరిష్ఠ రిటైల్ ధరను (ఎంఆర్‌పీ) సవరించే అవకాశం కల్పించింది. దీంతో కొత్త స్టాక్ వచ్చేంత వరకూ వేచి చూడాల్సిన అవ సరం లేకుండా పాత స్టాక్ ధరలు కూడా తగ్గనున్నాయి. దీనివల్ల ముఖ్యంగా వినియోగదారులకు ప్రయోజనం చేకూరనుంది. జీఎస్టీ శ్లాబులకు సంబంధించి ఇటీవల జీఎస్టీ కౌన్సిల్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇకపై 5, 18 శాతం శ్లాబ్‌లు మాత్రమే ఉండనున్నాయి. సవరించిన ఎమ్మార్పీని స్టాంపింగ్, స్టిక్కర్ లేదా ఆన్‌లైన్ ప్రింటింగ్ ద్వారా మార్చుకోవచ్చని కేంద్ర వినియోగదారుల వ్యవ హారాల మంత్రిత్వ శాఖ ఆదేశించింది. పాత ఎమ్మార్పీ కొనసాగించాలని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. పన్ను తగ్గింపు/పెంపునకు అనుగుణంగా సవరించిన ధర ఉండాలని పేర్కొంది. ఈ మేరకు పత్రికా ప్రకటన ఇవ్వాలని తయా రీదారులు, ప్యాకర్లకు సూచించింది. స్టాక్ పూర్తయ్యేంత వరకు లేదా డిసెంబర్ 31 వరకు ఈ ఆదేశాలు వర్తిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## పాక్ దుష్ప్రచారం... తిప్పికొట్టిన భారత్

**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్ సమయంలో పెద్దఎత్తున ఫేక్ ప్రచారానికి తెరలేపిన పాకిస్థాన్... దాన్ని ఇంకా కొనసాగిస్తోంది. సామాజిక మాధ్యమాల వేదికగా భారత్‌పై విషం చిమ్ముతోంది. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొన్ని అనుకూల ఎక్స్ హ్యాండిళ్ల నుంచి ఒకేతరహా ప్రచారం చేయిస్తోంది. దీన్ని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ సమర్థంగా తిప్పికొట్టింది. ప్రధాని నరేంద్రమోదీ, సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది మధ్య చెడిందంటూ ఓ కల్పిత ప్రచారానికి పాక్ తెరతీసింది. యుద్ధ సామగ్రిని అభివృద్ధి చేయకుండా పాక్‌తో వివాదం పెట్టుకోవడం భారత సైన్యానికి ఏమాత్రం ఇష్టం లేదనేది ఆ పోస్టుల సారాంశం. ఒకేతరహా సందేశం వేర్వేరు అకౌంట్ల నుంచి రావడంతో పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం అప్రమత్తమైంది. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్న ఈ సమాచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టంచేసింది. ఇలాంటి అసత్య ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని పౌరులకు సూచించింది.

## ఇజ్రాయిల్‌తో వాణిజ్య ఒప్పందం సిగ్గుచేటు: సీపీఎం

**న్యూఢిల్లీ:** ఇజ్రాయిల్ ఆర్థికమంత్రి బెజలెల్ స్మోట్రిచ్ భారత్‌లో పర్యటించడాన్ని సీపీఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. భారత ప్రభుత్వంతో ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందంపై సంతకం చేయడానికి ఆయన ఇజ్రాయిల్ ప్రతినిధి బందానికి నాయకత్వం వహిస్తున్నారు. స్మోట్రిచ్ భారత్ పర్యటనను ఖండిస్తూ మంగళవారం పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన విడుదల చేసింది. 'పచ్చి మితవాద జాత్యాహంకార పార్టీకి చెందిన స్మోట్రిచ్... పలస్తీనా ప్రజలను బలవంతంగా నిరాశ్రయులను చేయడం ద్వారా గాజాస్ట్రిప్‌ను ఆక్రమించాలనుకుంటున్న నెతన్యాహు ప్రభుత్వంలో ప్రముఖ న్యాయవాది. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌ను ఇజ్రాయిల్‌లో విలీనం చేయాలనే ప్రతిపాదనకు ఆయన ప్రధానకర్త. పలస్తీనియన్ల జాతిని ప్రక్షాళన చేయాలన్న సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ అనేక దేశాలు స్మోట్రిచ్ పర్యటనపై నిషేధం విధించాయి. మరికొన్ని దేశాలు ఆంక్షలు విధించాయి. ఆదేశాల్లో బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, నార్వే, నెదర్లాండ్స్, స్లొవేనియా, న్యూజిలాండ్ ఉన్నాయి.

## ఢిల్లీ ఎన్‌సిఆర్‌లోని దాదాపు 70శాతం గిగ్‌వర్కర్లు..

❖ డిస్పోజబుల్ ఆదాయ వృద్ధిని చూశారు
❖ ఎంపవర్ ఇండియా 'శ్వేతపత్రం' వెల్లడి



**న్యూఢిల్లీ :** ఢిల్లీ ఎన్‌సిఆర్ లోని దాదాపు 70 శాతం గిగ్ వర్కర్లు పార్ట్‌టైమ్, సీజనల్, గిగ్ రోల్స్ ద్వారా తమ డిస్పోజబుల్ ఆదాయంలో పెరుగుదలను చూశారని ఒక శ్వేత పత్రం వెల్లడించింది. ముఖ్యంగా ఢిల్లీ ఎన్‌సిఆర్ యువకులకు ఇ కామర్స్‌నే ప్లాట్‌ఫారమ్‌లు వేగంగా ఎంపిక చేసుకునే యజమానులుగా మారుతున్నాయి. సాంప్రదాయక ఉపాధికి పోటీగా శిక్షణ, నైపుణ్యాభివృద్ధి నిర్మాణాత్మక కెరీర్ పురోగతిని అందిస్తున్నాయని, స్థానిక వర్గాల సహకారంతో ఎంపవర్ ఇండియా తయారుచేసిన శ్వేతపత్రం తెలిపింది.'15జిల్లాలలో 90,000మందికి పైగా పరిశోధనా సంస్థల నుంచి వచ్చిన ప్రతిపాదనలు గిగ్ వర్కర్లతో ప్రత్యక్ష ఇంటర్వ్యూల ఆధారంగా ఈ కామర్స్, రిటైల్ ప్లాట్‌ఫారములు, కెరీర్‌పురోగతి, ఆర్థిక స్థిరత్వం, సమ్మిళిత అవకాశాలను అందించడం ద్వారా సంస్థలను ఎలా పునర్నిర్మిస్తున్నాయో ప్రతినిధి హైలెట్ చేశారు. ఈ పరివర్తనకు అమెజాన్, డెల్హివరీ, మీషోలు సహకారులుగా ఉద్భవించాయి' అని నివేదిక వెల్లడించింది. పార్ట్‌టైమ్ సీజనల్, గిగ్ రోల్స్ ద్వారా 70 శాతం మంది గిగ్ వర్కర్లు తమ డిస్పోజబుల్ ఆదాయంలో పెరుగుదలను చూశారని అధ్యయనం వెల్లడించింది. త్వరిత వాణిజ్యం తరచుగా అధిక ఒత్తిడి లక్ష్యాలతో గుర్తించబడుతుండటంతో చాలామంది యువకార్మికులు స్థిరపడిన రిటైల్, ఈకామర్స్ కంపెనీలు అందించే స్థిరత్వం, దీర్ఘకాలికతను ఎంచుకుంటున్నారు. మౌలిక సదుపాయాలు, సమ్మిళిత కార్యాలయ విధానాలు, నైపుణ్య అభివృద్ధి చొరవలు అర్థవంతమైన గౌరవప్రదమైన ఉపాధిని ఎలా ఎంచుకుంటాయో కూడా ఈ నివేదిక నొక్కిచెబుతోంది. 'అమెజాన్, ఫ్లిప్‌కార్డు వంటి ఇండస్ట్రీ నాయకులు యువత నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాల ద్వారా చివరి మైలు డెలివరీ నెట్‌వర్క్‌లు సాంప్రదాయ రిటైల్ ఉపాధీకరణను అధికారీకరించడం ద్వారా ఈ మార్పును వేగవంతం చేస్తున్నారు' అని నివేదిక పేర్కొంది. దీనిపై ఎంపవర్ ఇండియా డైరెక్టర్ జనరల్ కె.గిరి మాట్లాడుతూ ఢిల్లీ ఎన్‌సిఆర్‌లో రిటైల్ సెక్టార్ కేవలం ఉద్యోగాలను సృష్టించడమే కాకుండా, అది దీర్ఘకాలిక ఆర్థిక శ్రేయస్సుకు బాటలు నిర్మిస్తోందన్నారు.

## ఢిల్లీ సచివాలయం... ఎంఎఎంసికి బాంబు బెదిరింపులు



**న్యూఢిల్లీ :** దిల్లీ ముఖ్యమంత్రి సచివాలయం, మౌలానా ఆజాద్ మెడికల్ కాలేజ్ (ఎం ఏఎంసీ), యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్స్ (యూ సీఎంసీ) కి మంగళవారం ఉదయం బాంబు బెదిరింపులు వచ్చాయని, వాటిని తరు వాత నకిలీవని అధికారులు తెలిపారు. ఒక కిలోమీటరు పరి ధిలో పేలుడు జరిగేలా ఆర్‌డీఎక్స్ మూడు ప్రదేశాలలో అమర్చబడిందని బెదిరింపులు పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. మూడు ప్రదేశాలలో బాంబు గుర్తింపు, నిర్వీర్య బందాలు (బిడిడిటి) సేవలతో ప్రామాణిక నిర్వహణా విధానాల కింద తక్షణ, సమన్వయంతో చర్యలు తీసుకున్నామని, బాంబు బెది రింపులు నకిలీవని వారు తెలిపారు. పోలీసు డిప్యూటీ కమిషనర్ (షా హదారా) ప్రశాంత్ గౌతమ్ మాట్లాడుతూ 'ఉదయం 11 గంటల సమ యంలో కోల్లెజ్ ప్రాంగణంలో బాంబు ఉన్నట్లు వారికి ఇమెయిల్ అం దిందని జిటిపి ఆసుపత్రిలోని యూసీఎంసీ సమాచారం అందింది' అని అ న్నారు.

భయాందోళనలు సష్టించకుండా కళా శాలను ఖాళీ చేయించా రు. బాంబు డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి భవ నం లోని ప్రతి మూలను తనిఖీ చేశామని డీసీపీ తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటలకు భవనానికి ఎటువంటి ప్రమాదం లేదని, బెదిరింపు నకి లీదని తేలింది. దిల్లీ అగ్నిమాపక దళం (డీఎఫ్‌ఎస్)కు బెదిరింపునకు సంబంధించి ప్రత్యేక కాల్ కూడా వచ్చింది. స్థలానికి తరలించారు.

## ఆపరేషన్ సిందూర్ వేళ 400మంది శాస్త్రవేత్తలు 24 గంటలూ సేవలందించారు

### భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చైర్మన్ నారాయణన్




**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్ సమయంలో 400 మంది శాస్త్రవేత్తలు నిరంతరం పనిచేసినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ వి. నారాయణన్ వివరించారు. ఎర్త్ అబ్జర్వేషన్, కమ్యూనికేషన్ శాటిలైట్ల పనితీరును పరిశీలిస్తూ జాతీయ భద్రత అవసరాలకు అనుగుణంగా ఉపగ్రహాల సమాచారాన్ని అందించినట్లు తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఎఐఎంఎ) 52వ జాతీయ మేనేజ్‌మెంట్ కన్వెన్షన్‌లో ప్రసంగిస్తూ ఈ విషయాన్ని చెప్పారు. 'ఆపరేషన్ సిందూర్ సమయంలో అన్ని ఉపగ్రహాలు నిరంతరం కచ్చితత్వంతో పనిచేస్తూ అవసరమైన సమాచారాన్ని అందించాయి. 400లకు పైగా శాస్త్రవేత్తలు 24 గంటలపాటూ పూర్తి సమయం పనిచేశారు. భూ పరిశీలన, కమ్యూనికేషన్‌కు సంబంధించిన ఉపగ్రహాలన్నీ సంపూర్ణ సేవలు అందించాయి' అని ఇస్రో చైర్మన్ నారా యణన్ అన్నారు. గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటివరకు 7700 క్షేత్రస్థాయి పరీక్షలు పూర్తిచేశామని తెలిపారు. మరో 2300 పరీక్షలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని వివరించారు. జాతీయ భద్రత, సరి హద్దు సంక్షోభం వంటి సమయాల్లో అంతరిక్ష రంగం కీలకంగా వ్యవ హరిస్తుందన్న విషయం ఆపరేషన్ సిందూర్ సమయంలో మరోసారి స్పష్ట మైంది. ఆ సమయంలో విస్తృతంగా డ్రోన్లు, మందుగుండు సామగ్రి భారీ స్థాయిలో వినియోగించడం, దేశీయంగా అభివృద్ధి చేసిన ఆకాశ్‌తీర్ వంటి రక్షణ వ్యవస్థ సామర్థ్యాలను పరిశీలిం చడం లోనూ ఇస్రో కీలక పాత్ర పోషి స్తో ంది. ఇందుకు సం బంధించి ఆయా శాఖలతో ప నిచేస్తోంది. ఇస్రో ప్రస్తుతం టెక్నాలజీ డెమా నిస్ట్రేషన్ శా టిలైట్ (టిడిఎస్), నౌకాదళం కోసం సిద్ధం చేసిన జీశాట్7ఆర్ ప్రయో గించనుంది. ఇది ఇప్ప టికే కక్ష్యలో ఉన్న జిశాట్–7 (రు క్మి ణి) స్థానాన్ని భర్తీ చేయనుంది.

**ఏకంగా 40 అంతస్తుల భవనమంత భారీ రాకెట్ నిర్మించే పనిలో ఇస్రో**

అంత కుముందు ఏకంగా 40 అం తస్తుల భవనమంత భారీ రాకెట్ నిర్మించే పనిలో నిమగ్నమైనట్లు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. ఇటీవలె హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ ఏడాది నావిక్ ఉపగ్రహం, ఎన్–1 రాకెట్ ప్రయోగం, అమెరికాకు చెందిన 6,500 కిలోల బరువైన కమ్యూనికేషన్ శాటిలైట్‌ను కక్ష్యలోకి చేర్చడం వంటి ప్రాజెక్టులు చేపట్టనుందని వివరించారు.

## హిమాచల్‌కు రూ. 1500 పంజాబ్‌కు రూ. 1600 కోట్లు

▶ తక్షణ సాయం ప్రకటించిన ప్రధాని మోదీ
▶ మృతుల బంధువులకు ఒక్కొక్కరికీ రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు
▶ వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే



**షిమ్లా/ధరంశాల :** వరద బాధిత హిమాచల్‌ప్రదే, పంజాబ్‌లో ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం పర్యటించారు. హిమాచల్‌కు తక్షణసాయంగా రూ. 1500 కోట్లు , పంజాబ్‌కు రూ. 1,600 ప్రకటించారు. హిమాచల్‌లో రాష్ట్రంలో వరదలు, కొండచరియలు విరిగిపడిన పరిస్థితిని సమీక్షించిన మోదీ, మృతుల బంధువులకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ.50,000 ప్రకటించారు. వరద బాధిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేశారు. అదే విధంగా 1988 తర్వాత అత్యంత దారుణమైన వరదలతో సతమతమవుతున్న పంజాబ్ రాష్ట్రంలో పరిస్థితిని, నష్టాన్ని సమీక్షించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం ఆ రాష్ట్రానికి రూ.1,600 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న రూ.12,000 కోట్లకు అదనంగా సరిహద్దు రాష్ట్రానికి మోదీ సహాయం ప్రకటించారు. వరదలు, ప్రకృతి వైపరీత్యాలలో మరణించిన వారి బంధువులకు రూ.2 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియాను కూడా ఆయన ప్రకటించారు. కాగా, హిమాచల్‌లో ఏరియల్ సర్వే అనంతరం సహాయ, పునరావాస చర్యలను సమీక్షించడానికి, నష్టాన్ని అంచనా వేయడానికి కాంగ్రాలో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి సుఖ్‌వీందర్ సింగ్ సుఖు, గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, బిజెపి నాయకులు, బాధిత కుటుంబాలు, కాంగ్రాలో సహాయ సేవలలో నిమగ్నమైన వ్యక్తులతో జరిగిన సమావేశంలో, ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పునరుద్ధరణ, పునర్ని ర్మాణానికి మోదీ అన్ని విధాలుగా సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. పి ఎం కిసాన్ సమ్మాన్ నిధి, ఎస్‌డిఆర్‌ఎఫ్ కింద రెండవ విడతలో ముందుగా రూ. 1500 కోట్ల ఆర్థిక సాయం అందనుంది. వరద ప్రభావిత ప్రాంతాలను, ప్రజలను తిరిగి ఆర్థికంగా నిలబెట్టడానికి బహుముఖ చర్యలు తీసుకోవాలని మోదీ సూచించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా ఇళ్ల పునర్నిర్మాణం, జాతీయ రహదారుల పునరుద్ధరణ, పాఠశాలల పునర్నిర్మాణం, పిఎంఎన్‌ఆర్‌ఎఫ్ కింద ఉపశమనం అందించడంతో పాటు పశువులకు మినీ కిట్‌లను విడుదల చేయడం వంటి అనేక చర్యలను చేపట్టనున్నారు. ఈ క్లిష్ట సమయంలో కేంద్రం హి మాచల్ ప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తుందని, సాధ్యమైన అన్ని సహా యాన్ని అందిస్తుందని మోదీ చె ప్పారు. నష్టాన్ని కచ్చితంగా అంచనా వేయడానికి, సహాయం వేగంగా అందేలా చూడటానికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద దెబ్బతిన్న ఇళ్లకు జియోట్యాగింగ్ చేయనున్నట్లు ఆయన అన్నారు. పరిస్థితిని పరి ష్కరించడానికి కేంద్రం అన్ని ప్రయత్నాలు చేస్తుందని హామీ ఇచ్చారు. ముం దుగా, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో భారీ వర్షాలు విధ్వంసం సృష్టించిన మేఘావృతాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడిన తర్వాత రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిపై ఒక ప్రజెంటేషన్‌ను కూడా ఆయన చూశారు. జూన్ 20 నుండి సెప్టెంబర్ 8 వరకు కురిసిన భారీ వర్షాల కారణంగా హిమాచల్ ప్రదేశ్‌లో కుంభవృష్టి, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం వల్ల రూ.4,122 కోట్ల నష్టం వాటిల్లిందని, రాష్ట్రంలో వర్ష సంబంధిత సంఘటనలు, రోడ్డు ప్రమాదాలలో 370 మంది మరణించారని రాష్ట్ర అత్యవసర ఆపరేషన్ సెంటర్ తెలిపింది. వీటిలో కొండచరియలు విరిగిపడటం వల్ల 43 మరణాలు, మేఘావృతాల వల్ల 17 మరణాలు, ఆకస్మిక వరదల వల్ల తొమ్మిది మంది మరణించారు. అదనంగా, 41 మంది ఇంకా కనిపించకుండా పోయారు, రోడ్డు ప్రమాదాల్లో 165 మంది మరణించారు.

# ఇసిఐకి ‘సుప్రీం’ మొట్టికాయ

బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు కొద్దినెలల ముందు భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) బుద్ధిపూర్వకంగా కావచ్చు లేదా కేంద్రప్రభుత్వ బాధ్యుల ఆదేశంపై కావచ్చు – హడావుడిగా ఆరంభించిన ఓటర్ల ముమ్మర రివిజన్ (ఎస్ఐఆర్) ఆదినుంచీ సందేహాస్పదంగా, వివాదాస్పదంగా మారినందున, దానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ల విచారణ సందర్భంగా, యూనిక్ ఐడెంటిటీ కార్డు ‘ఆధార్’ను కూడా ఓటర్ల నివాస ధృవీకరణ పత్రంగా అనుమతించటాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు బెంచి ఒకటికి రెండుసార్లు ఇచ్చిన సలహాను ఇసిఐ పట్టించుకోకపోవటం దాని చర్మం ఎంత దళసరిగా ఉందో విదితం చేస్తున్నది. చివరకు, సోమవారం నాటి విచారణలో సుప్రీంకోర్టు, ఇసిఐ 11 డాక్యుమెంట్స్ జాబితాకు 12వ డాక్యుమెంట్‌గా ఆధార్‌ను చేర్చాలని ఆదేశించాల్సి వచ్చింది. ఆధార్ పౌరసత్వ ధృవీకరణ పత్రం కాదు – పౌరసత్వ నిర్ధారణ ఎన్నికల సంఘం పనికాదు. అయినా ఎవరో ఆదేశించినట్లు ‘చొరబాటుదారులను’ ఓటర్ల జాబితానుంచి ఏరివేసే బాధ్యతను ఇసి నెత్తికెత్తుకుంది. అందువల్లనే ఇంత రాద్ధాంతం.

మన దేశంలో జనన–మరణాలన్నీ రిజిస్టర్ కాక పోవటం,విద్యావంతులు ఉద్యోగ, వ్యాపారాలకై, పేదలు పొట్టచేతబట్టుకుని ఉపాధి వెతుక్కుంటూ అవకాశాలున్న ప్రదేశాలకు పెద్ద సంఖ్యలో వలసలు పోవటం, కిరాయి ఇళ్లు మారుతూ ఉండటం తత్కారణాలతో రెండుచోట్ల ఓటు కలిగి ఉండటం సాధారణ విషయం. అది ఎన్నికల కమిషన్ దృష్టిలో చట్టవ్యతిరేకం కావచ్చు. కాని సొంత ఊర్లో ఓటు లేకపోతే మరణించిన లెక్కలో చేరిపోతామని సామాన్యుల భయం. ఎన్నికల సమయంలో స్వగ్రామం వచ్చి ఓటుహక్కు వినియోగించుకుంటూ ఉంటారు. అయితే ఓటర్ల జాబితాల ప్రక్షాళన పేరు తో 65 లక్షల పేర్లను బిహార్ ఓటర్ల జాబితాలనుంచి ఇసి తొలగించింది. జనవరిలో సమ్మరీ రివిజన్ తర్వాత మొత్తం ఓటర్ల సంఖ్య 7.89కోట్లు. తాజా ముమ్మర రివిజన్‌లో – మరణాలు, రెండు చోట్ల ఓట్లు, శాశ్వతంగా వలసవెళ్లటం అనే కారణాలతో ఆ 65లక్షల ఓటర్ల పేర్లను ఇసి తొలగించింది. సుప్రీంకోర్టు ఆదేశంపైనే ఆ తొలగించిన పేర్లు ప్రకటించింది. ఆ జాబితాలో పేర్ల చేర్పు లేదా తొలగింపుకు వ్యక్తులు, రాజకీయ పార్టీలు నిర్ణీత ఫాంలో దరఖాస్తులు సమర్పించవచ్చన్నది.

ప్రజాపక్షం
10-09-2025, బుధవారం

ఇసిఐ మొండితనాన్ని అర్థం చేసుకోవటానికి ఈ టైంలైన్స్ సహాయపడతాయి. ఒక డాక్యుమెంట్‌గా ఆధార్‌ను అంగీకరించే విషయాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు జులై 10న సలహా ఇచ్చింది. జనాల గుర్తింపు, నివాస ఆధారంగా ‘ఆధార్’ను గుర్తించాల్సిందిగా ఆగస్టు 14న కోర్టు లాంఛనంగా ఆదేశించింది. ఇసి ప్రకటించిన 11 ఆధారాల్లో ఏదో ఒక దానితో ఆధార్ సమర్పించవచ్చుగాని, అదొక్కటే ఆధారం కాదని బిజెపి అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా భాష్యం చెప్పారు. బహుశా కిందిస్థాయి ఎన్నికల అధికారులు దాన్నే పాటించారేమో. అభ్యంతరాలు –క్లెయిములకు ఆధార్‌ను అధికారులు ఆమోదించ టం లేదని కోర్టుకు ఫిర్యాదులు అందాయి. ముసాయి దా ఓటర్ల జాబితా నుంచి తొలగించబడిన ఓటర్లు తమ క్లెయిములకు ఆధార్ కార్డు గాని లేక ఇసి11 పత్రాల్లో ఏదేనిగాని జతచేయవచ్చని సోమవారం సుప్రీంకోర్టు ధర్మాసనం తేల్చి చెప్పింది.

‘‘పాస్‌పోర్టు, జనన సర్టిఫికేట్ మినహా, ఇసి 11 డాక్యుమెంట్లలో మిగతా 9లో ఏదీ పౌరసత్వానికి నిర్ధారణపూర్వకమైన డాక్యుమెంట్ కాదు. ఆధార్ పౌరసత్వానికి రుజువు కాదని పిటిషనర్‌లు కూడా అంగీకరిస్తున్నారు. అటువంటప్పుడు మీ జాబితాకు ఆధార్‌ను ఎందుకు చేర్చరు? దీన్ని పరిశీలించాలని కోర్టు మీకు చాలాసార్లు చెప్పింది. మీరెందుకు పట్టించుకోవటం లేదు’’ అని జస్టిస్ బాగ్చి ఇసి కాన్సెల్‌ను ప్రశ్నించారు. ఆధార్‌ను అంగీకరించాల్సిందిగా బిహార్‌లో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఎన్నికల అధికారులు, బూత్ లెవల్ ఆఫీసర్‌లకు ఆదేశాలు జారీ చేయండని బెంచి ఆదేశించింది.

బిహార్ ఎన్నికల అనంతరం పశ్చిమ బెంగాల్, ఒడిశాల్లో ఎస్ఐఆర్ నిర్వహిస్తామని ఇసిఐ ఇప్పటికే ప్రకటించింది. అన్ని రాష్ట్రాల్లో అట్టి పరిశీలనకు రాష్ట్ర ఎన్నికల అధికారులను సన్నద్ధం చేస్తున్నది. ఈ తరుణంలో ఆధార్‌కార్డును కూడా ఓటరు గుర్తింపుకు ధృవీకరణ పత్రంగా గుర్తించాలని సుప్రీంకోర్టు ఇసిఐని ఆదేశించటంవల్ల తమ ఉనికిని ధృవీకరించుకునేందుకు బిహార్ ప్రజలు ఆఫీసులచుట్టూ తిరుగుతూ పడిన కష్టాలనుంచి దేశ ప్రజలను తప్పించినట్లయింది.

అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ఇసిఐ ఓటర్ల జాబితాల తారుమారుకు సహాయపడుతోందని, ‘ఓట్ చోరీ, అధికారం చోరీకి’ తోడ్పడుతోందని ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ధ్వజమెత్తుతున్నారు. కర్నాటక, మహారాష్ట్రలో కొన్ని నియోజకవర్గాల్లో ఓటింగ్ తీరుగూర్చి వారు అడిగిన సమాచారా న్ని నిరాకరించటం, కొంత డేటాను చెరిపివేయటం ప్రతిపక్షం ఆరోపణకు బలం చేకూర్చింది.

రాహుల్‌గాంధీ, ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్, సిపిఐ, సిపిఐఎంఎల్ తదితర ఇండియా కూటమి పార్టీలు బిహార్‌లో 15 రోజులపాటు ‘ఓటర్ అధికార్’ జీపు యాత్ర నిర్వహించి ఇసిని ఎండగట్టా రు. జవాబుదారీతనం బదులు ఇసి గోప్యతను పాటించటం, దాన్ని గట్టిగా సమర్థించుకోవటం, దాని నిజాయితీని ప్రశ్నార్థకం చేస్తున్నది.

# ఘనంగా వియత్నాం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**అమియాద్ రోవిట్జ్**

వియత్నాం ప్రజలు 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా జరుపుకున్నారు. వేడుకల్లో భాగంగా దేశ చరిత్రలోనే అతిపెద్ద కవాతును రాజధాని హనోయ్‌లో పెద్ద ఎత్తున నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా భావి తరాలకు స్ఫూర్తినిచ్చే సైనిక కవాతులో యువత, మహిళలు, పౌరులు పెద్ద సంఖ్యలో అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం స్వాతంత్ర్యం ప్రకటించిన మొట్టమొదటి దేశాలలో వియత్నాం ఒకటి. 1945 సెప్టెంబర్ 2న అధ్యక్షుడు హోచిమిన్ మాట్లాడుతూ, వియత్నాం ఎప్పటికీ విదేశీ ఆధిపత్యానికి లొంగదని ప్రపంచానికి ప్రకటించిన విషయాన్ని వేడుకల్లో గుర్తు చేశారు. వియత్నాం విప్లవ విజయం ఆఫ్రికా నుంచి లాటిన్ అమెరికా వరకు వలసవాద వ్యతిరేక సోషలిస్టు ఉద్యమాలకు మార్గదర్శిగా మారింది. వియత్నాం ప్రపంచంలోని సామ్రాజ్యవాద శక్తులను ఓడించగలదని నిరూపించింది.

కవాతు ప్రారంభంలో, కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శి టో లామ్, బా దిన్ స్క్వేర్‌లో హోచిమిన్ స్వాతంత్ర్య ప్రకటనను చదివిన క్షణాన్ని గుర్తుచేసుకున్నారు. వియత్నాం ఆగ్నేయాసియాలో మొట్టమొదటి ప్రజాస్వామ్యదేశమని, దేశానికి స్వాతంత్ర్యం, స్వేచ్ఛ డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ వియత్నాంకు నాంది పలికిందన్నారు. వియత్నాం విజయాలన్నీ ‘‘హోచిమిన్ ఆలోచన, నైతికత, నాయకత్వ లక్షణాలకి’’ తార్కాణమన్నారు. వియత్నాం విజయానికి మార్క్సిజం – లెనినిజం సిద్ధాంతాలు, హోచిమిన్ ఆలోచనా విధానానికి నిదర్శనమని టో లామ్ పేర్కొన్నారు.. ‘‘మా పార్టీ, సోషలిజంతో ముడిపడి జాతీయ స్వాతంత్ర్య లక్ష్యంతో దృఢంగా ఉందని పేర్కొన్నారు. దేశ పరిస్థితులకు అనుగుణంగా మార్క్సిజం – లెనినిజం, హోచిమిన్ ఆలోచనలను సృజనాత్మకంగా అన్వయించి అభివృద్ధి చేసిందన్నారు. ప్రజల ప్రయోజనాలు ప్రాతిపదికగా వియత్నాం అభివృద్ధి చెందిందని టామ్ విశ్వాసం వెలిబుచ్చారు.

హనోయ్‌లో అత్యంత కన్నుల పండుగగా జరిగిన కవాతు ఆ దేశ చరిత్రను తిరిగి పరిశీలించడంతో





పాటు వియత్నాం ప్రస్తుత విజయాలకు తార్కాణం. స్వాతంత్ర్య, పునరేకీకరణ కోసం వియత్నాంకు అండగా నిలిచిన కంబోడియా, లావోస్, చైనా, రష్యా దళాలు వియత్నాం పీపుల్స్ ఆర్మీతో పాటు కవాతులో పాల్గొనడం విశేషం. వియత్నాంలోని విభిన్న ప్రాంతాలు, పరిశ్రమలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పౌర ప్రతినిధులు, యుద్ధం, దిగ్బంధన రోజుల నుంచి ఏ విధంగా అభివృద్ధి చెందాయో, అనంతర పరిస్థితుల్లో వియత్నాం సాధించిన విజయాలను ప్రదర్శించారు.

1986లో వియత్నాం పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టిన నాటినుంచి వియత్నాం ప్రపంచంలోని అభివృద్ధి చెందుతున్న దేశంగా మారింది. వియత్నాం ఆర్థిక వ్యవస్థ అనేక రెట్లు పెరిగింది, దేశంలో పేదరికం దాదాపు పూర్తిగా తగ్గింది. వియత్నాం వాణిజ్యం, తయారీ రంగం, నూతన ఆవిష్కరణలకు కేంద్రంగా మారింది. ఇతర దేశాల మాదిరిగా వియత్నాం నయా ఉదారవాద, ప్రపంచీకరణ మార్గాన్ని అనుసరించలేదు, బదులుగా దాని స్వంత సోషలిస్ట్ ఆధారిత మార్గాన్ని రూపొందించుకుంది. దేశంలో సంస్కరణలు, స్వాతంత్ర్యం ప్రాతిపదికగా వియత్నాం బహుముఖంగా అభివృద్ధి చెందింది. ఈ మార్గం ప్రజల సంకల్పంలో పాతుకుపోయిందని టో లామ్ నొక్కిచెప్పారు. ‘‘ఆ బలం ప్రజల నుంచి ఉద్భవించింది, ప్రజలకు చెందినది. ప్రజల కోసం వియత్నాం కమ్యూనిస్ట్ పార్టీ అద్భుతమైన అజెండా కింద ఉన్న జాతీయ సంఘీభావ కూటమి బలం’’గా పేర్కొన్నారు. ప్రజల బలాన్ని దేశ భవిష్యత్తు లక్ష్యాలతో ముడిపెట్టారు. 2045 నాటికి, వియత్నాం స్వాతంత్ర్య శతాబ్ది లక్ష్యంగా ‘‘శక్తిమంతమైన, సంపన్నమైన, సంతోషకరమైన దేశంగా’’ ఉండాలని తమ లక్ష్యంగా పేర్కొన్నారు. ఇది ఆ దేశ ప్రజల ఆకాంక్షగా తెలిపారు.

వియత్నాం స్వాతంత్ర్యం, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి తమ సంసిద్ధతను పునరుద్ఘాటిస్తూ, టో లామ్ దేశంలో శాంతిని సంపూర్ణంగా నెలకొల్పడమే తమ ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. ‘‘మేము ప్రపంచంలోని అన్ని దేశాలకు స్నేహితుడిగా, నమ్మకమైన భాగస్వామిగా ఉండాలనుకుంటున్నాము. మేము అంతర్జాతీయ చట్టాన్ని, ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను గౌరవిస్తాము, శాంతియుత చర్చల ద్వారా విభేదాలు, వివాదాలను పరిష్కరిస్తాము.’’ అయితే, వియత్నాం ‘‘స్వాతంత్ర్యం, సార్వభౌమాధికారం, ఐక్యత, ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించే ఎటువంటి కుట్రలు లేదా చర్యలతో ఏ మాత్రం రాజీపడదు’’ అని ఆయన నొక్కి చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా దేశాలు వియత్నాం పోరాట ఔచిత్యాన్ని నొక్కి చెబుతూ, అత్యంత శక్తిమంతమైన సామ్రాజ్యవాద దేశాలను కూడా ఓడించవచ్చని ప్రపంచం ఇప్పటికీ వియత్నాం వైపు చూస్తుందని అన్నారు.

వియత్నాం ఆధునిక సైనిక సాంకేతికత ప్రదర్శనలపై ప్రధానంగా మీడి యా తన దృష్టిని సారించింది. ఈ ఉత్సవాలు కార్మికవర్గం, ప్రజా ప్రాతినిధ్యాన్ని కూడా హైలైట్ చేశాయి. కార్మికులు, రైతులు, యువకులు హనోయ్ వీధుల గుండా కవాతులో పాల్గొనడం అత్యంత ఆకర్షణగా నిలిచింది. ఎనభై సంవత్సరాల అనంతరం వియత్నాం ప్రజల త్యాగం, సంఘీభావం ద్వారా ఏర్పడిన దేశంగా కీర్తి గణించింది. వలసవాద గొలుసులను విచ్ఛిన్నం చేయడానికి పెట్టుబడిదారీ ఆధిపత్య ప్రపంచ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, సోషలిజం వైపు తమ మార్గాన్ని అనుసరిస్తున్నదని ప్రజలు పేర్కొన్నారు. దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం, శ్రేయస్సు ప్రాతిపదికలుగా దేశాన్ని మరింత అభివృద్ధిపథంలో నడిపిస్తామని లామ్ విశ్వాసం వెలిబుచ్చారు.

# లేబర్ కోడ్‌లపై ప్రభుత్వంలో భిన్నాభిప్రాయాలు

**డాక్టర్ జ్ఞాన్ పాఠక్**

ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ భారతీయ మజ్దూర్ సంఘ్ (బిఎంఎస్) వేతన కోడ్ 2019, సామాజిక భద్రత కోడ్ 2020లను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేసినప్పటికీ, రాజకీయ నాయకత్వం, అధికారుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం అండదండలు కలిగిన బిఎంఎస్ ఇతర రెండు కార్మిక కోడ్‌ల (పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020,వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ 2020) లలో ఉన్న అనేక నిబంధనలు కార్మిక వ్యతిరేకమైనవని పేర్కొనడం ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వానికి బిఎంఎస్ కొత్త తలనొప్పిని సృష్టించింది. పది కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక ఇప్పటికే ఈ నాలుగు కార్మిక కోడ్లన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేసింది. దేశవ్యాప్త ఆందోళనలు నిర్వహించింది.

29 కార్మిక చట్టాలను కలిపి తయారు చేసిన నాలుగు కార్మిక కోడ్లు ఒక సమగ్ర ప్యాకేజీ అని, అందువల్ల వాటిని విడదీయడం సాధ్యం కాదని ప్రభుత్వంలో నెలకొన్న ప్రధాన అభిప్రాయం. వీటిని ఒకేసారి అమలు చేయాలి లేదంటే అసలు అమలు చేయకూడదు. దశలవారీగా అమలు చేస్తే, అది పరిష్కరిం చే సమస్యల కంటే ఎక్కువ సమస్యలను సృష్టించవచ్చు.

బిఎంఎస్ చేస్తున్న ఇతర రెండు డిమాండ్‌లు ప్రభుత్వాన్ని ఆందోళనకు గురి చేశాయి. భోపాల్‌లో ఆగస్టు 22,24 తేదీలలో జరిగిన 159వ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (ఐఎల్‌సి)ని నిర్వహించాలని కోరుతూ తీర్మానం చేసింది. కార్మిక సమస్యలపై అత్యున్నత త్రైపాక్షిక సంస్థ అయిన ఐఎల్‌సిని మోదీ ప్రభుత్వం 2015 నుండి నిర్వహించలేదు. ఈ విధంగా డిమాండ్ చేయడమే ప్రభుత్వం కార్మిక వ్యతిరకమైనదని భావించవచ్చు. ఎందుకంటే ప్రభుత్వం ఐఎల్‌సిని పట్టించుకోకుండా నాలుగు కార్మిక కోడ్లను తీసుకువచ్చింది. బిఎంఎస్ అధ్యక్షుడు హిరణ్మయ్ పాండ్యా మాట్లాడుతూ ‘‘చివరిసారిగా 2015లో ఐఎల్‌సి జరిగింది. కార్మిక మంత్రిత్వ శాఖ కింద అత్యున్నత త్రైపాక్షిక సంస్థ ఐఎల్‌సి. ఇది భారత ప్రజాస్వామ్యంలో ఉత్తమ భాగస్వామ్యాలలో ఒకటి. 2015 తర్వాత, ఉద్యోగ ప్రపంచం బహుళ కోణాల్లో గణనీయమైన మార్పులకు లోనైంది. టెక్నాలజీ, డిజిటల్ మౌలిక సదుపాయాలు, డిజిటల్ పరివర్తన, సామాజిక జీవితం, ఆర్థిక పరిస్థితులలో అనేక మార్పులను తీసుకువచ్చాయి. అత్యున్నత నిర్ణయాలను తీసుకునే సంస్థలో కార్మిక సమస్యలపై చర్చించడం అత్యవసరం’’ అని అన్నారు.

కనీస వేతనం,వేతనాలను సకాలంలో చెల్లించడంపై వేతనాల కోడ్ దృష్టి పెడుతుందని, గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులతో సహా అన్ని రకాల కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ, ప్రసూతి, బీమా వంటి ప్రయోజనాలను సామాజిక భద్రత కోడ్ విస్తరింపజేస్తుందని పాండ్యా అన్నా రు. అయినప్పటికీ, పారిశ్రామిక సంబంధాల కోడ్, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్‌లలో కార్మికుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న అనేక నిబంధనలను బిఎంఎస్ వ్యతిరేకిస్తోంద ని ఆయన నొక్కి చెప్పా రు. రెండు కార్మిక కోడ్లలో గణనీయమైన మార్పు లు లేకుండా క్షేత్రస్థాయి లో కార్మికులు వాటిని అంగీకరించడానికి సిద్ధంగా లేరని చెప్పేందుకు వాటిపై విమర్శలు సూచిస్తున్నాయి. ప్రభుత్వం వాటిని అమ లు చేయడానికి ప్రయత్నిస్తే నిరసనలను ఉధృతం చేస్తామని 10 కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక ఇప్పటికే హెచ్చరించింది.

ఈ నేపథ్యంలో బిఎంఎస్ డిమాండ్ చేసినట్లుగా, కార్మిక కోడ్లను దశలవారీగా అమలు చేయడం సాధ్యమేనా అని కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయడం ప్రారంభించింది. ప్రభుత్వం తుది నిర్ణయానికి వచ్చే వరకు కోడ్ల అమలు మరింత ఆలస్యం అవుతుందని ఇవన్నీ సూచిస్తున్నాయి.

ఈలోగా తనపై కార్మిక వ్యతిరేకి అని ఉన్న ముద్రను మార్చుకోవడానికి, దేశంలో కార్మికుల సంక్షేమానికి తాము పాటుపడుతున్నామని చూపించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ప్రభుత్వం ఇటీవల అనేక సామాజిక భద్రతా పథకాలను ప్రారంభించింది.

> *కార్మిక కోడ్లు అమలు చేయడానికి ముందు కార్మిక వర్గం విశ్వాసాన్ని పొందాలనే ఆశతో ప్రభు త్వం ప్రచార యంత్రాంగం ప్రస్తుతం సామాజిక భద్రతా పథకాలపై దృష్టి సారించడం ద్వారా రాజకీయ నాయకత్వాన్ని కార్మికులకు అనుకూలమని చూపించడానికి పనిచేస్తోంది. బిఎంఎస్ వైఖరిలో ఎటువంటి మార్పు రాకపోవడం ప్రభుత్వానికి తీవ్ర ఆందోళన కలిగించే విషయం. ఇది వేతన కోడ్, సామాజిక భద్రత కోడ్ల అమలుకు మద్దతు ఇస్తున్నప్పటికీ, పారిశ్రామిక సంబంధాల కోడ్, వృతిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ల అమలుకు వ్యతిరేకంగా ఉంది.*

ఉద్యోగ సృష్టిపై ప్రధాన్ మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన (పిఎం విబిఆర్‌వై) కింద ఒక సంవత్సరం ఆలస్యం తర్వాత, ఎంప్లాయ్‌మెంట్ లింక్డ్ స్కీమ్ (ఇఎల్ఐ) చివరకు 2025 ఆగస్టు 1న ప్రారంభమైంది. ఇది 2027 జూలై 31 వరకు అమలులో ఉంటుంది. ఈ పథకం ఇపిఎఫ్ఒ ద్వారా అమ లు చేయబడుతుంది. ఇపిఎఫ్ఒలో సభ్యులుగా మారే ప్రతి కార్మికునికి సబ్సిడీ ఇవ్వబడుతుంది. కొత్తగా ప్రారంభించిన పథకం ప్రభావాన్ని అంచనా వేయడానికి కార్మిక , ఉపాధి మంత్రిత్వ శాఖ, గణాంకాలు , కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ (ఎంఒ ఎస్‌పిఐ)తో సహకరించాలని కోరింది.

కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్, కుటుంబ పెన్షన్ ద్వారా ఇపిఎఫ్ఒ సామాజిక భద్రతను అందిస్తుంది. అయితే, భారతదేశంలో సంఘటిత రంగం లో, అసంఘటిత రంగంలో కలిపి 90 శాతానికి పైగా ఉద్యోగాలు అనియత ఉద్యోగాల్లో ఉండడమే సమస్య. ఇపిఎఫ్ఒ ద్వారా కార్మికులకు సామాజిక భద్రతను కల్పిస్తున్నట్లు చూపించుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అయితే, ఈ పథకం 90 శాతానికి పైగా అనియత కార్మికులకు వర్తించకపోవడం దురదృష్టకరం.

కార్మికుల కోసం ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఇఎస్ఐ) పథకం కింద సామాజిక భద్రతను విస్తరించడానికి స్ప్రీ(ఎస్‌పిఆర్ఇఇ) 2025 అనే మరో పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. ఈ ప్రత్యేక నమోదు కార్యక్రమం 2025 డిసెంబర్ 31 వరకు అందుబాటులో ఉంటుంది. ఇది యజమానులు, కార్మికులకు చట్టబద్ధమైన సామాజిక భద్రతలోకి రావడానికి ఒక కొత్త అవకాశాన్ని అందిస్తుంది. కార్మికుల సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, కార్మికులు అందరికీ ఉదారంగా, సమగ్రమైన సామాజిక భద్రత చట్రాన్ని అభివృద్ధి చేయడానికి మా ప్రభుత్వం కట్టుబ డి ఉంది అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

ఈ కార్యక్రమం లక్షల మంది నమోదు కాని ఉద్యోగులను, ఒప్పంద, తాత్కాలిక ఉద్యోగాలలో ఉన్నవారితో సహా, ఇఎస్ఐ పరిధిలోకి తీసుకువచ్చి, ఆరోగ్య సంరక్షణ, ప్రసూతి మద్దతు, ఆర్థిక భద్రత, ఇతర ప్రయోజనాలను అందుబాటులోకి తీసుకువస్తుంది. స్ప్రీ 2025 కింద నమోదు చేసుకునే యజమానులు గణనీయమైన సడలింపులను పొందుతా రు. గతంలో యాజమాన్యాల వంతు చెల్లించాల్సిన ( కాంట్రిబ్యూషన్‌ల) మొత్తం కోసం జరిమానాలు లేదా పాత డిమాండ్లు ఉండవు. గత కాలాలకు తనిఖీలు ఉండవు. యజమాని ప్రకటించిన తేదీ నుండి రిజిస్ట్రేషన్ చెల్లుబాటు అవుతుంది.

స్ప్రీ 2025 తో పాటు, ప్రభుత్వం అమ్నెస్టీ స్కీమ్ 2025ను ఆమోదించింది. ఇది 2025 అక్టోబర్ 1 నుండి 2026 సెప్టెంబర్ 30వరకు అమలులో ఉంటుంది. ఇది యజమానులకు ఇఎస్ఐ చట్టం కింద వివాదాలు, పెండింగ్ కేసులను పరిష్కరించుకోవడానికి ఏక కాల అవకాశాన్ని కల్పిస్తుంది.

గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు (అనియత కార్మికులలో ఒక ఉపవిభాగం) సంబంధించి, ఇంకా అమలు చేయని సామాజిక భద్రత కోడ్, 2020 కింద వారికి చట్టపరమైన గుర్తింపు, సామాజిక భద్రత ప్రయోజనాలు లభిస్తాయని ప్రభుత్వం చెబుతోంది. భారతదేశంలో గిగ్ వర్కర్స్ 2024–25లో 1 కోటి నుండి 2029–30 నాటికి 2.35 కోట్లకు పెరుగుతారని అంచనా. అయినప్పటికీ, 1 కోటి గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులలో ఇప్పటివరకు 3.37 లక్షల మంది మాత్రమే ఈ–శ్రమ్ పోర్టల్‌లో స్వయంగా నమోదు చేసుకున్నారు. ఈ పోర్టల్ ఇప్పటివరకు సుమారు 30.98 లక్షలమంది అనియత కార్మికులను నమోదు చేసింది.

కార్మిక కోడ్లు అమలు చేయడానికి ముందు కార్మిక వర్గం విశ్వాసాన్ని పొందాలనే ఆశతో ప్రభు త్వం ప్రచార యంత్రాంగం ప్రస్తుతం సామాజిక భద్రతా పథకాలపై దృష్టి సారించడం ద్వారా రాజకీయ నాయకత్వాన్ని కార్మికులకు అనుకూలమని చూపించడానికి పనిచేస్తోంది. బిఎంఎస్ వైఖరిలో ఎటువంటి మార్పు రాకపోవడం ప్రభుత్వానికి తీవ్ర ఆందోళన కలిగించే విషయం. ఇది వేతన కోడ్, సామాజిక భద్రత కోడ్ల అమలుకు మద్దతు ఇస్తున్నప్పటికీ, పారిశ్రామిక సంబంధాల కోడ్, వృతిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ల అమలుకు వ్యతిరేకంగా ఉంది.

**(ఐపిఎ సర్వీస్)**




చలో చండీఘడ్

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)
**25వ కాంగ్రెస్**
21–25 సెప్టెంబర్, 1925
చండీఘడ్ (పంజాబ్)

## నిబంధనావళిలో పెనుమార్పులు తెచ్చిన
# సిపిఐ 5వ (అసాధారణ)కాంగ్రెస్
### అమృత్‌సర్ (పంజాబ్) 1958

కేరళలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చిన (1957) నేపథ్యంలో 1958 (ఏప్రిల్ 6–13)లో అమృత్‌సర్‌లో ఈ ఐదవ (అసాధారణ) కాంగ్రెస్ (జాతీయ మహాసభ) సిపిఐ చరిత్రలో ఒక మైలురాయి. అది పార్టీ నిబంధనావళిలో ప్రధానమైన మార్పులు తెచ్చింది. కొత్త నిబంధనావళిని ఆమోదించింది.

భారత కమ్యూనిస్టు పార్టీ విధానంలో గుణాత్మక మార్పు తెచ్చిన ఈ మహాసభకు ముందు సంవత్సరాల్లో దేశంలో జరిగిన పరిణామాలను సూక్ష్మంగా గుర్తుచేసుకుందాం. 1948–50 సంవత్సరాల మధ్య బిటిఆర్ నాయకత్వంలో పార్టీ అనుసరించిన పిడివాద సాయుధ తిరుగుబాటు పంథా విడనాడి దిద్దుబాటు చర్యలు తీసుకున్నప్పటికీ పార్టీ నిర్మాణ రీత్యా కోలుకుని ప్రజల మధ్యకు వెళ్లటానికి, ప్రజా ఉద్యమాల్లో భాగస్వామి కావ




టానికి, నిర్మించటానికి కొంతకాలం పట్టింది. పార్టీలో సిద్ధాంత సమస్యలు కొనసాగుతున్నప్పటికీ ప్రజా ఉద్యమాల నిర్మాణంలో పార్టీ అగ్రభాగాన ఉండి వారి అభిమానాన్ని పొందుతూ వచ్చింది. స్వాతంత్ర్య పోరాటంలో ఒక ప్రధానాంశమైన భాషా ప్రయుక్త రాష్ట్రాలుగా దేశ పునర్నిర్మాణం కోసం ఉద్యమం మొదలైంది. దక్షిణాదిని తీసుకుంటే, తెలంగాణలో సాయుధ పోరాటం విరమణ తర్వాత, 1952 సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ మంచి ఫలితాలు సాధించింది. అయితే తెలంగాణ స్టేట్‌లో భాగంగా ఉన్న కన్నడ, మరాఠా భాషా ప్రాంతాలు కాంగ్రెస్‌కు పట్టం గట్టాయి. పక్కనే ఉన్న ఆంధ్ర ప్రాంతం అప్పుడు బ్రిటీష్‌వారి మద్రాసు ప్రెసిడెన్సీలో భాగంగా మద్రాసు స్టేట్‌లో ఉంది. ఆంధ్రలో ఫ్యూడల్ – భూస్వామ్య వ్యతిరేక పోరాటం పెద్ద ఎత్తున సాగింది. 1952 ఎన్నికల్లో ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టులు మంచి ఫలితాలు సాధించినా తమిళ, మళయాళ ప్రాంతాల్లో కాంగ్రెస్ తదితరులు అత్యధిక స్థానాలు గెలిచారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్, కమ్యూనిస్టుల ముమ్మర పోరాటాల పర్యవసానంగా 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. 1955లో అసెంబ్లీకి మధ్యంతర ఎన్నికల్లో కమ్యూనిస్టులదే అధికారం అన్న వాతావరణంలో సిపిఐ ఒంటెత్తుపోకడ, సిపిఐకి వ్యతిరేకంగా ఇతర పార్టీలన్నీ ఏకం కావటం వల్ల, పార్టీ ఘోరమైన ఓటమికి గురైంది. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఉద్యమం ఉధృతం కావటంతో మద్రాసు ప్రెసిడెన్సీ బద్దలై అటు కేరళ, తమిళనాడు రాష్ట్రాల పునర్నిర్మాణం జరిగింది. ఇటు తెలంగాణ స్టేట్ నుంచి కన్నడ, మరాఠా జిల్లాలను ఆయా రాష్ట్రాల్లో కలిపారు. విశాలాంధ్ర (ఆంధ్రప్రదేశ్) రాష్ట్రం ఏర్పాటుకోసం ఇరు ప్రాంతాల్లోని కాంగ్రెస్ ప్రముఖులు, కమ్యూనిస్టులు ఉద్యమించారు. ఇరుప్రాంతాల కాంగ్రెస్ నాయకుల మధ్య ‘పెద్దమనుషుల ఒప్పందం’తో 1956 నవంబరు 1న తెలుగు భాషా ప్రాంతాలను ఐక్యం చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించింది. (అయితే కొండా వెంకట రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి మరికొందరు ఆ విలీనాన్ని వ్యతిరేకించారు. అదే అనంతర దశాబ్దాల్లో ఉద్యమంగా, సెంటిమెంట్‌గా కొనసాగుతూ 2000 సంవత్సరం తదుపరి ప్రజా ఉద్యమంగా ఉధృతమై 2014 జూన్ 2న ఆంధ్రప్రదేశ్ విడిపోయి ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది.)



మద్రాసు స్టేట్‌లోని మలబార్ జిల్లాను ట్రావెన్కూర్–కొచ్చిన్ సంస్థానంతో విలీనం చేయటం ద్వారా 1956 నవంబర్ 1న కేరళ రాష్ట్రం ఏర్పడింది. మళయాళం భాష ప్రాతిపదికపై కేరళ రాష్ట్రం ఏర్పాటుకోసం, అంతకుముందు ట్రావెన్కూర్ ఫ్యూడల్ సంస్థానానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టుపార్టీ పెద్ద ఉద్యమాలు నడిపింది. సౌభాగ్య కేరళ నిర్మాణానికి కార్యక్రమాన్ని కూడా ప్రజల ముందు ఉంచింది. 1957 ఎన్నికల్లో ప్రజలు సిపిఐకి 126 స్థానాల్లో 60 ఇచ్చి పట్టం కట్టారు. పార్టీ బలపరచగా గెలుపొందిన ఐదుగురు ఇండిపెండెంట్లను కలుపుకుని 1957 ఏప్రిల్ 5న ఇఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వాన కమ్యూనిస్టు ప్రభుత్వం పదవీ ప్రమాణ స్వీకారం చేసింది.

కేరళలో బ్యాలెట్‌ద్వారా కమ్యూనిస్టులు అధికారంలోకి రావటం పార్టీలోపల, బయట పలు సిద్ధాంతం, ఆచరణ ప్రశ్నలను పరిష్కరించింది. ఓటు ద్వారా కమ్యూనిస్టులు ఎన్నడూ అధికారానికి రాలేరనే వాదన పటాపంచలైంది. పార్టీ ఎంచుకున్న పార్లమెంటరీ సంస్థల ఎన్నికలను ఉపయోగించుకోవటం శాంతియుత పరివర్తన అనే పంథాకు బలం చేకూరింది. ఇటలీ, స్పెయిన్ లాంటి దేశాల్లో సంకీర్ణ ప్రభుత్వాల్లో కమ్యూనిస్టులు అధికారం పంచుకోవటం మినహా ఓటు ద్వారా అధికారంలోకి వచ్చిన సందర్భం అప్పటికి లేదు. అయితే స్వార్థపరులు, కాంగ్రెస్ సహా మితవాదులు ఆ ప్రభుత్వాన్ని పూర్తికాలం పని చేయనీయలేదు. కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1959లో ఆ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసింది.

దేశంలోని కొత్త పరిస్థితులు, కొత్త అనుభవాలను పరిగణనలోకి తీసుకుని అమృత్‌సర్ మహాసభ ఆమోదించిన నూతన కాన్స్టిట్యూషన్ (నిబంధనావళి)లో పొందుపరచబడిన మౌలికమైన మార్పులు ఇలా ఉన్నాయిః

1. ‘కార్మికవర్గ నియంతృత్వం’ (కమ్యూనిస్టు పార్టీ ఆధిపత్యం అని అర్థం) అనే భావనను విడనాడటం జరిగింది.
2. భారతదేశంలో భవిష్యత్‌లో సోషలిజంలో ప్రతిపక్ష పార్టీల అస్తిత్వం గుర్తించబడింది.
3. పరిపూర్ణ ప్రజాస్వామ్యం, సోషలిజంలను శాంతియుత మార్గాల ద్వారా సాధించేందుకు సిపిఐ పాటుబడుతుంది.
4. సకల దేశభక్తియుత, ప్రజాస్వామిక శక్తులను ఐక్యపరచటం ద్వారా జాతీయ స్వాతంత్ర్య పరిరక్షణకు ప్రతినబూనింది.
5. జాతీయకరణ, ప్రభుత్వరంగం వంటి మంచి లక్షణాలపై మితవాద, అభివృద్ధి నిరోధకులు దాడి చేస్తున్నారని పార్టీ కాంగ్రెస్ పేర్కొన్నది.
6. పార్టీ నిర్మాణంలో రెండంచెలు (కేంద్రకమిటీ, పోలిట్ బ్యూరో) స్థానంలో మూడంచెలు (జాతీయ సమితి, జాతీయ కార్యవర్గం, కార్యదర్శివర్గం) పద్ధతిని నిబంధనావళి ఆమోదించింది.

ఇఎంఎస్ నంబూద్రిపాద్ ‘న్యూ ఏజ్’లో అమృత్‌సర్ కాంగ్రెస్‌పై ఇలా వ్యాఖ్యానించారు. ‘‘సిపిఐ వాస్తవికంగా – జాతీయవాదం, ప్రజాస్వామ్యం, ప్రజలకు సేవచేయటం అనే కార్యక్రమాన్ని అనుసరిస్తున్నది; గాంధీజీ అహింస, సహాయ నిరాకరణ, స్వరాజ్ స్ఫూర్తిని పాటిస్తున్నది!!

కామ్రేడ్ అజయ్ ఘోష్‌ను ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నుకుంది. తొలిసారి కార్యదర్శివర్గం, కేంద్ర కార్యవర్గాలను ఎన్నుకుంది.

**కేంద్ర సెక్రటేరియట్ సభ్యులు**

అజయ్ ఘోష్(జనరల్ సెక్రటరీ) 2. ఎస్.ఎ.డాంగే, 3. భూపేష్ గుప్తా, 4. డాక్టర్ జడ్.ఎ.అహ్మద్, 5.బి.టి.రణదివె, 6.పి.సి.జోషి,7.ఎ.కె.గోపాలన్,8. ఎం.బసవ పున్నయ్య,

**కేంద్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు :**

1.అజయ్ ఘోష్, 2. ఎస్.ఎ.డాంగే, 3. భూపేష్ గుప్తా, 4. డాక్టర్ జడ్.ఎ.అహ్మద్, 5. బి.టి.రణదివె, 6. పి.సి.జోషి, 7. ఎ.కె.గోపాలన్, 8. ఎం.బసవ పున్నయ్య, 9. ఇఎంఎస్. నంబూద్రిపాద్,10.జ్యోతిబసు, 11.పి.రామమూర్తి, 12. ఎం.ఎన్.గోవిందన్ నాయర్,13. భవాని సేన్, 14. సి.రాజేశ్వరరావు, 15. నండూరి ప్రసాదరావు, 16. కె.దామోదరన్, 17. సోహన్ సింగ్ జోష్, 18. ఎం.ఆర్.వెంకటరామన్, 19. హరికిషన్ సింగ్ సూర్జిత్, 20. గురుచరణ్ పట్నాయక్, 21. ఎస్.జి.సర్దేశాయ్, 22. రావి నారాయణ రెడ్డి, 23. రమేష్ చంద్ర, 24. ఫణి బోర, 25. హరే కృష్ణ కోనార్, 26. ఎస్.వి.ఘాటే (చైర్మన్ సిసిసి)(శాశ్వత ఆహ్వానితుడు)

## శానిటేషన్ సిబ్బందికి రిక్షాల పంపిణీ



**ప్రజాపక్షం/హయత్ నగర్:** మన్సూరాబాద్ డివిజన్‌లో పరిశుభ్రతకు ప్రాధాన్యత నిస్తూ జిహెచ్‌ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి కాస్మోపాలిటన్ కాలనీలో శానిటేషన్ సిబ్బందికి చెత్త సేకరణ రిక్షాలను పంపిణీ చేశారు.ఈసందర్భంగాకార్పొరేటర్ గారుమాట్లాడుతూస్వచ్ఛభారత్ స్వచ్ఛ హైదరాబాద్ లక్ష్యాన్ని నెరవేర్చేక్రమంలోశానిటేషన్సిబ్బందికిఅవసరమైనపరికరాలు,వలు అందించడంఅత్యంతకీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శానిటేషన్ డి.ఈ నీలిమ, జవాన్ శ్రీనివాసరావు,శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## శంకర్‌పల్లిలో ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** మండలంలోని గోపులారం గ్రామ సర్పంచ్ పొడవు శ్రీనివాస్ జన్మ దిన వేడుకలు సోమవారం సాయంత్రం అట్టహాసంగా జరిగాయి.చేవెళ్ల నియోజకవర్గం శాసనసభ్యులు కాలే యాదయ్య పొడవు శ్రీనివాస్‌కు శాలువాతో సత్కరించారు.అంతకుముందు పొడవు శ్రీనివాస్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు ఉచితంగా మందులను అందించారు.అలాగే సుమారు 500 మంది గ్రామంలో ఉన్న మహిళలకు చీరలను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు మోత్కుపల్లి మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇవిఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి


రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఇవిఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రారెడ్డి తెలిపారు.మంగళవారం రంగారెడ్డి జిల్లాలోని రాజేందర్ నగర్ ఇవిఎం గోడౌన్స్‌ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి ఇవిఎం గోడౌన్ త్రైమాసిక తనిఖీలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా గోడౌన్‌లో భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్‌లు, ఎన్నికల సామాగ్రి గదులను చంద్రారెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వివరాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇవిఎంలు,బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ గోదాం సీల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచి యంత్రాలను పరిశీలించడం జరిగింది. అనంతరం వారి సమక్షంలో సీల్ వేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజేందర్ నగర్ తహశీల్దార్,వేర్ హౌస్ ఇంచార్జ్ బొమ్మ రాములు,సంబంధిత అధికారులు,రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ అభివృద్ధికి సహకరించండి

టోల్‌ప్లాజా మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చిన తండా వాసులు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించేందుకు కృషి చేయాలని జిఎంఆర్ టోల్‌ప్లాజా మేనేజర్‌ను తండా వాసులు కోరారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణ శివారులోని జిఎంఆర్ టోల్‌ప్లాజా మేనేజర్ ఇబ్రహీంకు వినతిపత్రం ఇచ్చి సమస్యలను వివరించారు. గ్రామ పంచాయతీలో అత్యవసరమైన కంప్యూటర్, ప్రింటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామ పంచాయతీ సిబ్బందితోపాటు తండా ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని, హైమాస్ట్‌లైట్లు ఏర్పాటు చేయాలని, గ్రామ సంచాయతీ ప్రజల భద్రత దృష్ట్యా సిసి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కోరారు ఇందుకు మేనేజర్ ఇబ్రహీం స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో కడియాలకుంట తండా మాజీ సర్పంచ్ బుజ్జి రాజునాయక్, తావ్సింగ్, శంకర్, రెడ్యా, సేవ్య, రవి, రమేష్, రవిలు పాల్గొన్నారు.

## చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్ :** ప్రజల ఆర్యోగం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తూందని ఇంబ్రహింపట్నం నియోజవర్గం శాసన సభ్యులు మాల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. అబ్దులాపూర్‌మెట్ మండలం పెద్ద అంబర్‌పేట్ పురపాలక సంఘంకు చెందిన 27 మంది లబ్ధిదారులకు మంజూరై నా రూ.9,27000ల చెక్కులను క్యాపు కారాయలయ్యంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో పేద ప్రజలకు అందుబాటులో వైద్యం అందే విధంగా ముందుకు వెలుతుందన్నారు.ఈ కార్యక్రమంలో బి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, సిహెచ్.బాస్కర చారి,కాంగ్రెస్ నాయకులు కొత్త ప్రభాకర్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, అంతటి దన్‌రాజ్ తదితరులున్నారు.

## శంకర్‌పల్లి లిటిల్ స్టార్ హై స్కూల్‌లో కాళోజీ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి** పట్టణంలోని లిటిల్ స్టార్ హైస్కూల్‌లో మంగళవారం కాళోజి నారాయణరావు జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సంజీత్ కుమార్ మాట్లాడుతూప్రజాకవి,తెలంగాణ బిడ్డ, తెలుగు భాషాభిమాని అయిన కాళోజీని స్మరించుకోవడం సంతోషకరమన్నారు.తెలంగాణ ప్రభుత్వం కాళోజీ నారాయణరావు జయంతిని తెలుగు భాష దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. ప్రజా కవిగా, ఉద్యమకారుడిగా భారత దేశ స్వాతంత్ర పోరాటంలో, తెలంగాణ ఉద్యోగంలో పాల్గొన్న తెలంగాణ వైతాళికుడు కాళోజి నారాయణరావుని పొగిడారు.నిరంకుశత్వానికి,అరాచక పాలనకు వ్యతిరేకంగా గళం ఎత్తి తెలంగాణ ప్రజల్లో చైతన్యం రగించిన మహా మనిషి కాళోజీ అని అన్నారు. కాళోజి గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ స్వర్ణలత,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

### రేవతి హై స్కూల్‌లో....

శంకర్‌పల్లి మునిసిపల్ పరిధిలోని రేవతి హై స్కూల్‌లో తెలంగాణ భాషా దినోత్సవం వేడుకలు మంగళవారం కరస్పాండెంట్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాళోజి నారాయణరావు జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకుంటామని కరస్పాండెంట్ తెలియజేశారు. పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. విద్యార్థులు మాతృ భాష గొప్పతనాన్ని తెలుపుతో చక్కని పాటలతో కార్యక్రమాన్ని ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# జిహెచ్‌ఎంసి, టిజిఎస్‌పిడిసిఎల్ డేటా అనుసంధానం

- నివాస గృహాల ముసుగులో కొనసాగుతున్న ఆస్తులపై బల్దియా కొరడా
- నివాస గృహాల పన్ను చెల్లిస్తున్న భవనాలకు త్వరలో నోటీసులు
- జిహెచ్‌ఎంసికి భారీగా పెరగనున్న ఆస్తిపన్ను ఆదాయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) ఆస్తి పన్ను ఆదాయాన్ని పెంచే దిశగా కీలక చర్యలు చేపట్టింది. వాణిజ్య విద్యుత్ కనెక్షన్లు తీసుకుని, నివాస గృహాల పరిధిలో ఆస్తిపన్ను చెల్లిస్తున్న పలు ఆస్తులను గుర్తించేందుకు జిహెచ్‌ఎంసి, టిజిఎస్‌సిపిడిసిఎల్ విద్యుత్ కనెక్షన్‌ల డేటాను అనుసంధానం చేస్తున్నాయి. ఈ ప్రక్రియలో గణనీయమైన పురోగతి సాధించినట్లు అధికారులు వెల్లడించారు. జిహెచ్‌ఎంసి పరిధిలో సుమారు 19.50 లక్షల ఆస్తిపన్ను పిటిఐఎన్ నెంబర్లు ఉండగా, వాటిలో కేవలం రెండు లక్షల ఆస్తులు మాత్రమే వాణిజ్య ఆస్తిపన్నును చెల్లిస్తున్నాయి. మిగిలినవి నివాస గృహాల ఆస్తిపన్ను చెల్లిస్తున్నట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఈ అక్రమాలను గుర్తించేందుకు జిహెచ్‌ఎంసి గత ఏడాది జియోగ్రాఫికల్ ఇన్ఫర్‌మేషన్ సర్వే (జిఐఎస్) నిర్వహించింది. ఈ సర్వేలో 96,938 ఆస్తులు నాన్‌రెసిడెన్షియల్ ప్రాపర్టీలుగా తేలాయి. ఈ విషయాన్ని మరింత పక్కాగా నిర్ధారించుకునేందుకు, ఈ ఆస్తుల డేటాను టిజిఎస్‌సిపిడిసిఎల్ విద్యుత్ కనెక్షన్ల డేటాతో అనుసంధానం చేస్తున్నారు. దీని ద్వారా ఆయా ఆస్తులలో వినియోగించే విద్యుత్ మీటర్లు కమర్షియలా, డొమెస్టికా అనే విషయం స్పష్టమవుతుంది. కమర్షియల్ మీటర్లు వాడుతున్నప్పటికీ రెసిడెన్షియల్ ట్యాక్స్ చెల్లిస్తున్న ఆస్తులకు పన్నును కమర్షియల్ ప్రాపర్టీ ట్యాక్స్‌గా సవరిస్తారు. ఇలాంటి ఆస్తుల యజమానులకు మూడేళ్ల కమర్షియల్ ట్యాక్స్ వర్తింపజేస్తూ నోటీసులు జారీ చేయాలని జిహెచ్‌ఎంసి యోచిస్తోంది. ఈ డేటా అనుసంధానం బాధ్యతను మెస్సర్స్ సోల్‌పేజ్ అనే సంస్థకు అప్పగించారు. ఈ ప్రక్రియతో జిహెచ్‌ఎంసికి ప్రాపర్టీ ట్యాక్స్ ద్వారా భారీగా ఆదాయం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు అదనపు కమిషనర్ (ఐటి, రెవెన్యూ) అనురాగ్ జయంతి టిజిఎస్‌పిడిసిఎల్, జిహెచ్‌ఎంసి రెవెన్యూ వింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జోన్‌ల వారీగా అనుసంధానం అయిన రికార్డుల వివరాలను ఆయన వెల్లడించారు.

**జోన్‌ల వారీగా వివరాలు..**

- ☞ ఎల్.బి. నగర్ : 9,761
- ☞ చార్మినార్ : 26,056
- ☞ ఖైరతాబాద్ : 22,514
- ☞ సికింద్రాబాద్ : 22,005
- ☞ కూకట్‌పల్లి : 7,260
- ☞ శేరిలింగంపల్లి : 9,342.

## కానిస్టేబుల్‌కు హెచ్‌ఆర్‌సి చైర్మన్ ప్రశంస



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మానవత్వంతో వ్యవహరించి బాధితులను సహాయ సహకారాలు అందించిన సిఎఆర్ హెడ్ కానిస్టేబుల్ శ్రీధర్ వర్మకు మంగళవారం అరుదైన గౌరవం దక్కింది. ఆయన చేసిన సేవకు గుర్తింపుగా రాష్ట్ర మానవ హక్కుల కమిషనర్ ఛైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అఖ్తర్ తన కార్యాలయానికి శ్రీధర్ వర్మను పిలిపించుకుని సత్కరించారు. గత వారం నగరంలో కురిసిన భారీ వర్షాల సమయంలో వరదలో చిక్కుకున్న యువతిని రక్షించి ఆమెను శ్రీధర్‌వర్మ సురక్షితంగా ఇంటికి చేర్చారు. ఈ మేరకు అతని గుర్తించిన ఛైర్మన్ శ్రీధర్ వర్మ ప్రశంసిస్తూ అభినందన పత్రం అందజేశారు. ఈ నెల 4వ తేదీన సాయంత్రం హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షాల కారణంగా బంజారా హిల్స్ రహదారులు నడుము లోతు వరద నీటితో మునిగిపోయాయి. ఈ పరిస్థితుల్లో ఛైర్మన్ తన భద్రతా బృందంలో పైలట్‌కమ్‌ఎస్కార్ట్ సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీధర్ వర్మ రోడ్ నెం. 3 వద్ద బస్టాప్‌లో ఒంటరిగా నిలబడి భయాందోళనలకు లోనైన 22 ఏళ్ల యువతి నైనికను గమనించారు. ఆస్ట్రేలియాలో ఎంబిఎ చదువుకుంటూ రామంతపూర్‌లో కుటుంబ సభ్యులను కలుసుకోవడానికి వచ్చిన నైనిక, తన అన్న వదిలి వెళ్ళిన తర్వాత పెరుగుతున్న వరదలో ఇరుక్కుపోయింది. నీటి భయం (హైడ్రోఫోబియా)తో విలవిలలాడుతూ, మొబైల్ ఫోన్ పనిచేయక పోవడంతో తల్లిదండ్రులను సంప్రదించలేని పరిస్థితి. ఈ సమయంలో, హెడ్ కానిస్టేబుల్ శ్రీధర్ వర్మ నడుము లోతు నీటిలోకి వెళ్లి, ఆమెకు తన జెర్కిన్ ఇవ్వడంతో పాటు ధైర్యం చెప్పి, ఆమె కుటుంబ సభ్యులను సమాచారం అందించారు. ప్రయాణ సౌకర్యాలు లభించకపోవడంతో, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, ఆయన స్వయంగా నైనికను వానలతో ముంచెత్తిన రహదారులను దాటుతూ వనస్థలీపురంలోని ఆమె ఇంటికి తీసుకెళ్లి, రాత్రి ఆలస్యంగా తల్లి, చెల్లెలు వద్దకు క్షేమంగా చేర్చారు. ఈ సంఘటన పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం లభించింది.

## ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆదర్శ మున్సిపాలిటిగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 22,23,24,25వార్డులో పర్యటించి సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. 22వ వార్డు ఇన్‌చార్జి తొలిమామిడి అర్జున్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ మున్సిపాలిటిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సైతం చేశామని వివరించారు. మున్సిపాలిటిలో ఎక్కడ చూసినా సమస్యలను కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నాయని, వాటిని ఒకేసారి కాకుండా ప్రణాళిక బద్ధంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మున్సిపాలిటిలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్య వైఖరీ కారణంగానే మున్సిపాలిటిలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని వివరించారు. పేరుకే అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పారే తప్పా ఆచరణలో ఎక్కడ చేయలేదని, ప్రజా పాలన ప్రభుత్వంలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని, ఇందుకు ప్రజలందరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ సునీత రెడ్డి, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్ ఖాన్, మాజీ చైర్మెన్ విశ్వం, మాజీ కౌన్సిలర్ సర్వర్ పాషా, రాజేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, నేతలు బస్వం, చెంది తిరుపతిరెడ్డి, యాదగిరి యాదవ్, దంగు శ్రీనివాస్ యాదవ్, మసూద్‌ఖాన్, ముబారక్ అలీఖాన్, రాములు, శ్రీధర్, మాధవులు, లింగారెడ్డిగూడ అశోక్‌లో పాల్గొన్నారు.

## కర్మన్‌ఘూట్ ధ్యానాంజనేయ దేవాలయంలో దారుణం

భక్తుడికి ఇచ్చిన ప్రసాదం కుళ్ళిపోయి ఉన్న వైనం



**ప్రజాపక్షం/ సరూర్‌నగర్ :** పురాతన చరిత్ర కలిగిన కర్మాన్‌ఘాట్ ధ్యానాంజనేయ దేవాలయంలో ప్రసాదాన్ని మహా ప్రసాదగా స్వీకరించే భక్తులకు చేదు ఎదురైంది. మంగళవారం ఓ భక్తుడు స్వామి వారిని దర్శించుకుని ప్ర సాదం తీసుకోని ఇంటికి వెళ్లి చూడగా పూర్తిగా పులిహోరా పాడైపోయి ఉం ది. ఈ విషయాన్ని గ్రహించిన భక్తుడు సంబంధిత ఆలయ ధర్మకర్తల దృష్టితీసుకెళ్ళారు. ఈ విషయంపై సంబందిత కిచెన్ ఇంచార్జి రమాదేవిని పిలిపించి ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు ఇస్తూ.... ధర్మకర్తలతో వాగ్వివాదం దిగారు. సంబంధిత దేవాలయ ఉన్నతాధికారులు స్పందించి కుళ్ళిపోయి ఉన్న ప్రసాదాన్ని పంపిణీ చేసిన కిచెన్ ఇంచార్జి రమాదేవిని వెంటనే సస్పెండ్ చేసి విచారణ జరిపించాలని పలువురు భక్తులు డిమాండ్ చేశారు. ఆయన ఇఒ లావణ్య సరిగ్గా విధులకు రాకపోవడంతోనే ఆలయంలో అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు పేర్కొన్నారు. ఆలయానికి పూర్తిస్థాయి లో పనిచేసే ఇఒను నియమించాలని పలువురు భక్తులు కోరుకుంటున్నారు. ఆలయంలో జరిగే అవినీతి అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని పలువురు భక్తులు సైతం డిమాండ్ చేస్తున్నారు.

## ఆరోగ్య క్యాంపులు విజయవంతం చేయాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న మెగాహెల్త్, ఆరోగ్య క్యాంపులు విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం డిఎంఅండ్‌హెచ్‌ఒ ఆధ్వర్యంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారుల,జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ రెండో తేదీ వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వస్తు నారీ స్వశక్తు పరివార్ అభియాన్(అతివా ఆరోగ్యమస్తు) కార్యక్రమంలో మన జిల్లాలో కూడా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 17,అక్టోబర్ 02 న మెగా హెల్త్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అంతేకాకుండా సెప్టెంబర్ 18 నుండి అక్టోబర్ ఒకటో తేదీ వరకు ప్రతిరోజు 10 ఆరోగ్య క్యాంపులు స్పెషలిస్టు వైద్యులచే నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు.04 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 04 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, 01 సామాజిక ఆరోగ్య కేంద్రం తోపాటు మరొక ప్రైవేటు ఆసుపత్రిలలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.హెల్త్ క్యాంపులలో మహిళల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి అన్ని రకాల వైద్య సేవలు అందించడం జరుగుతుందని,ముఖ్యంగా మహిళ ఆరోగ్య సంరక్షణకు స్క్రీనింగ్ ప్రక్రియ, మాతృ,శిశు సంరక్షణ స్క్రీనింగ్, మహిళల తోపాటు యుక్త వయసు బాలికలకు రుతుసంబంధ సమస్యలు పోషకార అవగాహన, అదే విధంగా టీబి స్క్రీనింగ్ చికిత్స ద్వారా టిబి ముక్తు అభియాన్ కార్యక్రమం, ఇతర మహిళలకు సంబంధించిన అన్ని రకాల ఆరోగ్య సమస్యల పరిష్కారం కొరకు హెల్త్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని డిఎంఅండ్ హెచ్ ఒ చెప్పారు. ఈ క్యాంపులలో స్పెషలిస్ట్ వైద్యులచే స్క్రీనింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ క్యాంపులలో రక్తదాన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.ఈ హెల్త్ క్యాంపులను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ,నగరాలు,గ్రామాలలోని యువజన సంఘాలు స్వయం సహాయక మహిళా సంఘాలు,స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖుల సమన్వయంతో నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మెగా హెల్త్ క్యాంపులు జిల్లా కలెక్టర్ గారి ఆదేశానుసారం ఇతరు శాఖలు, వివిధ సంఘాల సమన్వయంతో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ విజయ పూర్ణిమ,డాక్టర్ గీత, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ రాధిక,డాక్టర్ పూనమ్,డాక్టర్ రాకేష్,డెమో అధికారి కె శ్రీనివాసులు పాల్గొన్నారు.

## డాక్టర్ రెడ్డి ల్యాబ్స్‌పై కేసు నమోదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ మానవ హక్కుల కమిషనర్ మంగళవారం డాక్టర్ రెడ్డి లాబ్స్ పై కేసు నమోదు చేసింది. మానవ వైద్య పరిశోధన క్లినికల్ ట్రైల్స్ ముసుగులో నిర్భాగ్యులైన అమాయకులపై ప్రాణాంతకమైన వైద్య పరిశోధనలు పలు రాష్ట్రాలకు చెందిన నిరక్షరాస్యుల కుటుంబాలకు డబ్బు ఆశ చూపి పరిశోధనలకు ఒప్పిస్తున్నారని కమిషన్‌కు ఫిర్యాదు అందింది. ఇలాంటి వారిని సికిందరాబాద్ స్టేషన్ పరిధిలో ఉన్న లాడ్జిలలో బస చేయిస్తున్నారని, వీరిపై క్యాన్సర్‌కు సంబంధించిన మందులను కూడా ప్రయోగించారని న్యాయవాది రామారావు ఇమ్మానేని కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలోనే బాలానగర్ కేంద్రంగా జీవన్ సైంటిఫిక్ టెక్నాలజీ అనే సంస్థ మెడికల్ మాఫియా 15 వేల ఆశకు ప్రాణాలమీదకు తెచ్చుకొన్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన దీపాంకర్ డే అనే దినసరి కూలిని టార్గెట్ చేసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు జాతీయ మానవ హక్కుల కమిషన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుందని రామారావు ఒక ప్రకటనలో వెల్లడించారు.

## జియాగూడ స్లాటర్ హౌస్ ఆధునికీకరణ పనులు వేగవంతం చేయాలి

జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జియాగూడలోని స్లాటర్ హౌజ్ ఆధునికీకరణ పనులను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఇంజనీరింగ్ (ప్రాజెక్ట్స్) అధికారులను ఆదేశించారు. కార్వాన్ సర్కిల్‌లోని జియాగూడ కబేళాను మంగళవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ వకీల్ ఉన్నారు. స్లాటర్ హౌజ్ ఆధునికీకరణకు ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిందని, త్వరగా టెండర్లు పిలిచి పనులు మొదలుపెట్టాలని కమిషనర్ సూచించారు. ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త, నిర్మాణ వ్యర్థాలను వెంటనే తొలగించి, శుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టాలని కర్ణన్ ఆదేశించారు.

## ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లతో మహిళా సాధికారతకు ఊతం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'ఇందిరా మహిళా శక్తి' క్యాంటీన్లను స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జి) విజయవంతంగా నిర్వహిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం గత ఏడాది ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం జిహెచ్‌ఎంసి సహకారంతో నగరంలో 33 క్యాంటీన్లు మహిళలచే నిర్వహించబడుతున్నాయి. ఈ క్యాంటీన్ల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదుగుతూ, ప్రజలకు నామమాత్రపు ధరలకే పోషకాహారాన్ని అందిస్తున్నారు. ఈ క్యాంటీన్లు కేవలం ఉపాధిని మాత్రమే కాకుండా, మహిళలకు ఆత్మవిశ్వాసం, స్వావలంబన, గౌరవం కల్పిస్తున్నాయని అధికారులు తెలిపారు. ఎన్.బి.టి. నగర్‌కు చెందిన 'స్నేహిత స్వయం సహాయక సంఘం'కు చెందిన వసంత, మరో నలుగురు మహిళలతో కలిసి బ్యాంక్ నుండి రూ. 5 లక్షల రుణం తీసుకుని ఈ సంవత్సరం మార్చిలో జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో 'ఇందిరా మహిళా శక్తి' క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ క్యాంటీన్‌ను మేయర్ గద్వాల విజయలక్ష్మి , డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు కృషి చేయడంలో జిహెచ్‌ఎంసి భాగం కావడం సంతోషంగా ఉందని, భవిష్యత్తులో కూడా మహిళల ముఖాలపై చిరునవ్వులు చూడటానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. క్యాంటీన్ నిర్వాహకురాలు వసంత మాట్లాడుతూ ఈ అవకాశంతో తమకు ఆర్థిక భద్రత లభించిందని, తమ కాళ్లపై తాము నిలబడగలిగామని ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిహెచ్‌ఎంసికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## ఎలివేటర్లపై జిఎస్‌టి తగ్గించాలి

రాష్ట్ర ప్రభుత్వానికి టిఇఎ విజ్ఞప్తి



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** ప్రస్తుతం ఎలివేటర్లపై ఉన్న 18శాతం జిఎస్‌టి విషయంలో పునరాలోచించాలని తెలంగాణ ఎలివేటర్ అసోసియేషన్ (టిఇఎ) కేంద్రప్రభుత్వాన్ని కోరింది. జిఎస్‌టిని తగ్గిస్తే దేశంలో అందుబాటులో గృహ నిర్మాణంపై సానుకూల ప్రభావం పడుతుందని తెలిపింది. దేశంలో వృ ద్ధుల సంఖ్య పెరుగుతుండటంతో ఎలివేటర్లు ఇప్పుడు అత్యవసరమయ్యాయ ని, దీంతో అందరికీ భద్రత ఉంటుందని పేర్కొన్నది. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా అవినా శ్ , ప్రధానకార్యదర్శి బి.కె.గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని చిన్న, మధ్యతరహా ఎలివేటర్ ఉత్పత్తిదారులు, ఇన్‌స్టాలర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఎ న్నిసార్లు ఈ విషయమై మొరపెట్టుకొన్నా ఫలితం లేకుండాపోయిందన్నారు. ఎపిలో ఈ ఏడాది ఏప్రిల్ 12న లిఫ్ట్ చట్టం తీసుకొచ్చారని, తెలంగాణలో కూ డా ఇదే తరహా విధానం తేవాలని కోరారు. ఎలివేటర్లపై 18శాతం జిఎస్‌టితో ప్రతి నెలా రూ.72కోట్లు ప్రభుత్వానికి చెల్లిస్తున్నారన్నారు. ఈ భారీ పన్ను కా రణంగా గృహనిర్మాణ ప్రాజెక్టుల్లో లిఫ్టులు పెట్టించుకోవడానికి ప్రజలు వెనకాడుతున్నారని తెలిపారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## 'సచివాలయ పోస్టులు అర్హులకే ఇవ్వాలి'

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** సచివాలయంలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కేవలం అర్హులైన అభ్యర్థులకే ఇవ్వాలని ఆలిండియా ఒబిసి స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శివ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 2022లో అప్పటి ప్రభుత్వ సిఎస్‌గా సోమేశ్‌కుమార్ ఉన్న సమయంలో విడుదల చేసిన నోటిఫికేషన్ కింద 42 బ్యాక్‌లాగ్ జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయని తెలిపారు. అయితే, ఈ పోస్టులను అర్హత లేని కొంతమందికే అక్రమమార్గంలో ఇచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత పాటించాలని, లేనిపక్షంలో పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## నాగారం ప్రతి రేషన్ షాపులో మోదీ ఫోటో



**ప్రజాపక్షం/నాగారం:** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి రేషన్ షాపులో భారత ప్రధాని నరేంద్రమోదీ ఫోటోను పెట్టారు.ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ గరీబ్ కళ్యాణ్ యోజన పథకం ద్వారా పేద,మధ్య తరగతి కుటుంబాలు 80 కోట్ల మందికి 2019 సంవత్సరం నుండి పది సంవత్సరాల వరకు ప్రతి మనిషికి 5 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం అందిస్తుంది మోదీ కేంద్ర ప్రభుత్వమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్,రవీందర్‌రెడ్డి,నక్క కిషోర్‌గౌడ్,రాకేష్‌గౌడ్,జూపల్లి నరేష్,జ్యోతి, చంద్రకళ తదతరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనులు ప్రారంభించాలి



**ప్రజాపక్షం/కాప్రా:** మల్లాపూర్ డివిజన్‌లోని ఓల్డ్ మల్లాపూర్, న్యూ భవాని నగర్, అశోక్‌నగర్, బ్రహ్మపురి కాలనీ, బాబానగర్ ప్రాంతాల్లో మంజూరైన డ్రైనేజి పనులను వెంటనే ప్రారంభించాలని స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన వార్డు కార్యాలయంలో జలమండలి మేనేజర్ సిరాజుద్దీన్‌తో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ ఇటీవలి వర్షాల కారణంగా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న డ్రైనేజీ పనులు సైతం చేపట్టాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి అనుమతుల కోసం పంపించాలని కోరారు.

## షాపూర్ నగర్ పారిశ్రామిక వార్డుల్లో తనిఖీలు నిర్వహించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** చర్లపల్లిలో కోట్ల విలైన గంజాయి మత్తు పదార్థాలను తయారు చేసినటువంటి వాగ్దేవి పరిశ్రమలో గుట్టుచప్పుడు కాకుండా మత్తు పదార్థాలను తయారు చేయడం వెనకాల అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుందని, వెంటనే మేడ్చల్ జిల్లాలో ఉన్నటువంటి పరిశ్రమలలో పరిశ్రమల అధికారులు ప్రతి 2నెలలకోసారి తనిఖీలు నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో ఏదైనా సంఘటన జరిగితే తప్పా తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటున్నారే కానీ ఆయా పరిశ్రమల్లో ఏం ఉత్పత్తి చేస్తున్నారు, ఎంతమంది కార్మికులు ఉన్నారు, వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారన్న వాటిపై దృష్టి పెట్టడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనిఖీలు నిర్వహించకపోతే కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రతి పరిశ్రమ తిరిగి అక్కడ జరుగుతున్నటువంటి ఉత్పత్తులను స్వయంగా తెలుసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్‌రావు, సిపిఐ నాయకులు సుంకిరెడ్డి, శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, అయ్యారం, హేమారెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## న్యాయవాదిపై దాడికి నిరసనగా విధుల బహిష్కరణ

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మేడ్చల్ కోర్టులో న్యాయవాదిపై జరిగిన దాడికి నిరసనగా మంగళవారం న్యాయవాదులు విధులను బహిష్కరించి నిందితులపై కేసు నమోదుచేసి చర్యలు తీసుకోవాలన్న డిమాండ్‌తో జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. సూరారంలో బైక్ పార్కింగ్ విషయంలో తలెత్తిన వివాదంతో న్యాయవాది సురేష్‌బాబుపై సిద్దిక్ అనే వ్యక్తి అకారణంగా దాడిచేసి గాయపరిచాడని, దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవటంతో పాటు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు హన్మంతరెడ్డి, శివకుమార్, వినోద్, నరేంద్రరెడ్డి, ప్రవీణ్, తదితరులు పాల్గొ న్నారు.

## యూరియ కోసం రోడ్డెక్కిన రైతులు

**ప్రజాపక్షం/తాండూరు:** రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. సరిపడా యూరియా అందుబాటులో లేక పోవడంతో రైతులు ఒక్కసారిగా యూరియా కోసం పిఎసిఎస్ కేంద్రాలు, షాపుల వద్దకు భారిగా బారులు తీరుతున్నారు. ప్రభుత్వం ఓ పక్క యూరియా కొరత లేదని చెబుతున్న వికారాబాద్ జిల్లా తాండూరులో మాత్రం యూరియ కష్టాలు తప్పడం లేదు. ఒక్క బస్తా యూరియ కోసం గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చోవల్సిన పరిస్థితి దాపురించిందని రైతులు మండిపడుతున్నారు. మంగళవారం తాండూరు పట్టణంలోని మనగ్రోమోర్ సెంటర్‌కు పెద్దఎత్తున్న యూరియాకోసం రైతులు తరలివచ్చారు. తెల్లవారు జాము ఐదు గంటల నుండి క్యూలైన్‌లో నిల్చోని పడిగాపులు కాస్తున్నారు. అయితే రైతుల లైన్ చూసిన గమ గ్రామోర్ సెంటర్ యాజమానికి చేసేది లేక కేంద్రాన్ని ముసుకుని వెళ్ళిపొయ్యారు. దీంతో ఆగ్రహించిన రైతులు మన గ్రోమోర్ ముట్టడించారు. వారిక మద్దతుగా బిఆర్‌ఎస్ నాయకులు అక్కడి చేరుకుని ధర్నా చేపట్టారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడ విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వర్షాలు కాస్త తగ్గు ముఖం పట్టడంతో సాగు చేసిన కంది, పత్తి, మొక్క జొన్న, వరి పంటలకు యూరియ వేయడానికి రైతులు సిద్దమవుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్టుగా యూరియా గత కొంత కాలంగ లభించక పోవడంతో మంగళవారం యాలాల మండల పరిధి లక్షణపూర్ చౌరస్తాలో రైతులు రోడ్డు బైటాయించి ధర్నాకు దిగారు. దీంతో తాండూరు కోడంగల్ మార్గం గంటపాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిల్చిపోయాయి.



## రైల్వే వంతెన నిర్మాణ పనులకు ముందుడుగు : తోటకూర వజ్రేష్ యాదవ్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** రైల్వే వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు అదేవిదంగా కోర్టులో ఉన్న 11మందికి బాధితులకు టిడిఆర్‌లను ఇప్పించేందుకు కృషి చేస్తామని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్,మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్,కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు మామిళ్ళ ముత్యాలు యాదవ్,మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్‌లు పాల్గొన్నారు. మున్సిపల్ అధ్యక్షులు మామిళ్ళ ముత్యాలు యాదవ్ ఆధ్వర్యంలో ఇండ్లను కూల్చివేతలను చేపట్టారు.అలాగే రైల్వే వంతెన నిర్మాణంలో స్వచ్చందంగా ముందుకు వచ్చి తమ ఇండ్లను కూల్చి రైల్వే వంతెన నిర్మాణానికి కృషి చేసిన లబ్ధిదారులు కొమ్మిడి సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాంరెడ్డి,సత్యనారాయణ,నర్సింహా రెడ్డిలు ముందుకు వచ్చినందుకు తోటకూర వజ్రేష్ యాదవ్ వారిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ చిలుగురి మచ్చేందర్ రెడ్డి,మాజీ బ్యాంక్ డైరెక్టర్ బొక్క ప్రభాకర్ రెడ్డి,జేఏసీ నాయకులు మారం లక్ష్మారెడ్డి,డీసీసీ కార్యదర్శి ఉల్లి ఆంజనేయులు,మాజీ కౌన్సిలర్ మల్లేష్,మైనార్టీ అధ్యక్షులు ఫరూక్,ఎస్టి సెల్ నాయకులు సురేష్ నాయక్,సంజీవ రెడ్డి,ఖ్యాయూం,చిత్తరి యాదవ్,శ్రీనివాస్,రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

# గంటన్నరలోనే దొరికిన దొంగ

* వాట్సాప్ గ్రూప్‌లో అలర్ట్..
* ఇంటి ముందు పార్క్ చేసిన ఆటో చోరీ

### వాట్సాపా..మజాకా!



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వాట్సాప్‌ను సాధారణంగా మెసేజ్‌లు పంపడానికి, సమాచారాన్ని స్నేహితులతో పంచుకోవడానికి వినియోగిస్తాం. అయితే అదే వాట్సాప్‌తో ఏకంగా ఓ చోరీ కేసును గంటల వ్యవధిలోనే కొందరు గ్రూపు సభ్యులు ఛేదించి నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. రోజూ మాదిరిగానే ఇంటి ముందు ఆటోను పార్క్‌చేసి పొద్దున్న లేచి చూడగా కనిపించలేదు. దీంతో ఆ ఆటో యజమాని ఈ విషయాన్ని తన స్నేహితులకు వాట్సాప్ గ్రూప్ ద్వారా తెలియజేశాడు. వారు ఇదే విషయాన్ని మరికొన్ని గ్రూపులకు షేర్ చేశారు. దీంతో గంటన్నర కాల వ్యవధిలోనే నిందితుడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన హైదరాబాద్‌లోని బొల్లారంలో చోటుచేసుకుంది.

**ఇంటిముందు పార్క్ చేసిన ఆటో ..**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఝార్ఖండ్‌కు చెందిన బిపిన్‌రాజ్ యాదవ్ హైదరాబాద్‌లోని బొల్లారం ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. అతను ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే ఆదివారం రాత్రి తన ఇంటి ముందు ఆటో పార్క్ చేశాడు. అయితే తరువాత రోజు ఉదయం బయటికి వచ్చి చూడగా ఆటో కనిపించలేదు. సమీపంలోని సిసి కెమెరా ఫుటేజీలను బిపిన్ పరిశీలించాడు. దానిలో రాత్రి 2 గంటల సమయంలో ఓ వ్యక్తి తన ఆటోను తీసుకెళ్తున్నట్లు గుర్తించాడు.

**సిసి కెమెరా ఫుటేజీ ఆధారంగా ..**

వెంటనే తన ఆటో ఫొటోలను, సిసి కెమెరా ఫుటేజీని 'ఝార్ఖండ్ ఏక్తా సమాజ్' వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. ఆ గ్రూపులోని సభ్యులు ఈ సమాచారాన్ని ఇతర గ్రూపులకూ షేర్ చేశారు. దీంతో ఉదయం 11.30 సమయంలో బంజారాహిల్స్ రోడ్డు నెంబర్10 స్టార్ ఆసుపత్రి సమీపంలో ఝార్ఖండ్ వాసి కల్లుకుమార్ తన ఆటోను పార్క్ చేస్తుండగా పక్కనే చోరీకి గురైన ఆటో కనిపించింది. అయితే ఆ ఆటోను ఎవ్వరూ గుర్తు పట్టకూడదని ఓ వ్యక్తి స్టిక్కర్లు తొలగిస్తూ కనిపించాడు. ఈ ఘటనను తన ఫోన్‌లో వీడియో తీసి వాట్సాప్ గ్రూప్ లో షేర్ చేశాడు. దీంతో ఆ గ్రూపులోని సభ్యులు అక్కడికి చేరుకున్నారు. నిందితుడిని పట్టుకుని బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు. వారు నిందితుడిని అల్వాల్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు నిందితుడిని విచారించగా అతడు జీడిమెట్ల రోడ్డామినిస్ట్రీ కాలనీకి చెందిన రోహిత్ అని తెలిసింది. చోరీ చేసిన ఆటోను తన స్నేహితుడు రఘురామ్‌కు ఇవ్వగా, అతడు తన బంధువులను తీసుకెళ్లే క్రమంలో బంజారాహిల్స్‌లోనే పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు.

**దొంగలను కూడా సులభంగా పట్టుకోవచ్చు..**

సోషల్ మీడియాను సరదాలకే కాదు తలచుకుంటే దొంగలను కూడా సులభంగా పట్టుకోవచ్చని ఈ వాట్సాప్ గ్రూపు సభ్యులు నిరూపించారు. ఒక సాధారణ వాట్సాప్ గ్రూప్ మెసేజ్ అలర్ట్‌తో గంటల వ్యవధిలోనే ఆటోను, నిందితుడిని పట్టుకుని కేసు ఛేదించినందుకు బంజారాహిల్స్ పోలీసులు హర్షం వ్యక్తం చేశారు. ఇంత జాగరూకతతో వ్యవహరించిన ఈ వాట్సాప్ గ్రూపు సభ్యులను పోలీసులు ప్రత్యేకంగా అభినందించారు.

## చిన్నారులతో కలెక్టర్ మనుచౌదరి

### అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** చిన్నారులకు ప్రభుత్వం ద్వారా ఇచ్చే బాలామృతం, పౌష్టికాహార సామాగ్రిని ఎక్స్‌పైరీ డేట్ పరిశీలించి జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. మంగళవారం శామీర్‌పేట మండలం ఉప్పర్‌పల్లిలోని అంగన్‌వాడి కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ ఉన్న బాలామృతం ప్యాకెట్లను పరిశీలించి అవసరం ఉన్న దానికంటె కేంద్రంలో అదనంగా ఉండే ఇతర కేంద్రాలకు తరలించాలని సూచించారు. గర్భిణీలు, చిన్నారులకు క్రమం తప్పకుండా ఆరోగ్య విషయాలను పరిశీలిస్తూ తగిన సూచనలిస్తూ అవసరమైన పక్షంలో ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించాలన్నారు. అంగన్‌వాడి కేంద్రంలో చిన్నారుల ఆటపాటలకు అవసరమైన ఆటవస్తువులను ఆయన పరిశీలించారు. చిన్నారులతో కలెక్టర్ ముచ్చటించారు. కేంద్రానికి వచ్చే వారితో పాటు చిన్నారులకు ఎండ తగులకుండా షెడ్ ఏర్పాటు చేసుకోవాలని, అవసరమున్న ఇతర పనులకు గాను తనకు ప్రతిపాదనలు పంపాలన్నారు. శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి,తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి, జిల్లా సంక్షేమ శాఖాధికారి శారద, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ప్రజల హక్కుల కోసం పోరాడిన నాయకుడు కాళోజీ

### ఘనంగా కాళోజీ జయంతి ఉత్సవాలు



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ప్రజల హక్కుల కోసం పోరాడిన ఏకైక నాయకుడు కాళోజి నారాయణరావు అని జిల్లా ఆర్టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం తూంకుంట మున్సిపల్‌లో కాళోజి నారాయణరావు 111వ జయంతి సందర్భం గా ఆయన చిత్రపటానికి తూం కుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి, జిల్లా ఆర్టిఏ మెంబర్ జైపాల్‌రెడ్డిలు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బందికి ఇఎస్ఐ కార్డులు, ప్రశంసా పత్రాలు, సబ్బులు, నూనెలు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జ్యోతి, జిల్లా ఆర్‌టిఏ మెంబర్ జైపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ కాళోజి నారాయణరావు తెలంగాణ సంస్కృతి, భాష, ప్రజాస్వామ్యం, ప్రజల హక్కులకు నిరంతరం పోరాటం చేశారని గుర్తు చేశారు. కాళోజి రచనలు సామాన్యుల జీవితాలను ప్రతిబింబించేలా సామాజిక సమస్యలపై చైతన్యం కల్గిస్తాయని పేర్కొన్నారు. ఆయన అడుగు జాడల్లో నడుస్తు ఆయన ఆశయాలను సాధిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రావణ్ కుమార్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ కన్నేశ్వర్‌రావు, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన మెడికల్ క్యాంప్‌లో సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

**దమ్మాయిగూడలో:** ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతిని దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కమిషనర్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు భాషకు, యాసకు వన్నె తెచ్చారని కొనియాడారు. తన రచనతో సమాజాన్ని జాగృతం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డిఇ, మేనేజర్, స్నేహ మహిళా సంఘాలు, పారిశుధ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**వికారాబాద్‌లో:** ప్రజాకవి స్వర్గీయ కాళోజీ నారాయణరావు 111వ జయంతి సందర్భంగా వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నవాళులు అర్పించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ తెలంగాణ జీవిత చలనశీలి కాళోజీ పుట్టుక, చావులు కాకుండా బతుకంతా తెలంగాణ కోసం పనిచేసిన మహనీయుడు, వైతాళికుడు కాళోజీ, నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా తన కలం ఎత్తాడు, స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు అతను 1992లో భారతదేశ రెండ అత్యున్నత పౌర పురస్కారం పద్మవిభూషణ్ పొందాడు, అతని జన్మదినాన్ని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా చేసి గౌరవించిందని తెలంగాణ తొలిపొద్దు కాళోజీ అన్యాయాన్ని ఎదిరించిన గొప్ప ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైనింగ్ కలెక్టర్ హర్ష్‌చౌదరి, బిసి వెల్ఫేర్ అధికారి మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**మదన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవం : యాదయ్య**

వికారాబాద్ మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మదన్‌పల్లిలో కాళీజీ నారాయణరావు జయంతి పుష్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయు లు యాదయ్య మాట్లాడు తూ జీవితాంతం సామన్యునికి బాసటగా నిలబడ్డ మహనీయుడు ప్రజాకవి కాళోజీ అని తెలంగాణ మాండలికానికి కీర్తిని అందించిన ఆ మహనీయుడు జీవితం అందరికీ ఆదర్శం అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదయ్య తెలిపారు. మాతృ భాషలో విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థులలో ఆలోచనాశక్తి పెరుగుతుందని ,తెలంగాణ భాషా యాస ఎంతో మాధుర్యం కలిగినదని తెలుగు ఉపాధ్యాయురాలు స్వరూప పేర్కొన్నారు. విద్యార్థులు తెలుగు సాహిత్యంపై విజ్ఞాన ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన, క్విజ్, కవితల పోటీలు నిర్వహించి బహుమతుల్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాండు, తాజుద్దీన్, లక్ష్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.









## జీవితకాలమంతా గుర్తుండేవారు ఉపాధ్యాయులు

### ఎంఎల్‌సి ఎవిఎన్ రెడ్డి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకొంటున్న వారందరి వెనుక ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ప్రాముఖ్యత ఉందని, ప్రతి ఒక్కరూ జీవితకాలమంతా గుర్తుంచుకొనే వ్యక్తులు కేవలం ఉపాధ్యాయులే అని ఎంఎల్‌సి ఎవిఎన్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రగతి, సమాజ రూపకల్పన ఉపాధ్యాయులతోనే జరుగుతుందన్నారు. విద్యార్థుల్లో నిగూఢమై ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి ఉన్నత స్థాయికి తీసుకొని వెళ్లేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి విశిష్ట ప్రాధాన్యత ఇస్తోందని, జిల్లాలో సుమారు 500 పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్న సాంకేతికత ఆధార బోధనను అలవరచుకోవాలన్నారు. తమ విధులతో పాటు ఎన్నికల్లాంటి ఇతర ఏ పనులనైనా నిర్వహిస్తూ సమాజ సేవల్లో పాలుపంచుకోవటం గర్వనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి అవసరాలు ఉన్నా సమకూరుస్తామన్నారు. రాష్ట్రంలో మేడ్చల్ జిల్లా ఉన్నత స్థాయి ఫలితాలు సాధిస్తోందని, ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో వంద శాతం ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.జిల్లాలో విశిష్ట సేవలందించిన ఉపాధ్యాయులకు ఈ కార్యక్రమంలో మెమొంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## బొలెరో వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** బోలెరో వాహనం బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేటకు చెందిన పర్వతాపురం హరిబాబు (35) తన పనులు ముగించుకుని శామీర్‌పేటలోని తన ఇంటికి వెళ్తుండగా నల్సార్ చౌరస్తా సమీపంలోకి రాగానే తూంకుంట నుంచి మజీద్‌పూర్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం అత్యంత వేగంగా, నిర్లక్ష్యంగా నడుపడంతో బైక్‌పై వెళ్తున్న హరిబాబును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనం బైక్‌తో పాటు హరిబాబును కొద్ది దూరం ఈడ్చుకెళ్లింది. రోడ్డ పక్కన ఉన్న గొడను ఢీకొని వాహనం ఆగిపోయింది. సమాచారం అందుకున్న హరిబాబు కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి వెళ్లి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా పరిక్షించగా అప్పటికే హరిబాబు మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## మౌలిక వసతుల కల్పనకు కృషి

### పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని వివేకానందనగర్‌లోని కార్యాలయంలో ప్రగతినగర్ కాలనీ వాసులు పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీని కలిసి కార్పొరేటర్ హమీద్ పటేల్‌తో ఆధ్వర్యంలో పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ త్వరలోనే ప్రగతినగర్ కాలనీలో పర్యటించి పెండింగ్‌లో ఉన్న పనులు త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతినగర్ కాలనీ ప్రెసిడెంట్ తిరుపతిరావు, ఉపాధ్యక్షులు బాబురావు, కోశాధికారి రాము, జనరల్ సెక్రటరీ విజయ్ కుమార్, జాయింట్ సెక్రటరీ ప్రేమ్‌రాజు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## అత్యధిక సభ్యత్వ నమోదు టియుడబ్ల్యుజె యూనియన్‌కే సాధ్యం

### సభ్యత్వ నమోదు పత్రాలను స్వీకరించిన గడ్డమీది బాల్‌రాజ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** టియుడబ్ల్యుజె యూనియన్ రాష్ట్రంలోనే సభ్యత్వ నమోదులో ముందు వరుసలో ఉందని, ప్రతి ఒక్కరు టియుడబ్ల్యుజెలో సభ్యత్వం తీసుకోవాలని టియుడబ్ల్యాజె మేడ్చల్ జిల్లా యూనియస్ అధ్యక్షుడు గడ్డమీది బాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శి వెంకటరాంరెడ్డిలు అన్నారు. మంగళవారం శామీర్‌పేట మండలంలోని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు క్యాతం రవి, ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రభాకర్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాల్‌రాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాంరెడ్డిలు విచ్చేసి సభ్యత్వ నమోదు పత్రాలను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఏకైక యూనియన్ టియుడబ్ల్యుజె అని అన్నారు. రాష్ట్రంలోనే అతి పెద్ద యూనియన్‌గా పేరుపొందిందని జర్నలిస్టులందరు ఈ యూనియన్‌లోనే సభ్యత్వం తీసుకుంటున్నారని చెప్పారు. విలేకరులకు యూనియన్ ఐడి కార్డులు, డైరి, భావ స్వేచ్ఛ మాసపత్రిక అందజేయడం జరుగుతుందన్నారు. వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు దేశం కృష్ణ, వాసాలమర్రి నర్సింహారావు, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మంచాల శేఖర్, సింగం పవన్‌కుమార్, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## విదేశం నుంచి స్వదేశానికి వచ్చిన వెంకటేశంకు సన్మానం



**ప్రజాపక్షం/బంట్వారం :** తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కూమార్‌తో కలిసి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పోచారం వేంకటేశం నేపాల్ పర్యటన ముగించిన తిరిగి వచ్చిన తరుణంలో మండల నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. తెలంగాణ శాసన సభాపతి, స్థానిక ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కూమార్ గారి నాయకత్వాన్ని బలపరుస్తూ కాంగ్రెస్ పార్టీలో అహర్నిశలు కృషి చేసిన మండల పార్టీ అధ్యక్షులు పోచారం వేంకటేశం మండల కేంద్రానికి క్షేమంగా తిరిగి వచ్చిన శుభ సందర్భంలో శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు దోరేటి సుధకార్, రమేష్, గోపాల్, ఆశయ్య, సుధకార్, ఆనందం, తదితరులు ఉన్నారు.

## మహిపాల్‌రెడ్డికి ఎమ్మెల్యే జన్మదిన శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/పెద్దేముల్:** పెద్దేము ల్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రుద్రారం మహిపాల్‌రెడ్డికి తాండూరు ఎమ్మె ల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మహిపాల్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం రాత్రి ఎంఎల్‌ఏ మనోహర్‌రెడ్డిని మహిపాల్ రెడ్డి ప్రత్యేక కలుపుకున్నారు. ఎంఎల్‌ఏను కలసిన వారిలో కోట్‌పల్లి మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ సాయిని నారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీ కృష్ణాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# క్రీడ

## ఫిబ్రవరిలో పొట్టి ప్రపంచకప్..

### అహ్మదాబాద్‌లో ఫైనల్..!




వచ్చే ఏడాది జరుగబోయే పొట్టి వరల్డ్ కప్‌కు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న విషయం తెలిసిందే. అంతర్జాతీయ క్రికెట్ మండలి త్వరలోనే ఈ మెగా టోర్నీ షెడ్యూల్ ఖరారు చేయనుంది. అయితే.. ఫిబ్రవరిలో వరల్డ్ కప్ ప్రారంభం అవుతుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఫైనల్ మ్యాచ్‌ను గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహిస్తారని టాక్. ఒకవేళ పాకిస్థాన్ ఫైనల్ చేరితో శ్రీలంకలోని కొలంబోలే టైటిల్ ఫైట్ ఉండనుంది. వచ్చే ఏడాది ఆరంభంలోనే అభిమానుకు క్రీడా వినోదంలో మునిగితేలనున్నారు. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకూ వరల్డ్ కప్ జరుగనుంది. గత ఎడిషన్ మాదిరిగానే టోర్నీలో పాల్గొనే 20 జట్లను 'నాలుగు' గ్రూప్‌లుగా విభజిస్తారు. ప్రతి గ్రూప్ నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ 8కు వెళ్తాయి. వీటిని నాలుగు చొప్పున రెండేసీ గ్రూప్‌లుగా చేస్తారు. ఈ దశలో ఒక్కో గ్రూప్ నుంచి టాప్‌లో ఉన్న రెండు జట్లు సెమీస్‌కు దూసుకెళ్తాయి. మనదేశంలోని ఐదు స్టేడియాల్లో, శ్రీలంకలోని రెండు మైదానాల్లో వరల్డ్ కప్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అహ్మదాబాద్‌లో లేదా కొలంబోలో ఫైనల్ నిర్వహిస్తారని సమాచారం. ఒకవేళ పాకిస్థాన్ టైటిల్ పోరుకు అర్హత సాధిస్తే కొలంబోనే వేదికగా ఎంపికవుతుంది. భారత్ 2016, శ్రీలంక 2012లో చివరిసారిగా టీ20 ప్రపంచ కప్ పోటీలకు వేదికయ్యాయి. ప్రస్తుతానికి 15 జట్లు మాత్రమే వరల్డ్ కప్ పోటీలకు అర్హత సాధించాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా టీమిండియా అడుపెట్టనుండగా.. శ్రీలంక, అఫ్గనిస్థాన్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, యుఎస్ఎ, వెస్టిండీస్, న్యూజిలాండ్ పాకిస్థాన్, ఐర్లాండ్, కెనడా, నెదర్లాండ్స్, ఇటలీ మాత్రమే క్వాలిఫై అయ్యాయి. ఆఫ్రికా క్వాలిఫయర్, ఆసియా – ఈస్ట్, ఆసియా ఫసిఫిక్ క్వాలిఫయర్ ఫలితాల ఆధారంగా మిగిలిన ఐదు స్థానాలు భర్తీ అవుతాయి.

## టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్థాన్




ఆసియా కప్ 2025 టోర్నీలో భాగంగా హాంగ్ కాంగ్‌తో జరుగుతున్న తొలి మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని అఫ్గానిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ తెలిపాడు. ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యాన్ని నమోదు చేస్తామన్నాడు.'మేం ముందుగా బ్యాటింగ్ చేయాలనుకుంటున్నాం. బ్యాటింగ్‌కు అనుకూలమైన వికెట్ ఇది. మంచి స్కోర్ బోర్డుపై ఉంటే బౌలర్ల పని ఈజీ అవుతుంది. టీ20ల్లో టాస్ గెలిచామా? లేదా? అనేది ముఖ్యం కాదు. కానీ మిడిల్ ఓవర్లలో వికెట్లు తీయడం చాలా కీలకం. అందుకు కావాల్సిన అవకాశాలను సృష్టించుకోవాలి. ముక్కోణపు సిరీస్ ఫైనల్ ముగిసిన కథ. తాజా మ్యాచ్‌పైనే మేం ఫోకస్ పెట్టాం. ఒకవేళ ఆ ఫైనల్ మ్యాచ్‌లో గెలిచినా కూడా ఈ రోజు మేం ఈ మ్యాచ్‌పై ఫోకస్ పెట్టేవాళ్లం. ఆ ఫైనల్ టీమ్‌లో ఒకే ఒక్క మార్పు చేశాం. దార్విష్ స్థానంలో గుల్బదిన్ రీఎంట్రీ ఇచ్చాడు. అని రషీద్ ఖాన్ పేర్కొన్నాడు. టాస్ గెలిచినా తాము బౌలింగ్ ఎంచుకునేవాళ్లమని హాంగ్ కాంగ్ కెప్టెన్ మాసిమ్ ముర్తజా తెలిపాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేయాలనుకున్నాం. టాస్ ఓడినా.. బౌలింగ్ చేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ టోర్నీ ఆడేందుకు మేం చాలా కష్టపడ్డాం. క్వాలిఫయర్స్‌లో మేం మంచి క్రికెట్ ఆడాం. మా ప్రధాన ఆటగాడైన కల్హన్ చల్లు ఈ వేదికపై ఎలా రాణిస్తాడో కెప్టెన్‌గా చూడాలని ఉంది.' అని హాంగ్ కాంగ్ కెప్టెన్ చెప్పుకొచ్చాడు.

**తుది జట్లు**

**అఫ్గానిస్థాన్:** రహ్మానుల్లా గుర్బాజ్(కీపర్), సెదిఖుల్లా అటల్, ఇబ్రహీం జద్రాన్, గుల్బదిన్ నైబ్, అజ్మతుల్లా ఒమర్జాఈ, మహమ్మద్ నబీ, కరీమ్ జనత్, రషీద్ ఖాన్(కెప్టెన్), నూర్ అహ్మద్, ఏఎం ఘున్జాఫర్, ఫజల్హాక్ ఫారూఖీ.

**హాంగ్ కాంగ్:** జీషన్ అలీ(W), బాబర్ హయాత్, అన్షుమన్ రథ్, కల్హన్ చల్లు, నిజాకత్ ఖాన్, ఐజాజ్ ఖాన్, కించిత్ షా, యాసిమ్ ముర్తజా(C), ఆయుష్ శుక్లా, అతీక్ ఇక్బాల్, ఎహ్సాన్ ఖాన్.

## ప్రపంచ ఛాంపియన్ గుకేశ్‌కు షాకిచ్చిన అభిమన్యు మిశ్రా



ఫిడె గ్రాండ్ స్విస్ 2025లో భారత చెస్ స్టార్, ప్రపంచ ఛాంపియన్ గుకేశ్‌కు అమెరికా గ్రాండ్ మాస్టర్‌ను అభిమన్యు మిశ్రా ఓడించాడు. 16 ఏళ్ల వయసులోనే ప్రపంచ ఛాంపియన్‌ను ఓడించి చరిత్ర సృష్టించాడు. మిశ్రా 61 ఎత్తుగడలతో ఈ విజయాన్ని సొంతం చేసుకున్నాడు. కానీ తన ప్రదర్శనతో అతడు సంతృప్తి చెందలేదు! నేను గెలిచినప్పటికీ, ఈ టోర్నమెంట్ మునుపటి గేమ్స్ అంత ఆహ్లాదకరంగా అనిపించలేదు. కానీ టోర్నమెంట్ నేను ఊహించిన దానికంటే బాగా జరుగుతోంది. నేను ఇదే ఫామ్ను కొనసాగిస్తే, టోర్నమెంట్‌ను కూడా గెలిచే అవకాశం ఉంది. నిన్న కూడా నేను ప్రాగ్‌పై కొన్ని తప్పులు చేశాను. కానీ నేను ఈ ఆటగాళ్ల కంటే (గుకేశ్, ప్రాగ్) తక్కువ అని నాకు ఎప్పుడూ అనిపించ లేదు. నేను వారితో సమంగా ఉన్నా అని భావిస్తున్నా..' అని మిశ్రా తన విజయం అనంతరం అన్నాడు. అలాగే ఆర్.ప్రజ్ఞానందకు జర్మనీకి చెందిన మథియాస్ బ్లూబామ్ వల్ల షాక్ తగిలింది. అతడు 55 ఎత్తుల్లో ప్రజ్ఞానందపై విజయం సాధించాడు.


# ఫోకస్

## ఎటు పోతున్నాం?

# మహిళ



ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నోలో, అత్యాచారానికి గురైన 14 ఏళ్ల బాలిక ఒక శిశువుకు జన్మనిచ్చింది. ఈ ఘటన ప్రస్తుతం మన దేశంలో అమ్మాయిల పరిస్థితికి అద్దం పడుతుంది. గతం చాలా ఘనమని చెప్పుకొంటున్న మనం ఎటు పోతున్నామనే ప్రశ్న తలెత్తుతున్నది. ఆ బాలికపై జరిగిన అత్యాచారం, ఆమె బిడ్డను ఇటీవలనే జన్మించడం మన సమాజంలో అనేక లోపాలు ఉన్నాయనే విషయాన్ని స్పష్టం చేస్తున్నది. ఇది ఒక దయనీయమైన ఘటన అయినప్పటికీ, ఇది భారతదేశంలో మహిళల భద్రత విషయంలోని తీవ్రమైన సమస్యలను మన ముందుకు తెస్తున్నది. గణాంకాలను పరిశీలిస్తే, మన దేశంలో ప్రతి రోజు సగటున గంటకు సుమారు 3.7 ఆరోపణలు మహిళలపై అత్యాచార ఘటనలు నమోదవుతున్నాయి. పరిస్థితి మారకపోతే, ప్రతి ఎనిమిది మందిలో ఒక బాలిక ఇలాంటి లైంగిక వేధింపులకు, అత్యాచారానికి గురవుతుందని మహిళా ఉద్యమకారులు హెచ్చరిస్తున్నారు. గణాంకాలు కూడా దాదాపు ఇదే అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నాయి. దేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో పరుగులు తీస్తున్నదని పాలకులు ప్రకటించడమే తప్ప, మహిళల భద్రత విషయంలో దేశం ఇంకా దశాబ్దాలు వెనుకబడి ఉందనేది వాస్తవం. మహిళలపై ఉండే వివక్ష, కుటుంబ సభ్యుల అనధికార ప్రవర్తనలు, సమాజం లోని నిర్లక్ష్యం వంటి కారణాలతో దారుణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. యుపిలో జరిగిన ఘటన విషయానికి వస్తే, బాధితురాలికి ఏ విధమైన న్యాయం జరుగుతుందనేది ప్రశ్న. తల్లిగా మారుతున్న ఆమె బాల్యం ఎప్పటికీ తిరిగి రాదు. అత్యాచారం కారణంగా ఆమె ఎదుర్కొన్న మానసిక, శారీరక బాధ ఇప్పట్లో తీరేది కాదు. దోషుల పట్ల ఉదాసీనత... వారికి కఠిన శిక్షలు విధించడంలో చట్టపరంగా ఉన్న లొసుగులు... కోర్టుల్లో పేరుకుపోతున్న కేసులు.. అంతులేని ఉదాసీనత బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలకు కారణమవుతున్నాయి. ప్రభుత్వాలు, వ్యవస్థలు ఇంకా మేలుకోకపోతే పరిస్థితి మరింత దారుణంగా మారడం ఖాయం. సభ్యసమాజాన్ని సిగ్గుతో తలవంచుకునేలే చేస్తున్న ఇలాంటి ఘటను పునరావృతం కాకుండా జాగ్రత్తలు అవసరం. మహిళల భద్రత కోసం ప్రభుత్వ స్థాయిలో, సమాజ స్థాయిలో చట్టాను కఠినంగా అమలు చేయడం, బాధితులకు సత్వర న్యాయం అందేలా న్యాయవ్యవస్థ స్పందించడం అత్యవసరం. స్త్రీల విద్య, ఆర్థిక సాధికారత పెంపొందించడం, చట్టాలను మరింత ఖచ్చితంగా అమలు చేయడం ముఖ్యం. మన కుటుంబాలు, విద్యా సంస్థలు, సమాజం మొత్తం మహిళలపై జరిగే ఇలాంటి దాడులను నిరోధించేందుకు ముందుకొస్తేనే ఇలాంటి దారుణాలకు కొంతైనా అడ్డుకట్ట పడుతుంది.



## ఒక శిల్పం.. అంతులేని భావం..



ఈ శిల్పంపై ఎంతైనా చెప్పచ్చు. ఎన్ని కవితలైనా అల్లవచ్చు. ఎన్ని పుస్తకాలైనా రాయవచ్చు. ఒక సాధారణ గృహిణి, ప్రత్యేకించి ఒక అమ్మను గురించి ఇంత కంటే గొప్పగా ఎవరూ వర్ణించలేరేమో! స్పెయిన్‌లోని బార్సిలోనా నగరం, కారెర్ డె లా ప్రిన్సెసా సమీపంలో, వియా లైయెటనా కూడలి వద్ద ఈ విగ్రహం ఉంది. దీని పేరు 'ఎల్ ఎఫూర్జియో' (ది ఎఫర్ట్ లేదా ప్రయత్నం అని అర్థం). దీనిని 'లా కార్గా' (ది బర్డెన్ లేదా భారం అని అర్థం). ఒక తల్లి తన పిల్లలతోపాటు, వాషింగ్ మెషిన్, గిన్నెలు, వంటింటి సామాన్ల భారాన్ని మోస్తున్న ఈ తల్లి బొమ్మను ప్రముఖ శిల్పి జౌమీ ప్లెన్సా అద్భుతంగా తీర్చిదిద్దాడు. ఇది తల్లులు జీవన యాత్రలో ఎదుర్కొనే అసలైన బాధ్యతలు, కృషిని ప్రతిబింబించే శిల్పం. వారి కష్టాలను కళ్లకు కడుతుంది. అంత కష్టపడుతున్నా, పిల్లలను జాగ్రత్త చూసుకోవడం తల్లి హృదయానికి అద్దం పడుతుంది. ఆమెది ఒంటరి నడక... ఉన్నతమైన ఆశయం... అనంతమైన ఆత్మస్థైర్యం.

## సమాన హక్కులే నిజమైన వికాసం

మహిళా వికాసం అనే మాట నిత్యం వినిపిస్తునే ఉంటుంది. అయితే, వికాసం అనేది ఏమిటనేదే ప్రశ్న. నిజానికి, స్త్రీల సమాజంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ, శైక్షణ, సాంస్కృతిక రంగాల్లో సాధించే అభివృద్ధి, సాధికారత, సమాన హక్కులు పొందే ప్రక్రియను మాత్రమే వికాసంగా పేర్కోవాలి. ఇది స్త్రీల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు వారి ప్రాధాన్యతను, సామర్థ్యాలను పెంపొందించి సమాజాన్ని సాధారణంగా అభివృద్ధి పథంలో నెట్టే కీలకమైన దశ. ఏ సమాజం లేదా దేశంలో స్త్రీలకు సమున్నత స్థానం కల్పిస్తే ఆ సమాజం పూర్ణ అభివృద్ధి దిశగా ముందడుగు వేస్తుందనేది వాస్తవం. శ్రామిక రంగంలో, మహిళల ఉత్పాదక శక్తిని వినియోగించుకోగలిగితేనే ఆ దేశం సమగ్ర అభివృద్ధిని సాధిస్తుంది. స్త్రీలకు ఆర్థిక స్వతంత్ర్యం, రాజకీయ ప్రాతినిధ్యం, విద్యా సాధికారత ఉంటే సమాజం ఆరోగ్యంగా, సుస్థిరంగా అభివృద్ధి చెందుతుంది. మహిళల అభివృద్ధికి విద్య మూలాధారం. ప్రధానంగా గ్రామీణ, దారిద్ర ప్రాంతాలలో, ఆది వాసి ప్రాంతాలలో మహిళల విద్యాభివృద్ధి జరగడం ద్వారా వారి సామాజిక స్థానం మెరుగుపడుతుంది. ఆర్థికవికాసం కూడా నేటి మహిళలకు అత్యవసరంగా మారింది. మహిళలకు రుణాలు అందించడం, బ్యాంకుల సహకారం వలన మహిళలు స్వయం ఉపాధి, స్వయం సహాయం సంఘాల ద్వారా ఆర్థికస్వాతంత్ర్యం సాధిస్తున్నారు. ఇది గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళల ఆర్థిక వ్యవస్థను బలపరిచింది. మహిళలు తమ వ్యాపారాలు నడుపుతూ కుటుంబ, సమాజ పరిపూర్ణ వికాసానికి దోహదపడుతున్నారు.

## 11 నుండి రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలు

### సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మహబూబాద్ జిల్లా కార్యవర్గ,మండల కార్యదర్శుల సమావేశం వారి పెల్లి వెంకన్న అధ్యక్షతన మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి మాట్లాడారు. ఈ నెల 11 నుండి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను జిల్లా నలుమూలల జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సాయుధ పోరాటంలో పాల్గొన్న వారసుల సన్మానించుకుని, స్తూపాల వద్ద ఘనంగా నివాళులర్పించాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని బిజెపి బిజెపికి సంబంధం లేదన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజంగా పోరాడింది కమ్యూనిస్టులే అన్నారు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని అసువులు బాసిన సాయుధ పోరాట వీరుల స్తూపాల వద్ద నివాళులు అర్పించి వారి కుటుంబాలను సత్కరించి జిల్లా వ్యాప్తంగా జయప్రదం చేయాలన్నారు. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి అజయ్ సారథిరెడ్డి, నల్లు సుధాకర్ రెడ్డి , కట్టెబోయిన, శ్రీనివాస్ నాయకులు వరి పెల్లి వెంకన్న, పెరుగు కుమార్, రేష పల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబ లక్ష్మి , కట్లోజు పాండురంగ చారి, నెల్లూరి నాగేశ్వరరావు, తండ సందీప్, చొప్పరి శేఖర్, బైసా స్వామి, బందు మహేందర్, సారిక శ్రీను ,జంపాల వెంకన్న, మారగాని బాలకృష్ణ, తురక రమేష్ పాల్గొన్నారు

**మంచిర్యాలలో..**



**ప్రజాపక్షం/మంచిర్యాల :** ఈ నెల 11 నుండి 17 వరకు గ్రామాల నుంచి పట్టణ మండల కేంద్రాల వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాస్ మాట్లాడారు. సెప్టెంబర్ 17 ముగింపు సభ హైదరాబాద్ రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో జరుగుతుందని, ఈ సభకు పార్టీ, ప్రజా సంఘాల శ్రేణులు జిల్లావ్యాప్తంగా తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. రైతాంగ సాయుధ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నిర్మూలన కోసం నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిందని రామడుగు లక్ష్మణ్ గుర్తుచేశారు. తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ప్రాణ త్యాగం, ఆంధ్ర మహాసభ పిలుపుతో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొహియుద్దీన్‌లు గెరిల్లా దళాలను ఏర్పాటు చేసి మూడు వేల గ్రామాలను విముక్తి చేయడం, పది లక్షల ఎకరాలను పంచడం చరిత్రలో నిలిచిపోయిందని అన్నారు. ఈ పోరాటంలో సుమారు 4,500 మంది కమ్యూనిస్టులు ప్రాణాలు వదిలారని వివరించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కళిందర్ అలీ ఖాన్, లింగం రవి, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, దేవి పోచన్న, చాడ మహేందర్ రెడ్డి, కుంచాల శంకరయ్య, కాదండి సాంబయ్య, పూజారి రామన్న, ఎగుడ మొండి, నాయకులు నరసయ్య, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా అడిగితే అరెస్టులు చేస్తారా?

### సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్

### కేంద్రమంత్రి కార్యాలయ ముట్టడికి యత్నం




**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర మంత్రులు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి యూరియా తెప్పించాలని కోరితే అరెస్టులు చేస్తారా.. అని సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ అన్నారు. సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ క్యాంపు కార్యాలయ ముట్టడికి యత్నించారు. కేంద్ర మంత్రి కార్యాలయానికి ర్యాలీగా వస్తున్న సీపీఐ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు సీపీఐ నేతలకు మధ్య తోపులాట జరిగి స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది.అనంతరం సీపీఐ నేతలను పోలీసులు అరెస్టు చేసి తరలించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారని,వేసినపంటలు అదును దాటిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీలు రైతుల బాధలు పట్టనట్టు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారని, రైతుల సమస్యను పరిష్కరించే చిత్తశుద్ధి వారికి ఉన్నట్లు కనబడుట లేదన్నారు. కేంద్రంలోని బిజేపీ ప్రభుత్వం బీజేపీ పాలిత రాష్ట్రాలతో పాటు ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు ఉన్న బీహార్ రాష్ట్రంలోయూరియా కొరత లేకుండా అత్యధికంగా సరఫరా చేసిందని,ఇతరరాష్ట్రాలపట్ల వివక్ష చూపిస్తుందన్నారు. రాజకీయాలకు, ఎన్నికలకు సంబం ధం లేకుండా కేంద్రం వ్యవహరించాలని, రైతుల కన్నీళ్లతో ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమని హెచ్చరించారు. కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి గెలిచి కేంద్ర ప్రభుత్వంలో మం త్రిగా ఉన్న బండి సంజయ్ ఇక్కడి రైతుల సమస్యను ప్రధాని మోడీతో మాట్లాడి రాష్ట్రానికి సరిపడా యూరియా తెప్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని రైతులు యూరియా కోసం రాత్రుళ్లు క్యూ లైన్లలో నిల్చొని ఇబ్బందులు పడుతుంటే కేంద్ర మంత్రి కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. రైతుల పట్ల కేంద్ర మంత్రుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.సమస్యనుంచి తప్పించుకోవడం కాకుండా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యురాలు గూడెం లక్ష్మి , తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మచ్చ రమేష్, బామండ్ల పల్లి యుగేందర్, బీర్ల పద్మ, కొట్టే అంజలి, రామారపు వెంకటేశ్, రైతు సంఘం జిల్లా నాయకులు గోలి బాపురెడ్డి, కోమటి రెడ్డి జయపాల్ రెడ్డి, నాయకులు కేశబోయిన రాము, మామిడిపల్లి హేమంత్ కుమార్, మల్లేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



### పలువురు నాయకుల ముందస్తు అరెస్టు

జిల్లాలోయూరియా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ తలపెట్టిన నిరసన కార్యక్రమం సందర్భంగా కరీంనగర్‌తో పాటు జిల్లాలోని వివిధ మండలాల్లో పలువురు సీపీఐ నాయకులను పోలీసులు మంగళవారం తెల్లవారుజామునే ముందస్తు అరెస్టు చేశారు. కరీంనగర్ లో సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, పైడిపల్లి రాజును, చిగురుమామిడిలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందే స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డిని, తిమ్మాపూర్ లో రాష్ట్ర కౌన్సిల్ సభ్య లు పొనగంటి కేదారి, మానకొండూర్‌లో మండల కార్యదర్శి బండ రాజిరెడ్డి, మండల నాయకులు ఎర్రబోయిన సదయ్య, నాంపల్లి కొంరయ్య, రామడుగు మండలంలో మండల కార్యదర్శి ఉమ్మెంతల రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు గొడిశెల తిరుపతి గౌడ్, కనకయ్య, మల్లేశంలను అక్రమంగా అరెస్టు చేశారు.

## ప్రజలకిచ్చిన హామీలు ఏమయ్యాయి?

### బికెయంయు జిల్లా కార్యదర్శి అంజయ్య




**ప్రజాపక్షం/షాబాద్(రంగారెడ్డి):** ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బికేయంయు జిల్లా కార్యదర్శిఅంజయ్య అన్నారు. మంగళవారం చేవెళ్ల ఆర్డీవో కార్యలయం ముందు బికేయం రాష్ట్ర కమిటి పిలుపు మెరకు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరు పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వకుండ పార్టీ కార్యకర్తలకు పైరవికారులకు మంజూరు అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి పని దినాలు 200 రోజులకు పెంచాలన్నారు. పేదలకు ఇండ్ల స్థలాలు, పింఛన్లు రూ.4 వేలు, 6వేలు ఆస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికి అమలు చేయడం లేదన్నారు. నాయకులు స్వరుప, పెంటయ్య, చంద్రమౌళి, వెంకటమ్మ తదితరులు ఉన్నారు.

## సాయుధపోరాట వారోత్సవాలు అధికారికంగా నిర్వహించాలి

### సిపిఐ జిల్లాకార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** తెలంగాణ సాయుధపోరాట వారోత్సవాలను రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిపిఐజిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ డిమాండ్‌చేశారు. ఈ నెల 11నుంచి 17వరకు జరిగే తెలంగాణ సాయుధపోరాట వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సెప్టెంబర్ 11న మన్ననూరులో సైమన్‌రాములు స్థూపందగ్గర నుండి సాయుధపోరాటాలు ప్రారంభమవుతాయన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని లక్ష్మణచారిభవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఐ జిల్లా కౌన్సిల్‌సభ్యులు మర్యాదవెంకటయ్య, ఎఐటియూసి నాగర్‌కర్నూల్ జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్, సిపిఐజిల్లా కౌన్సిల్ సభ్యులు తుమ్మల శివుడు, ఎఐవైఎఫ్ జిల్లావైస్‌ప్రెసిడెంట్ ఎండి యూసుఫ్ పాల్గొన్నారు.

## ఎఐటియుసి పోరాట ఫలితంగా పెరిగిన పరిహారాలు




**ప్రజాపక్షం/ములుగు:** ఎఐటియుసి పోరాట ఫలితంగా భవన నిర్మాణ కార్మిక సంఘంలో పరిహారాలు పెరిగాయని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ ములుగు జిల్లా కమిటీ సమావేశం ములుగు జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో జిల్లా అధ్యక్షులు పోలం కొండయ్య అధ్యక్షతన జరిగింది.ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా 2009లో భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాంటి సంక్షేమ బోర్డులో సభ్యులుగా నమోదయినకార్మికులకు సంబంధించిన వివాహాలకు, ప్రసూతికి రూ.30వేల చొప్పున, నార్మల్ డెత్‌కు రూ.1లక్ష 30వేలు, ప్రమాద మరణానికి రూ.6, 30,000ల చొప్పున అందిస్తున్నారు. అది కూడా అనేక పోరాటాల ఫలితంగా వస్తున్నాయన్నారు. కార్మికుడు చనిపోతే ప్రస్తుతం చెల్లిస్తున్న సరిపోయే పరిస్థితులు లేనందున పరిహారాలు పెంచాలని ఏఐటియూసి అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు అనేక రకాలుగా మిలిటెంట్ పోరాటాలు నిర్వహించిన ఫలితంగా సహజ మరణానికి రూ.2లక్షల 30వేలు, ప్రమాద మరణానికి రూ.10లక్షల 30వేలకు పెంచడం జరిగిందని, అందుకు ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండి నర్సయ్య, ప్రధాన కార్యదర్శి కొక్కుల రాజేందర్, కోశాధికారి సామల దేవేందర్, సిపిఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, సీనియర్ నాయకులు ఇంజం కొమురయ్య, బుర్రి క్రాంతి, ఇండ్ల లక్ష్మి నారాయణ, గ్రామ పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బుడిమె సదయ్య, తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## కాంగ్రెస్ బలోపేతానికి కృషి



**ప్రజాపక్షం/చివ్వెంల :** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మోదీన్‌పురం గ్రామానికి చెందిన ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీలను వీడి కున్నాం ముత్తయ్య ఆధ్వర్యంలో దాదాపు 40 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు దారోజు భాగ్యరాజు, ధరావత్ రవి పాల్గొన్నారు.

## వ్యవసాయ అధికారిణి సస్పెన్షన్

**ప్రజాపక్షం/సూర్యాపేట (ఆత్మకూర్(ఎస్)) :** విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఆత్మకూర్(ఎస్) మండల వ్యవసాయ అధికారిని దివ్యను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మంగళవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని నెమ్మికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు యూరియా సరఫరా చేస్తుండగా ఆన్‌లైన్, భౌతిక అమ్మకాలలో తేడాలు వచ్చాయి. రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుండగా యూరియా లేదంటూ రైతులకు తప్పుడు సమాచారం ఇవ్వడంతో రైతులు గందరగోళానికి గురయ్యారు. యూరియా సరఫరాను సక్రమంగా పర్యవేక్షణ చేయకుండా విధులపట్ల నిర్లక్ష్యం వహించినందుకు గాను ఆమెను సస్పెండ్ చేశారు.

## రెండు గేట్ల ద్వారా నీటి విడుదల



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద తగ్గు ముఖం పట్టడంతో ప్రాజెక్టు అధికారులు రెండు గేట్ల ద్వారా నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. మంగళవారం ఉదయం వరకు లక్షకు పైగా కొనసాగిన ఇన్ ఫ్లో ఆ తరువాత వెంటనే వేల క్యూసెక్కులకు తగ్గిపోవడంతో అధికారులు వెంటనే 14 డేట్ల ద్వారా కొనసాగిన నీటి విడుదల మొదట ఆరు గేట్లకు పరిమితం చేసి ఆ తర్వాత ఇంకా వరద తగ్గుముఖం పట్టడంతో రెండు గేట్ల ద్వారా నీటి విడుదలను కొనసాగిస్తున్నారు.ప్రస్తుతం నాగార్జునసాగర్ రిజర్వాయర్ కు మంగళవారం సాయంత్రానికి 70038 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తూ ఉండటంతో రెండు గేట్లను ఐదు అడుగుల మేర పైకి లేపి 16012 క్యూసెక్కుల నీటిని స్పిల్ వే ద్వారా దిగువకు చేస్తున్నారు. ప్రస్తుతం నాగార్జున సాగర్ రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 590 అడుగులకు గాను మంగళవారం సాయంత్రానికి 589.10 అడుగులుగా ఉండి నీటి నిల్వ సామర్థం 312.0450 టీఎంసీలకు 309.3558 టిఎంసీలుగా ఉన్నది. కుడి కాలువ ద్వారా 9700 క్యూసెక్కులు ఎడమ కాలువ ద్వారా 9349 క్యూసెక్కులు ఎస్ ఎల్ బి సి ఏ ఎం ఆర్ పి ద్వారా 2400క్యూసెక్కులు ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 32277క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీనితో ప్రాజెక్టుకు మొత్తం70038 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో గా వచ్చి చేరుతూ ఉండటంతో అంతే మొత్తాన్ని అవుట్ ఫ్లోగా దిగువకు విడుదల చేస్తున్నారు.

## పేద విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలి

రాష్ట్ర ఎస్సి ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఎస్సి, ఎస్టి, బిసి పేద విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలని రాష్ట్ర ఎస్సి, ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఏఎఫ్ఓ విదేశీ విద్య కన్సల్టెన్సీ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ విదేశాలలో ఉన్నత విద్య చదువుకునేందుకు గ్రామీణ విద్యార్థులు ఎఎఫ్ఓ కన్సల్టెన్సీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంబేద్కర్, జ్యోతిరావు విదేశీ విద్యా పథకాలపై విద్యార్థులకు అవగాహన పెంపొందించు కోవాలని తెలిపారు. ఉన్నత విద్య ద్వారా తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో పేద విద్యార్థులను విదేశాలకు ఉన్నత విద్యకోసం విద్యార్థులకు సహాయం చేస్తున్న ఏఎఫ్ఓ డైరెక్టర్ సురేష్ నాయకును చైర్మన్ అభినందించారు. సురేష్ నాయక్ మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత విద్య చదువుకోవాలని అనుకుంటున్న విద్యార్థిని విద్యార్థులు తమ కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సి ఎస్టి కమీషన్ సభ్యులు రాంబాబు నాయక్, జిల్లా శంకర్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



**ప్రజాపక్షం/చండూరు:** ప్రకృతిని గౌరవించుకొని ప్రతి ఇల్లు మొక్కలతో కళకళలాడాలని , విద్యార్థి దశలో పర్యావరణ పరిరక్షణ పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని చండూరు ఆర్డీఓ శ్రీదేవి పిలుపునిచ్చారు. చండూరు మున్సిపల్ కమీషనర్ మల్లేశం ఆధ్వర్యంలో చండూరు హైస్కూల్ లో జరిగిన పర్యావరణ సంరక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బహుమతులను అందజేశారు. రైజింగ్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా చండూరు మున్సిపాలిటీ పరిధిలోని ఎనమిది పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన , చిత్రలేఖన పోటీలు గతంలో నిర్వహించగా వాటిలో విజేతలైన వారికి మంగళవారం బహుమతి ప్రదానం ఆర్డీఓ చేతుల మీదుగా అందజేశారు. తెలుగు ఉపాధ్యాయులు మద్దోజు సుధీర్ బాబు వ్యాఖాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో చండూరు మున్సిపల్ కమీషనర్ ఎల్. మల్లేశం, మండల విద్యాధికారి సుధాకర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటేశ్వర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్లను ఆదుకోవాలి

**ప్రజాపక్షం/గుండాల:** ఫ్రీ ప్రైమరీ స్కూల్ రద్దు చేసి అంగన్‌వాడీ టీచర్లను ఆదుకోవాలని సిపిఐ మండల కార్యదర్శ అనంతుల రామచంద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఫ్రీ ప్రైమరీ స్కూల్‌లను నడిపించాలని ఇచ్చిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్న పిల్లలకు ఐదు సంవత్సరాల వరకు పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ వారికి ఆట పాటలతో పాటు ఎలాంటి ఒత్తిడి లేకుండా దృష్టి చదువు వైపు వెళ్లే విధంగా పిల్లలను ప్రోత్సహిస్తూ ఉన్నారన్నారన్నారు. ఇలాంటి సందర్భంలో ప్రభుత్వం 36 నెలలు నిండిన పిల్లలకు ఫ్రీ ప్రైమరీ స్కూల్ పేరుతో పౌష్టికాహారాన్ని దూరం చేస్తూ వారిని మానసికంగా ఒత్తిడికి గురయ్యే విధంగా ఫ్రీ ప్రైమరీ స్కూల్‌లను తీసుకువచ్చారని తక్షణమే ఫ్రీ ప్రై మరీ స్కూల్ అమలు చేయాలని ఇచ్చిన నోటీసులను రద్దు చేయాలన్నారు.

## కాళేశ్వరం అవినీతిపై సిబిఐ దర్యాప్తు అంటే బిఆర్ఎస్ నాయకులకు వణుకు

తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని దీనిపై సిబిఐ ఎంక్వైరీ చేయిస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే బిఆర్ఎస్ నాయకులకు వణుకెందుకని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 10 రోజులుగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిని ప్రజల ముందుకు ప్రభుత్వం తీసుకవచ్చేందుకు అసెంబ్లీలో చర్చిస్తే తమ బండారం బయటపడడంతో గత పాలకులు తట్టుకోలేకపోతున్నారని అన్నారు. గుమ్మడి కాయల దొంగలంటే తడుముకున్నట్లు ఒక్కొక్క నాయకుడు తమకు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, జగదీష్ రెడ్డిలు కాళేశ్వరం జలాలపై క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూర్యాపేట ప్రాంతానికి వస్తున్న నీళ్ళు కాళేశ్వరం ద్వారా వస్తున్నాయా లేక ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి వస్తున్నాయా అనే విషయం ప్రజలకు చెప్పాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వేల కోట్ల రూపాయలు అవినీతి జరగడంతో రాష్ట్రం అప్పులపాలైందని దీని వడ్డీ ఖర్చే రూ. 6 నుండి 7 వేల కోట్లు చెల్లించడం జరుగుతుందన్నారు. ఇది గుదిబండగా మారి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా మారిందని చెప్పారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలోనే పోచంపల్లి నుండి కాల్వల ద్వారా ఈ ప్రాంతానికి నీళ్ళు వచ్చిన విషయాన్ని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి గమనించాలన్నారు. కాళేశ్వరం లేకుండానే అప్పట్లో రైతులు పంటలు పండించుకున్నారని తెలిపారు. కాళేశ్వరం పేరిట అవినీతికి పాల్పడి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన దోషులను కఠినంగా శిక్షించాల్సిందేనని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యురాలు కవిత కూడా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. సామాజిక మాధ్యమాలలో అసభ్య పదజాలం ఉపయోగించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను, కాంగ్రెస్ నాయకులను జగదీష్‌రెడ్డి అవమాన పరుస్తున్నారని తప్పు పట్టారు. యూరియా కొరతపై బిఆర్ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియా సరఫరా చేయద్దన్న విషయం వారికి తెలియదన్నారు. కేంద్ర ప్రభుత్వం యూరియాను సరఫరా చేయాల్సి ఉండగా చైనా నుండి దిగుమతి చేసుకోవడంలో కొంత ఇబ్బంది జరిగినట్లు బిజెపి ప్రజాప్రతినిధులే స్వయంగా చెబుతున్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యలు తీర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందున్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ వైస్‌చైర్మన్ గట్టు శ్రీనివాస్, సీనియర్ నాయకులు డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్, నాయకులు సూదిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు తండు శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## నేడు సురవరం సంస్మరణ సభ



**ప్రజా పక్షం/నల్లగొండ:** సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి,మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర రెడ్డి సంస్మరణ సభ ఈనెల10 బుధవారం నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్‌లోగల జివిఎల్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం తెలిపారు. సురవరం సుధాకర్ రెడ్డి అంతర్జాతీయ దేశ రాజకీయాల్లో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని,నల్లగొండ జిల్లా అభివృద్ధికి దూరదృష్టితో అనేక పథకాలకు రూపకల్పన చేసిన మార్గదర్శకుడు అని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమ సమయంలో కీలకంగా వ్యవహరించిన గొప్ప నాయకుడు. రాజకీయ ప్రముఖ చిత్రంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొని నీతి, నిజాయితీలకు నిలువుటద్దంగా,రాజకీయ వేత్తగా, మేధావిగా,విలువలతో కూడుకున్న రాజకీయ ప్రముఖుల్లో సురవరం సుధాకర్ రెడ్డికి ప్రత్యేక స్థానం ఉందన్నారు.నల్లగొండ జిల్లాను శాశ్వత కరువు,ఫ్లోరిన్ భారీ నుండి పారద్రోలటానికి కృష్ణా నదిపై చేపట్టిన ఎస్ఎల్ బిసి,డిండి ఎత్తి పోతలే శరణ్యమని వాటిని పూర్తి చేయుటకు ఆనాటి ముఖ్యమంత్రి పై ఒత్తిడి తీసుకొచ్చారు. కేంద్రం నుండి వచ్చే అనుమతులను తెప్పించుటలో ఆయన కృషి చాలా గొప్పది అన్నారు.ఈ సంస్మరణ సభకు ముఖ్య అతిథులు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి,నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీరా రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివ రావు, తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీని వాస్ రెడ్డి, సిపిఐ జాతీయ సమితి సభ్యులు,మాజీ ఎంఎల్ఏ పల్లా వెంకట రెడ్డి,సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డిలు పా ల్గొంటున్నారని తెలిపారు. కావున సంస్మరణ సభలో పార్టీ కార్యకర్తలు,సానుభూతిపరులు,మేధావులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కాళోజీ జయంతి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలుగు భాష,సంస్కృతిని శిఖరంలో నిలబెట్టిన ఘనత కాళోజి నారాయణరావుది ప్రభుత్వ డైట్ కళాశాలకళాశాల ప్రిన్సిపాల్ నరసింహ అని కొనియాడారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని కాళోజి నారాయణరావు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చేసిన కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ మాట్లాడుతూ కాళోజి నారాయణరావు తెలుగు సాహిత్యం అభివృద్ధి కొరకు ఎంతో పాటు పడారని, శాసనమండలి సభ్యులుగా కూడా పనిచేసి సేవలు అందించారని, ఆయనకు ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డు కూడా ఇచ్చిందని అన్నారు. ప్రముఖ రచయిత మేరెడ్డి యాదగిరి రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో నా గొడవ సాహిత్యం ద్వారా ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించారన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళి కృష్ణ,లెక్చరర్స్ నరేందర్ రెడ్డి, బానుప్రకాష్,స్వాతి, వినోద్, హన్మంత్ ఉన్నారు.



**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువగనిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపివో ఇస్మాయిల్, సూపరిండెంట్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు పృథ్వీ, సోమయ్య, బైబిజాన్, రాజేందర్, దశరథ్, మహేశ్వరీ, మహేష్, కవిత, సుధాకర్ పాల్గొన్నారు.

## నాలుగు వేల అమరవీరుల రక్త తర్పణమే...

తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు జయప్రదం చేయండి : పల్లా నర్సింహారెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/దేవరకొండ:** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం దొరలు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ఈనెల 11 నుండి 17 వరకు ఘనంగా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగిన నియోజకవర్గ సిపిఐ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో నైజాంకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటం భారత దేశ చరిత్రలో స్వర్ణాక్షరాలతో లికించదగినదని అన్నారు. నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని బిజెపి ప్రభుత్వం హిందూ ముస్లీంల మధ్య పోరాటంగా చిత్రీకరించడం విచారకరమని అన్నారు. ఈ పోరాటంలో నాలుగు వేల అమరవీరుల రక్త తర్పణం చేయడం జరిగిందన్నారు. దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి దున్నేవాడిదే భూమి కావాలని లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ కే దక్కిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మహోత్తరమైన పోరాటాన్ని అవమానపరిచి సాయుధ పోరాట యోధులకు రావాల్సిన ఫించన్లను ఎత్తివేసిన హీనమైన చరిత్ర ఉందని విమర్శించారు. సెప్టెంబర్ 17 పేరుతో బిజెపి అమరవీరులను స్మరించుకోవడం సిగ్గు చేటని దీని తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఈనెల 11 నుండి 17 వరకు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో యూరియా కొరత అత్యధికంగా ఉన్నదని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వంపై కక్షగట్టి రాష్ట్రానికి రావాల్సిన యూరియా కోటను ఇవ్వకుండా మోసం చేస్తుందని ఆరోపించారు. దీని మూలంగా వ్యాపారస్థులు కూడా యూరియాను కృత్రిమ కొరతగా సృష్టించి బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయించడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతుల వ్యవసాయానికి సరిపడా యూరియాను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 10వ తేదిన నల్గొండ లో జరిగే సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి ఉప్పునూతల వెంకటయ్య అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు మైనోద్దీన్, కనకాచారి, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, జయరాములు, అచ్చయ్య, శైలేష్, రామస్వామి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముద్రబోయిన నారాయణకు సిపిఐ నాయకుల నివాళులు



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం కోటమర్తి గ్రామంలో అనారోగ్యంతో మరణించిన సిపిఐ మాజీ గ్రామ శాఖ కార్యదర్శి కామ్రేడ్ ముద్రబోయిన నారాయణ మృతదేహంపై సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చెడే చంద్రయ్య, మండల కార్యదర్శి రేకల శ్రీనివాస్ ,జిల్లా సమితి సభ్యులు శాంతి కుమార్ ఎర్ర జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చెడే చంద్రయ్య మాట్లాడుతూ కోటమర్తి గ్రామంలో కామ్రేడ్ నారాయణ ఆధ్వర్యంలో సిపిఐ పార్టీని బలోపేతం చేశాడని, ఆనాటి ఎమ్మెల్యే గుర్రం యాదగిరిరెడ్డి నాయకత్వాన కోటమర్తి గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయుటలో నారాయణ పాత్ర ఉన్నదని ఆయన అన్నారు. నారాయణ మృతి సిపిఐ పార్టీకి తీరనిలోటని సంతాపాన్ని తెలియజేస్తూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కోటమర్తి గ్రామ సిపిఐ నాయకులు నిమ్మల బుచ్చయ్య, చింత సోమయ్య, చిప్పలపల్లి నరసింహ, నారాయణ, కుమారుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## 15న ఎంజియు 4వ స్నాతకోత్సవం

యూనివర్సిటీలో రెండు నూతన కోర్సులు ప్రారంభం ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** అకాడమిక్ సంవత్సరంలో అత్యుత్తమ ఉత్సవమైన స్నాతకోత్సవానికి మహాత్మా గాంధీ యూనివర్సిటీ సన్నద్ధమవుతున్నట్లు ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. యూనివర్సిటీలోని తన ఛాంబర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా విద్యా సంవత్సరాలలో అభ్యసించిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేసే అతి ముఖ్యమైన విద్యా పండుగ స్నాతకోత్సవమన్నారు. 2007లో ప్రారంభమైన విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకమైన నాల్గవ స్నాతకోత్సవానికి సిద్ధమవడం సంతోషకరమని, మరింత ఉత్సాహాన్ని నింపి అభివృద్ధి పదంలో నడిపించడానికి ఉపయోగపడుతుందన్నారు. సెప్టెంబర్ 15న జరగనున్న స్నాతకోత్సవానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ విశ్వవిద్యాలయ కులపతి హోదాలో హాజరుకానున్నట్లు, ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ ఆచార్య బిఎస్ మూర్తి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్నారు. ఈ దఫా 22 పిహెచ్‌డి పరిశోధకులకు,57 మంది పిజి విద్యార్థులకు స్వర్ణ పథకాలు,పట్టాలు అతిధుల చేతులమీదుగా అందించనున్నట్లు తెలిపారు. ఈ స్నాతకోత్సవంతో 2022,23,24 విద్యా సంవత్సరంలో డిగ్రీ 16210,పీజీ,3200,బీఈడీ పూర్తిచేసిన 7800 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రకటించనున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు అధ్యాపకుల్లో నూతన ఉత్సాహాన్ని నింపే అకాడమిక్ చర్చలు, అతిథుల ప్రసంగాలతో కొత్త లక్ష్యాలను నిర్దేశించి వాటి సాధన దిశగా అడుగులు వేయనున్నట్లు ఉపకులపతి తెలిపారు.

**కొత్త కోర్స్‌లకు అనుమతి :** ఈ విద్యా సంవత్సరం నూతనంగా ఎల్ఎల్‌బి,ఫార్మసీ కళాశాల ఏర్పాటుకు అనుమతి లభించినట్లు,రానున్న విద్యా సంవత్సరంలో ఎంఈడి,బిపిఈడి,గవర్నర్స్ వంటి కోర్సుల సాధనకు కృషి చేస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు.వివిధ వసతి గృహాలు, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ నిర్మాణ పనులు జరుగుతున్నట్లు వివరించారు. అకాడమిక్ సంస్కరణల్లో భాగంగా 75 శాతం హాజరు విధిగా అమలు చేస్తున్నట్లు, నైపుణ్యాల పెంపునకు అదనపు కోర్సులు, టాస్క్ ద్వారా అదనపు తరగతులుతోపాటు వివిధ సంస్థల తో జరిగిన అవగాహన ఒప్పందాలను వివరించారు. 2028లో న్యాక్ అక్రిడిషన్‌లో ఏ ప్లస్ సాధనకు ప్రణాళిక బద్ధంగా సాగుతున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సిఓఈ డాక్టర్ జి ఉపేందర్ రెడ్డి,డాక్టర్ లక్ష్మీ ప్రభ,డాక్టర్ సంధ్యారాణి,డాక్టర్ ప్రవళిక పాల్గొన్నారు.

## నానో యూరియాతో అధిక ప్రయోజనం



**ప్రజాపక్షం/ హాలియా:** నానో యూరియా వాడకం వలన రైతులకు, భూసారం పెంపకానికి ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని మండల సహాయ వ్యవసాయ సంచాలకులు సరిత అన్నారు. మంగళవారం హాలియాలో నానో యూరియా వాడకంపై రైతులు, మండల వ్యవసాయ అధికారి ముని కృష్ణ తో కలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నానో యూరియా అనేది నానో టెక్నాలజీ సహాయంతో తయారు చేయబడిన ద్రవ రూపంలో ఉండే నత్రజని ఎరువు అని చెప్పారు. దీని వాడకం వలన అనేక ప్రయోజనాలు భూమికి, రైతుకి చేకూరుతుందని తెలిపారు. సాంప్రదాయ యూరియా వాయువుగా మారి వాతావరణంలోకి విడుదలై పర్యావరణానికి హాని చేస్తుందని చెప్పారు. భూగర్భ జల వనరులకు ఈ యూరియా వలన ఇబ్బందులు ఏర్పడడమే కాక నేల కూడా దెబ్బతింటుందని తెలిపారు. సాంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియా తక్కువ మొత్తంలో వాడడం వలన నీటి కాలుష్యం మట్టి కాలుష్యం తగ్గుతుందని సూచించారు. పంటలకు రసాయన ఎరువులు వేస్తేనే దిగుబడులు వస్తాయని ఆలోచనలో ఉన్న రైతులు దానిని మార్చుకోవాలని చెప్పారు. పంటకు ముందు భూమిలో పచ్చి రొట్టె సేంద్రియ జీవనరులు ఎలా ఉపయోగపడతాయో నానో యూరియా కూడా భూమికి అలానే ఉపయోగపడుతుందని తెలిపారు. అందువలన రైతులు నానో యూరియా వాడకం పెంచాలని సూచించారు.

## వీరోచిత తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి మతం రంగు పులిమితే చరిత్ర హీనులవుతారు

సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు



**ప్రజాపక్షం/భువనగిరి :** వీరోచిత తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి మతం రంగు పులిమితే చరిత్ర హీనులవుతారని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో వీరతెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ప్రజా విజయాలు వాస్తవాలు వక్రీకరణలు అనే అంశంపై సిపిఎం జిల్లా ప్రజా సదస్సు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ అధ్యక్షతన జరిగింది. ఇ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవి. రాఘవులు బీవి,రాఘవులు మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ రైతంగ పోరాటం ప్రపంచంలోఎన్నో పోరాటాలకు స్ఫూర్తినిచ్చిందన్నారు. ఈ పోరాటం ద్వారా అనేకమంది కవులు కళాకారులు ముందుకు వచ్చారని బండి యాదగిరి, సుద్దాల హనుమంతు, సి.నారాయణరెడ్డి, కాలోజి నారాయణరావు లాంటివారు అనేకమంది సాయుధ రైతాంగ పోరాటంలో ప్రజలను చైతన్యం చేశారని గుర్తు చేశారు. అలాగే మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో ఉన్న పల్లె, పల్లెకు, చెట్టుకు, పుట్టకు ఒక చరిత్ర ఉందని ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలకు తాతల, తండ్రుల వారసత్వం కలిగి ఉందని చరిత్రను వక్రీకరించాలని చూస్తున్న బిజెపికి ఏముందో చూపెట్టగలరా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, గుంటోజు శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## తెలంగాణ తొలిపొద్దు కాళోజీ



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** ప్రజాకవిగా, ఉద్యమకారుడిగా భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తెలంగాణవైతాళికుడు కాళోజీ నారాయణరావు నిరంకుశత్వానికి, అరాచకపాలనకు వ్యతిరేకంగా గళమెత్తి తెలంగాణప్రజల్లో చైతన్యం రగిల్చిన మహామనిషి కాళోజీ అని మండలంలోని వివిధ పాఠశాలలో ఆయన జయంతిని భాషాదినోత్సవంగా సెప్టెంబర్ 9న జరుపుకున్నారు. మండలంలోని కారుకొండ ప్రాథమిక పాఠశాల గంగారం పాఠశాల ఉపాధ్యాయులు ఆయన యొక్క చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో మంచినీటి సమస్య



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణం లోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంచినీటి సమస్య రోగులను తీవ్రంగా వేధిస్తుంది. ప్రతిరోజు ఆసుపత్రికి వచ్చే పేషెంట్లు వారి బంధువులు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాత నిర్మించిన వాటర్ ట్యాంకు విరిగిపోయి గంగా మారింది. నెల రోజుల క్రితం అదనపు కలెక్టర్‌కు విన్నవించగా ట్యాంక్ సమస్య పరిష్కరించి మంచినీరు అందుబాటులో ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు. కానీ సమస్య ఇప్పటికి పరిష్కారం కాలేదు దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానమైన సమస్య మరుగుదొడ్లు లేక ఆసుపత్రి ప్రాంగణం దుర్వాసనగా తయారైంది. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పరిష్కారం కాలేదు అత్యవసరమైన టాయిలెట్స్, మంచినీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని బాధితులు కోరుతున్నారు.

## ఘనంగా ప్రారంభమైన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ క్రీడలు



**ప్రజాపక్షం/మద్దూర్ :** పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఘనంగా ప్రారంభమైన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ క్రీడలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి బాలకిష్టప్ప హాజరై విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు ఆడటం వలన క్రీడా కోటలో ఉద్యోగాలు సాధించవచ్చని అని అన్నారు. ఈ సందర్భంగా వ్యాయమ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు వెంకటప్ప మాట్లాడుతూ క్రీడలు ఆడటం వలన ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ చెడు అలవాట్లకు బానిసకు కాకుండా మంచి పౌరులుగా ఎదుగుతురన్నారు. ఈ కార్యక్రమంలో పిఈటిలు కృష్ణవేణి ,మమత, సత్యం, ఉపాధ్యాయులు సుదర్శన్, రామాంజనేయులు, షాన్‌ముశ్రీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర కుష్టు వ్యాధి నివారణ బృందం పర్యటన



**ప్రజాపక్షం/పెబ్బేరు :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు రాష్ట్ర కుష్టు వ్యాధి నివారణ బృందం కుష్టు వ్యాధిగ్రస్తుల స్థితి గతులను పరిశీలించారు. కుష్టు వ్యాధి రహిత సమాజం కొరకు వైద్య సిబ్బందితో పాటు సమాజంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర కుష్టు వ్యాధి బృంద సభ్యులు పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ అక్కడ వైద్య సిబ్బందికి, ఆశాలకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి మల్టీ డ్రగ్ థెరఫీ మాత్రలు చికిత్స అందించినచో ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని, అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని తెలియజేశారు. గ్రామంలో కుట్టు వ్యాధి సర్వేపై పూర్తిగా అవగాహన కల్పించారు. తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధి ఉన్న వారిని పరిశీలించారు. లెప్రసి రికార్డ్స్, రిపోర్టలు పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బృంద సభ్యులు జూనియర్ వైద్యాధికారి డా.సంపత్, జిల్లా పారా మెడికల్ అధికారి వెంకటేశ్వరచారి, సకలరెడ్డి, కృష్ణయ్య, స్టాటికల్ ఆఫీసర్ సురేష్, మండల వైద్యాధికారి డా.ప్రవళిక, హెల్త్ సూపర్వైజర్ స్వరూప, పార్వతి, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, తిరుపతయ్య, డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ గౌడ్, ల్యాబ్ టెక్నిషియన్ విక్టర్ రాజు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగం భారతీయ పౌరులకు ప్రాథమిక హక్కు



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన న్యాయమూర్తి లీగల్ సర్వీసెస్ సంస్థ చైర్మన్ ఆదేశాల మేరకు మంగళవారం రోజు నారాయణ పేట జిల్లా మద్దూర్, గుండుమల్, దోరేపల్లి , పల్లెగడ్డ తండా గ్రామాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ విజ్ఞాన సదస్సును అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.సురేష్, ఛీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే.లక్ష్మి పతి గౌడ్, అసిస్టెంట్ లీడల్ ఎయిడ్ డిఫెన్సె కౌన్సిల్ ఎన్.నాగేశ్వరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో రాజ్యాంగం ప్రకారం అందరికి సమాన హక్కులు కల్పించిందని అన్నారు. వీటిలో సమానత్వ హక్కు, స్వాతంత్ర్య పు హక్కు, దోపిడిని నివారించే హక్కు, మతస్వాతంత్రపు హక్కు, సాంస్కతిక, విద్యా హక్కులు, రాజ్యాంగ పరిహారపు హక్కు ముఖ్యమైనవి. ఈ హక్కులు న్యాయస్థానాలలో అమలు చేయబడతాయి, దేశ పౌరులందరికీ వారి జాతి, కులం, లింగం, లేదా పుట్టిన స్థలంతో సంబంధం లేకుండా ఎవరికీ పక్షపాతం చూపకూడదు. సమాజంలోని బలహీన వర్గాలకు హక్కులు, గిరిజన హక్కులు, బాల్యవివాహాలు, బాలకార్మిక చట్టాలు, వయోవృద్ధుల చట్టం, మహిళలకు రక్షణ చట్టం ఉన్నదని నిత్యవసర సరుకుల చట్టం ద్వారా ప్రతి ఒక్క వ్యక్తి తమ యొక్క రసీదులను జాగ్రత్తపరచుకొని నష్టం వారిని ఎదుర్కొకుండా తమను తాను కాపాడుకోవాలని తెలిపారు. వరకట్న వేదింపులు, వరకట్న నిషేధ చట్టం, న్యాయపరమైన రక్షణ, చట్టపరమైన అవగాహన, ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలి, అమలు వంటివి న్యాయ సేవా సంస్థ చట్టాలపై ఉచిత న్యాయం సహాయం ఎలా పొందాలి అమలు వంటివి, న్యాయ సలహాల కోసం15100 నెంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యను చెప్తే ఈ సంస్థలో పరిష్కారం చూపడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి. వేణుగోపాల్, ఎంపీడీఓ తిరుపతయ్య, హర్షవర్ధన్, ఏఈఓ పంచాయత్ సెక్రెటరీస్ అచ్చన్న, సి.సాయిప్రకాష్ రెడ్డి, రాజయ్య గౌడ్, పీ.శైలజ, పారాలీగల్ వాలంటీర్స్ పోలీస్ సిబ్బంది తదితరులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

కలెక్టర్ విజయేందిర బోయి

బాలానగర్ మండలం ఉడిత్యాల జడ్పీ ఉన్నత పాఠశాల, దవాఖానను తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించి పదవతరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. మంగళవారం బాలానగర్ మండలంలో ఉడిత్యాల గ్రామంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గుండెడు గ్రామంలో పల్లె దవాఖానాను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత జడ్పీ ఉన్నత పాఠశాలను సమగ్రంగా పాఠశాల ప్రాంగణమంతా తిరిగి పరిసరాలను పరిశీలించారు. పదవ తరగతి ఇంగ్లీష్ మీడియం తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. తరగతి గదిలో విద్యార్థుల సంఖ్యపై ఆరా తీశారు. పాఠశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు టాయిలెట్స్ లేవని, మిషన్ భగీరథ త్రాగునీటి పైపు లైన్ ద్వారా త్రాగు నీరు రావటం లేదని, పాఠశాలకు ప్రాక్టికంగా ఉన్న కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తి చేయాలని, పాఠశాల బయట రోడ్డు పైకి పోకుండా గేట్ కావాలని హెడ్ మాస్టర్ పి.సురేష్ కుమార్, కలెక్టర్ కు వివరించారు. జిల్లా కలెక్టర్ ప్రహరీ పూర్తి, గేట్ మంజూరు చేస్తానని తెలిపారు. మిషన్ భగీరథ పైపు లైన్ ద్వారా త్రాగునీటి సరఫరా సంబంధిత అధికారులు పరిష్కరిస్తారని తెలిపారు. పాఠశాల ఆవరణలో గ్రౌండ్‌లో విద్యుత్ తీగలు కిందికి వేలాడటం గమనించి ఎస్‌పిడిసిఎల్ ఎఈ కి ఫోన్ చేసి సమస్యను తెలిపి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం మండలంలో గుండెడ్ గ్రామంలో పల్లె దవఖానాను కలెక్టర్ తనిఖీ చేశారు. వైద్య చికిత్స కొరకు రోగులతో మాట్లాడి వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. తర్వాత వైద్య సిబ్బందితో మాట్లాడుతూ ఓపి వివరాలు? పల్లె దవాఖానా పరిధిలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి? అని అడిగింది? పల్లె దవాఖానా పరిధిలో 7 గ్రామాలు ఉన్నాయని తెలిపారు. మందుల కొరత ఉందా అని వైద్య సిబ్బందిని అడిగారు. మందుల కొరత లేదని తెలిపారు. ఆసుపత్రికి ఎక్కువగా ఏ కేసులు వస్తున్నాయి? డెంగ్యూ, చికెన్ గున్యా కేసులు వస్తున్నాయా అని కలెక్టర్ మెడికల్ ఆఫీసర్‌ను అడిగారు. గ్రామంలో వైద్య సిబ్బంది ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణ పై అవగాహన కలిగించాలని, పంచాయితీ , మిషన్ భగీరథ శాఖల సమన్వయంతో వ్యాధుల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట తాహసీల్దార్, ఎంపిడిఓ ఉన్నారు.

# యూరియా పక్కదారి పడితే కఠిన చర్యలు



యూరియా పంపిణీపై ప్రత్యేక నిఘా ఉంచండి

కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లాలో యూరియా పూర్తిస్థాయిలో పారదర్శకంగా జరిగేలా పంపిణీపై చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ సంబంధిత వ్యవసాయ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఎరువుల దుకాణాలవద్ద అధికారులు నిఘాపెంచి, రైతులకు యూరియా సమయానికి అందేలా చూడాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో జిల్లావ్యాప్తంగా యూరియా లభ్యత, డిమాండ్, సరఫరాపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ఎక్కువడిమాండ్ ఉన్న ప్రాంతాల వివరాలను అధికారులనుండి సేకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా కృత్రిమకొరత సృష్టించే వ్యాపారులు, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడేవారిపై పిడియాక్టుప్రకారం కేసులు నమోదుచేయాలని స్పష్టంచేశారు. ప్రాథమిక సహకారసంఘాల్లో ఉన్న స్టాక్, డిమాండ్, సరఫరా వివరాలను ఐఎఫ్ఎంఎస్‌పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. పంపిణీజరిగే కేంద్రాల్లో విఆర్‌ఓలు పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో 5.38లక్షల ఎకరాల్లో పంటసాగు జరిగిందని, 40వేల మెట్రిక్‌టన్నుల యూరియా అవసరంకాగా ఇప్పటివరకు 19,859మెట్రిక్ టన్నులు అందాయని, ఇంకా 15,885 మెట్రిక్‌టన్నుల యూరియా రావాల్సి ఉందని చెప్పారు. నానోయూరియా అనేది నానో టెక్నాలజి సహాయంతో తయారుచేయబడిన ద్రవరూపంలో ఉండే ఎరువుదీని వాడకంవల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. నానో యూరియా మొక్కలకు సమర్థవంతంగా నత్రజనిని అందిస్తుందని, పంట దిగుబడిని పెంచడంలో సహాయపడుతుందని తెలిపారు. ఈసమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు, డివిజన్ వ్యవసాయ అధికారులు చంద్రశేఖర్, పూర్ణచంద్రారెడ్డి, కార్యాలయ వ్యవసాయ అధికారి శివ, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌తోనే సత్వర న్యాయం

ఎస్పీ రావుల గిరిధర్

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** వివాదాలు పెంచుకుంటే జీవితాంతం కొనసాగుతాయి. ఒకవేళ రాజీకి సిద్ధమైతే అప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13న వనపర్తి జిల్లా కోర్టులలో జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌లో కక్షిదారులు జారీమార్గాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి, విభజన, కుటుంబపరమైన నిర్వాహణ, రోడ్డు ప్రమాదాలు, చిన్న దొంగతనాలు, వైవాహిక సమస్యలు, డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్, బ్యాంక్, టెలిఫోన్ రికవరీ విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ వంటి రాజీ పడదగిన కేసుల్లో ఇరు వర్గాలు కలిసి సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. కోర్టు విధులు నిర్వహించే పోలీసులు, కానిస్టేబుళ్లు ఇలాంటి కేసులను గుర్తించి ఇరువురికి కౌన్సిలింగ్ ఇచ్చి అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం లభిస్తుందని, ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు.

## నెంబర్‌ప్లేటు లేని వాహనాలు నడిపితే చర్యలు



**ప్రజాపక్షం/వెల్దండ :** నెంబర్ ప్లేటులేని వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కురుమూర్తి హెచ్చరించారు. మంగళవారం శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై నెంబర్ ప్లేటులేని వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెంబర్ ప్లేటు లేకుండా వాహనాలు నడపడం వల్ల ఇబ్బందులు తలెత్తుతాయని, దీంతో అనుకోకుండా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు నెంబర్ ప్లేటు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వాహనదారుడు సంబంధిత పత్రాలు కూడా ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రమణ, శ్రీనివాసులు, రాఘవేందర్‌గౌడ్, శివ, నరేందర్ పాల్గొన్నారు.

# కార్మికులపై వేధింపులు ఆపాలి

ఆసుపత్రి ఆర్ఎంఓ డా.సుమతకి వినతి




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** ఆసుపత్రి కార్మికులను వేధింపులకు గురిచేస్తూ కార్మికుల హక్కుల కోసం ఉద్యమిస్తున్న ఏఐటీయూసీ కార్మిక నేత పి.సురేష్‌పై కుట్ర కేసుల ఫిర్యాదులు చేసిన సిహెచ్ఓ రామ్ నాయక్, ఎస్‌హెచ్ఓ నరేందర్‌లను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండు చేస్తూ మంగళవారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పారిశుద్ధ్య , సెక్యూరిటీ, పేషెంట్ కేర్, కార్మికులు ఆందోళనకు దిగారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రంగా అజ్మీర ఆదేశాల ప్రకారం ఆందోళన దగ్గరికి చేరుకున్న ఆసుపత్రి ఆర్ఎంఓ డా.సమత కి కార్మికులు శానిటరి అధికారుల ఆగడాలపై ముక్కుమ్మడిగా ఫిర్యాదులను చేశారు. ఈ సందర్భంగా మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ మాట్లాడుతూ కొంత మంది శానిటరీ అధికారులు కార్మికులను కట్టు బానిసలుగా చూస్తూ ఆ ఫ్టాల్ ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ అంటూ చులకనగా నోటికి వచ్చినట్టు బూతులతో అగౌరవ పాలు చేస్తూ మానసిక శారీరక వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిహెచ్ఓ రామ్ నాయక్ మొదటి నుంచి కార్మికులు అంటేనే గిట్టడం లేదని అన్నారు. తక్షణమే జరుగుతున్న సంఘటనపై విచారణ జరిపి సిహెచ్ఓ రాం నాయక్, యస్‌హెచ్ఓ నరేందర్‌లను, సస్పెండ్ చేయాలని డిమాండు చేశారు. లేనిచో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి బ్రాంచ్ అధ్యక్షులు బి.చెన్నయ్య, కార్యదర్శి జే.నరసింహ, ఉపాధ్యక్షులు, వై రంగయ్య, సీనియర్ నాయకులు మొగులన్న, నాయకులు కార్మికులు అంజి, యాదయ్య, భీమ న్న, వెంకటయ్య, గొందెలి యాదయ్య, కృష్ణ, నరేష్, రాఘవేందర్ నైసన్, తిరుపతయ్య, బాలకృష్ణ, శ్రీశైలం, మహేష్, మన్యం, శ్రీనివాస్ రెడ్డి, మున్నా, ముంతాజ్, దిన్, పద్మ, నాగమ్మ, నాగమణి, సత్యమ్మ లక్ష్మీ , అలివేల, వర లక్ష్మి అరుణ, మల్లమ్మ, సంధ్య, ఇందిరా, కవిత రాదా, సవిత, యాదమ్మ, స్వాతి, పద్మ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల దాహార్తిని తీర్చిన వివేకానంద ఫ్రెండ్స్ యూత్



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ మండలంలోని కాట్రేపుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు ఆ గ్రామంలోని స్వామి వివేకానంద ఫ్రెండ్స్ యూత్ కమిటీ సభ్యులు విద్యార్థులకు తాగునీటి కొరకు 70,000 రూపాయలు వెచ్చించి వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేసి గ్రామ పెద్దల ఫిల్టర్‌ను ఏర్పాటు చేసి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం చేయడం జరిగింది. కాట్రేవ్ పల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సిరెడ్డి మాట్లాడుతూ సొంత గ్రామానికి అందులో పాఠశాలకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతమని, విద్యార్థుల అవసరాలు దాహార్తిని తీర్చిన వివేకానంద యూత్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వివేకానంద ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షులు వెంకటేష్, కార్యదర్శి రాము, సభ్యులు శ్రీనివాస్ గౌడ్, కురువ వెంకటేష్, శివలింగం, రాములు గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ మునిస్వామి, నారాయణరెడ్డి, గడ్డం నరసప్ప, నాయకర్ లింగప్ప, గ్రామ యువత, పోషకులు, పాఠశాల చైర్మన్ పద్మమ్మ , ఉపాధ్యాయులు శివ కుమార్, రమేష్, పవర్ధన్ రెడ్డి, శ్రీకాంత్, వంట ఏజెన్సీ రఘు, రమేష్, రాజేశ్వరి, పుష్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని మంత్రికి వినతి



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ మండల పరిధిలోని దాసరి దొడ్డి గ్రామ ప్రజలు యువత ఆధ్వర్యంలో సోమవారం దాసర్ దొడ్డి నుండి మక్తల్ తాసిల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించి తహసీల్దార్‌కి, మంత్రి డాక్టర్।। వాకిటి శ్రీహరికి వేరువేరుగా వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ పాదయాత్రను ఉద్దేశించి అఖిలపక్ష నాయకులు సిఆర్.గోవింద్ రాజ్, నాయకుల భగవంతు, కొల్లూరు లక్ష్మ ణ్ మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాల అవుతున్న నేటికీ పాలకులు అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇప్పటి దాకా దాసరిదొడ్డి గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు కాకపోవడం దౌర్భాగ్యం అన్నారు. పాలకులది ఎంత నిర్లక్ష్యం మో తేటతెల్లమవుతున్నదని అన్నారు. వర్షం వస్తే గుంతలు పడి బురదలో వాహనదారులు ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, ఇతర అవసరాల నిమిత్తం కొరకై మక్తల్‌కు రావాలంటేనే ప్రాణం అరచేతిలో పెట్టుకొని రావాల్సి వస్తుందని గర్భిణి స్త్రీలు డెలివరీ కోసం ప్రభుత్వ అంబులెన్స్‌లో ఆసుపత్రికి వచ్చే సందర్భంలో ఆ గుంతలకే అంబులెన్స్‌లోనే డెలివరీ అయ్యే పరిస్థితి దాపురించిందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి బీటీ రోడ్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్ అజయ్, హృదయ, కే.గోపి, ఏ.లక్ష్మ ణ్, ఏ.నవీన్, అరుణ్, ఉదయ్, రమేష్, ఆదిమూర్తి, జి.పవన్, పి.లక్ష్మ ణ్, ఎం.లోకేష్, కంకిరి నాగమ్మ, వెంకటమ్మ, ఆశప్ప, మాజీ సర్పంచ్ వెంకటప్ప, గౌరప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలు సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశం మందిరంలో ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, గృహ నిర్మాణశాఖ పిడి వైద్యం భాస్కర్, కలెక్టరేట్ ఏవో సువర్ణరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

**కాళోజీ ఆలోచనలు సమాజానికి మార్గదర్శకం**

కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.జానకి కాళోజి నారాయణరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బి.రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీసీఆర్‌బి డిఎస్పి రమణారెడ్డి, ఏఓ రుక్మిణి బాయి, ఆర్‌ఐలు, కృష్ణయ్య, నగేష్, రవితో పాటు ఇతర పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో కాళోజి నారాయణరావు జయంతి ఉత్సవాలలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి రాజేంద్రప్రసాద్ సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఉద్యమమే ఊపిరిగా ఊపిరే ఉద్యమంగా బ్రతికిన వ్యక్తి కాళోజి అని అన్నారు. ఈ వేదిక పైన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అమీనా ముంతాజ్, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి తెలుగు విభాగం తరపున ఘన సత్కారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగం అధ్యాపకులు, సునీత, హేమలత ప్రభాకర్, కృష్ణుడు మల్లికార్జున్ మధుసూదన్, శర్మ, మద్దిలేటి, కేశవర్ధన్, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ ప్రజావాణి హాల్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన జయంతి వేడుకల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి రాజేంద్ర గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం, కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాక అధికారి, కలెక్టరేట్ స్టాఫ్ వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/అమరచింత :** తెలంగాణ బాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం అమరచింత మున్సిపాల్టీ కార్యాలయంలో ప్రజాకవి కాళోజి నారాయణరావు 111 జయంతిని ఘనంగా జరుపుకున్నారు. కాళోజి నారాయణరావు చిత్రపటానికి పురపాలక కమిషనర్ సిహెచ్ నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ గంధం ఆంజనేయులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మాగనూర్ :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మాగనూర్‌లో తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజా కవి, పద్మ విభూషణ్ స్వర్గీయ కాళోజీ నారాయణ రావు 111 వ జయంతి సందర్భంగా మాగనూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళిధర్ రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయురాలైన విజయలక్ష్మి 100 మంది తెలుగు కవుల చిత్రపటాలు పాఠశాలకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజన, కళావతి, వెంకటస్వామి, రామామహేశ్వరి దేవి, జమ్మన్న, సంధ్య, అనిత, రామకృష్ణ, రాకేష్ శర్మ, ఇందురాని, శ్రీనివాస్, నాగసుధ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/కృష్ణ :** కృష్ణ మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధ్యాయుల సమావేశంలో మండల విద్యాధికారి నిజాముద్దీన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గణేష్ సింగ్, కిశోర్ కుమార్, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొని ప్రజా కవి స్వర్గీయ కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దండు శేఖర్, వి. రామకృష్ణ, యన్. శివరాజ్, సూర్యకాంత్, ఈరన్న, శ్రీనివాస్, రవి కుమార్ , ఖాసీం అలీ, గంగాధర్, హన్మదాస్, మోహన్, వినోద్, కళ్యాణి, అనిత, అమృత, స్వామి, పదావతమ్మ, జ్యోతి, శోభారాణి, అమీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల పట్టణంలోని డా.బి.ఆర్. ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం)లోని తెలుగు శాఖ ఆధ్వర్యంలో కాళోజీ జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం నాడు కళాశాల సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశాన్ని పురస్కరించుకుని తెలుగు విభాగాధిపతి డా.సి.నర్సింహులు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.సుకన్య విచ్చేసి ప్రధాన ప్రసంగం చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కాళోజీ జన్మదినం సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం ప్రారంభమైందని డా.నర్సింహులు వివరించారు. ఈ సభలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.వేముల శ్రీనివాసులు, కళాశాల అకాడమిక్ కో ఆర్డినేటర్ రాఘవేంద్రారెడ్డి, డా.బి.వెంకటయ్య, డా. పుష్పలత, ఐక్యూఏసి కో ఆర్డినేటర్ డా.మాధురి, సిఓఈ డా.సులామాన్, గ్రంథాలయ అధిపతి ఇప్పల ఆంజనేయులు, అధ్యాపకులు వంగూరి వేణు, సురయ జబీన్, నాగరాజు, జగన్, అదిల్, లత, నందకిశోర్, నర్సింహులు, నియాజుద్దీన్, జ్యోతి, నిర్మల పాల్గొన్నారు.

# రీల్



## అందరికీ అందుబాటులో 'మిరాయ్' టికెట్ రేట్స్

### నిర్మాత టి.జీ. విశ్వ ప్రసాద్

హీరో తేజ సజ్జా తాజాగా నటించిన 'మిరాయ్'లో సూపర్ యోధ పాత్రలో అలరించబోతున్నారు. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. రాకింగ్ స్టార్ మనోజ్ మంచు పవర్ ఫుల్ పాత్ర పోషించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. సెప్టెంబర్ 12న ఈ సినిమా రిలీజ్ కాబోతుంది. ఈ సందర్భంగా వైజాగ్ లో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో తేజ మాట్లాడుతూ ఈ సెప్టెంబర్ 12 మిరాయ్ థియేటర్లోకి వస్తుంది. ఇది ఒక యాక్షన్ ఫాంటసీ అడ్వెంచర్. తప్పకుండా అందరూ థియేటర్స్‌కి వచ్చి చూడండి. మీకోసం ఒక వరల్డ్ ని ప్రిపేర్ చేసి ఉంచాము. పిల్లలకు పెద్దలకు అందరికీ నచ్చే సినిమాని తీసుకొస్తున్నాం అన్నారు. మంచు మనోజ్ మాట్లాడుతూ మా ప్రీ రిలీజ్ ఈవెంట్ వైజాగ్ లో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంది. పర్సనల్‌గా చాలా ఎమోషనల్ గా ఉంది. నా ఫస్ట్ సినిమా దొంగ దొంగది మొత్తం వైజాగ్ లోనే తీశాం. మిరాయ్ సినిమానే నాకు కం బ్యాక్ అని ఈ సినిమా ఒప్పుకున్నాను. ఈ సినిమా కోసం తమిళ్ కన్నడ హిందీ భాషల్లో స్వయంగా డబ్బింగ్ చెప్పాను.నిర్మాత విశ్వప్రసాద్ మాట్లాడుతూ మిరాయ్ విజువల్ వండర్. అద్భుతమైన లొకేషన్స్, ఆర్ట్ వర్క్, విజువల్ ఎఫెకట్స్‌తో ఒక తెలుగు సినిమా డెఫినెట్ పాన్ ఇండియా మూవీ అవుతుంది. ఈ సినిమాతో మిరాయ్ పాన్ వరల్డ్ ఫ్రాంచైజ్ అవుతుంది. హనుమాన్ తర్వాత తేజ ఈ సినిమా కోసం చాలా డెడికేటెడ్ గా వర్క్ చేశారు. మనోజ్ ఒక స్పెషల్ క్యారెక్టర్ లో కనిపిస్తారు. హరి గౌర మ్యూజిక్ ఇచ్చారు. ఇందులో హిస్టరీ సూపర్ నేచురల్ పవర్ స్పిరిచువల్ ఎలిమెంట్స్ ఉంటాయి. ఈ సినిమా థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను. అందుకే టికెట్ ధరలు అందరికి అందుబాటులో ఉంచాం అని చెప్పారు.

## 'భద్రకాళి' డిఫరెంట్ అనుభవం

హీరో విజయ్ ఆంటోనీ హీరోగా తెరకెక్కిన తాజా చిత్రం 'భద్రకాళి'. ఈ చిత్రానికి అరుణ్ ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌ను విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోనీ సమర్పిస్తున్నారు. 'భద్రకాళి' సెప్టెంబర్ 19న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ తృప్తి రవీంద్ర, రియా జిత్తు మీడియాతో చిట్ చాట్ చేశారు.హీరోయిన్ తృప్తి రవీంద్ర మాట్లాడుతూ మాది మహారాష్ట్ర. తమిళ సినిమాలో హీరోయిన్ గా ఇది నా ఫస్ట్ సినిమా. సినిమాల్లోకి రాకముందు నేను సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా పని చేశాను. ఇంజనీరింగ్ సమయంలోనే నాకు సినిమా పట్ల చాలా ఆసక్తి ఉండేది. థియేటర్స్ ప్లేస్ కోసం ఆడిషన్స్ ఇచ్చాను. కెమెరా ముందు నటించడం నాకు చాలా ఆనందాన్ని ఇచ్చే విషయం. కొన్ని టీవీ కమర్షియల్స్ కూడా చేశాను. అరుణ్ డైరెక్షన్ టీం నుంచి ఈ సినిమా కోసం ఆడిషన్ కాల్ వచ్చింది. తర్వాత అడిషన్ ఇచ్చాను. లుక్ టెస్ట్ చేసిన తర్వాత ఈ క్యారెక్టర్ కోసం ఓకే చేశారు. ఈ సినిమాలో చాలా రిలేటబుల్ క్యారెక్టర్ చేస్తున్నాను. అందరూ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. డైరెక్టర్ చాలా అద్భుతంగా క్యారెక్టర్ డిజైన్ చేశారు. షూటింగ్ చాలా ఎంజాయ్ చేశాను. విజయ్ తో నటించడం చాలా మంచి అనుభవం. తెలుగు ఆడియన్స్ అన్ని రకాల సినిమాల్ని గొప్పగా ఆదరిస్తారు. సినిమాని గొప్పగా సెలబ్రేట్ చేసుకుంటారు. ఈ సినిమా కూడా ఆడియన్స్ మంచి ఎక్స్పీరియన్స్ ఇస్తుందని కోరుకుంటున్నాను. హీరోయిన్ రియా జిత్తు మాట్లాడుతూ నేను మలయాళీ. తమిళ, మలయాళం సినిమాలు చూస్తూ పెరిగాను. చైల్డ్ ఆర్టిస్ట్ గా నాకు అనుభవం ఉంది. దాదాపు 15 సినిమాలు చైల్డ్ ఆర్టిస్ట్ గా చేశాను. సినిమాల నుంచి కొంత బ్రేక్ తీసుకొని చదువుపై దృష్టి పెట్టాను. చదువు పూర్తయిన తర్వాత మళ్లీ సినిమాల్లోకి వచ్చాను.విజయ్ ఆంటోనీ 25వ సినిమాలో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది. ఆయన మ్యూజిక్ వింటూ పెరిగాను. ఆయన మ్యూజిక్ నాకు చాలా ఇష్టం.ఈ సినిమాలో ఒక డిఫరెంట్ క్యారెక్టర్ చేశాను. ఇప్పుడే ఎక్కువ రివిల్ చేయకూడదు. విజయ్ చాలా హంబుల్ పర్సన్. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. డైరెక్టర్ అరుణ్ చాలా క్లారిటీ ఉన్న మేకర్ . మాకు చాలా కాన్ఫిడెన్స్ ఇచ్చారు. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమాని నిర్మించారు. ఇది చాలా ఇంపాక్ట్ ఫుల్ కథ. ఇలాంటి కథ సొసైటీ కి చాలా అవసరం. తప్పకుండా ఈ సినిమా అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది.తెలుగు ఆడియన్స్ మంచి సినిమాలని ఆదరిస్తారు. భద్రకాళి కూడా చాలా ఇంపాక్ట్ ఫుల్ కంటెంట్ తో వస్తున్న సినిమా. తప్పకుండా అందరినీ అలరిస్తుందని కోరుకుంటున్నాను.



తృప్తి రవీంద్ర, రియా జిత్తు



## ఘనంగా 'రోహిణి' పాటల ఆవిష్కరణ

యంగ్ ఛార్మింగ్ హీరో సన్నీ కునాల్ హీరోగా, దేవిక సాహూ, ఆశ హీరోయిన్లుగా, నిర్మాత కుశాల్ రాజు, దర్శకుడు సంగ్ కుమార్ కాంబినేషన్‌లో రూపొందిన 'రోహిణి' మూవీ ఆడియో వేడుక హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాటలు, ట్రైలర్‌ను ముఖ్య అతిథులు టీఎఫ్‌సీసీ కార్యదర్శి దామోదర ప్రసాద్, నిర్మాత చదలవడ శ్రీనివాస్, హీరో క్రిష్ణ సాయి కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎఫ్‌సీసీ సెక్రటరీ దామోదర ప్రసాద్ మాట్లాడుతూ కంటెంట్ బాగుంటే ఏ సినిమా అయినా విజయవంతం అవుతుంది. ఇటీవల 'లిటిల్ హార్ట్స్' నిరూపించినట్టే, అలాంటి లక్షణాలు రోహిణి సినిమాకూ ఉన్నాయి. ఇది హిట్ కావాలని ఆశిస్తున్నాను అన్నారు. దర్శకుడు సంగ కుమార్ మాట్లాడుతూ ఈ సినిమా విజయవంతం కావడానికి యూనిట్‌లో ప్రతి ఒక్కరి కృషి ఉంది. అందరూ శ్రమించారు. పాటలకు వస్తున్న స్పందన సంతోషంగా ఉంది. త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాను హిట్ చేయాలని కోరుతున్నాను అన్నా రు. నిర్మాత కుషల్ రాజు మాట్లాడుతూ ఒక మంచి సినిమా అందించాలనే లక్ష్యంతో పని చేశాం. టీమ్‌లోని ప్రతి ఒక్క రూ ప్రతిభ చూపించారు. అందుకే సినిమా బాగా వచ్చింది. త్వరలోనే విడుదల చేసే మా సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నాము అన్నారు. హీరో సన్నీ కునాల్, హీరోయిన్లు దేవిక సాహూ, ఆశ , దాసరి వెంకటరమణ పాల్గొన్నారు. ఈ చిత్రానికి మాటలు: మెండెమ్ శ్రీధర్, కెమెరా: అభినయ్ సంగ, కో ప్రొడ్యూసర్: దేవకి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: షేక్ వలీ పాషా.

## గీత ఆర్ట్స్‌లో సినిమా ఆలస్యమైంది

## అందుకే కిష్కింధపురి చేశా

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కిష్కింధపురి'. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం వహించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించారు. ఈ చిత్రం సెప్టెంబర్ 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ కౌశిక్ పెగల్లపాటి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. నా ఫస్ట్ సినిమా 'చావు కబురు చల్లగా'. ఆ సినిమా తర్వాత గీత ఆర్ట్స్‌లోనే మరో సినిమా చేయాలి. అయితే కొన్ని కారణాల వల్ల డిలే అయింది. ఒక సందర్భంలో నిర్మాత సాహుకి ఈ కథ చెప్పాను. ఆయనకి చాలా నచ్చింది. తర్వాత బెల్లంకొండ శ్రీనివాస్ విన్నారు. అందరికీ కథ నచ్చడంతో ప్రాజెక్ట్‌ని మొదలుపెట్టాం. నాకు హారర్ సినిమా చాలా ఇష్టం, ఆ జానెర్‌కి ఒక సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. హారర్‌ని ఇష్టపడే ఆడియన్స్‌కి నచ్చేలా ఒక కథ చేయాలని ఎప్పటి నుంచో ఉండేది. కిష్కిందపురి హారర్ మిస్టరీ రెండు బ్లెండ అయిన సినిమా. ఇందులో ఎడ్జ్ అఫ్ ది సీట్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ చాలా వున్నాయి. నాకు ప్రతి సినిమాలో ఒక కొత్త విషయాన్ని చెప్పాలని ఆలోచన ఉంటుంది. నాకు తొలి సినిమాలో కూడా చాలా వైవిధ్యమైనటువంటి అంశాన్ని చెప్పడం జరిగింది. ఈ సినిమా కూడా హారర్ లో ఒక కొత్త అనుభూతిని అందించబోతుంది. చాలా ఇంపార్టెంట్ విషయాన్ని ఈ సినిమాతో చెబుతున్నాం. ఈ కథ ఆయనకు చాలా నచ్చి. సాయి యాక్షన్ హీరో. ఆయన ఈ కథ విని ఉన్నది ఉన్నట్లుగా తీయమని చెప్పారు. మేము ఏదైతే అనుకున్నామో అది స్క్రీన్ మీదకి అద్భుతంగా వచ్చింది. కథ, విజువల్, టెక్నికల్ గా ఆడియన్స్ కి ఒక మంచి అనుభవం ఇవ్వాలని సాయి మొదటి నుంచి నన్ను చాలా సపోర్ట్ చేశారు. కిష్కింధపురి అంటే మనకి రామాయణం గుర్తొస్తుంది. ఈ కథకి స్ఫూర్తి రామాయణం. అయితే ఆ స్ఫూర్తి చాలా మెటాఫర్ గా వుంటుంది. ఈ సినిమాని డీ కోడ్ చేసుకున్న వారికి రామాయణం నుంచి చాలా రిఫరెన్స్ దొరుకుతాయి.అనుపమ ఇప్పటివరకు చేయని క్యారెక్టర్ చేశారు. ఇందులో హీరో హీరోయిన్ క్యారెక్టర్స్ నేను చూసిన రియల్ లైఫ్ ఇన్సిడెంట్ ఇన్స్పిరేషన్ గా తీసుకున్నాను. ఇద్దరు కూడా కొత్తగా కనిపిస్తారు.ఈ సినిమా అంతా కూడా ఒక తెలియని ప్లేస్ లో జరుగుతుంది. అందుకే చాలావరకు పెక్యులర్ గా ఉండే క్యారెక్టర్స్ ని తీసుకోవడం జరిగింది. ఒక రేడియో స్టేషన్ కి వెళ్లడం వల్ల జరిగిన కథ ఇది. రేడియో స్టేషన్ లో చాలా మ్యాసివ్ గా ఉండాలి. అలాగే ఈ కథ 1989 లో మొదలవుతుంది. అలాంటి ఒక వింటేజ్ వైబ్ ని క్రియేట్ చేశాం. ఈ సినిమాలో కనిపించే లొకేషన్స్ కూడా చాలా డిఫరెంట్ గా ఉంటా యి. మేమైతే కాన్ఫిడెంట్ గా ఉన్నాం. ఒక సెన్సిబుల్, మంచి సినిమా చేశామని నమ్మకం ఉంది. కచ్చితంగా వర్కౌట్ ఉందనే వర్క్ అవుట్ అవుతుందనే నమ్ముతున్నాం. అవుట్ ఫుట్ చూసుకున్నాక చాలా హ్యాపీగా ఉన్నాం. టెక్నికల్ సినిమా టాప్ నాచ్ ఉంటుంది. గ్రాఫిక్స్ చాలా అద్భుతంగా వచ్చాయి.



డైరెక్టర్ కౌశిక్ పెగల్లపాటి

## 'ఛాంపియన్'లో చంద్రకళగా అనస్వర రాజన్ ఫస్ట్ లుక్ రిలీజ్

రోషన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఛాంపియన్'. జాతీయ అవార్డు గ్రహీత ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామాను, జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ , కాన్సెప్ట్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి హీరోయిన్ అనశ్వర రాజన్ ను పరిచయం చేస్తున్నారు. స్వప్న సినిమాస్ కొత్త ట్యాలెంట్‌ని వెలుగులోకి తీసుకురావడంలో ముందువరుసలో వుంటుంది. బ్లాక్‌బస్టర్ సీతా రామంతో తెలుగులోకి అడుగుపెట్టిన మృణాల్ ఠాకూర్ అందుకు నిదర్శనం. ఇప్పుడు ఆమె పరిశ్రమలో అత్యంత బిజీగా ఉన్న నటీమణులలో ఒకరు. ఆ ట్రెడిషన్ ని కొనసాగిస్తూ, ఛాంపియన్‌లో ట్యాలెంటెడ్ మలయాళ నటి అనస్వర రాజన్‌ను పరిచయం చేస్తున్నారు. ఈ సినిమాలో చంద్రకళగా అనశ్వర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. సాంప్రదాయ రెట్రోస్టైల్ దుస్తులలో గాజులు, సిందూరంతో అందంగా కనిపిస్తుంది. కథలో ఇంపాక్ట్ క్రియేట్ చేసే పాత్రను ఫస్ట్ లుక్ చూస్తే అర్థమౌతోంది.ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ ఆర్. మాధీ , సంగీతం మిక్కీ జె. మేయర్. ఆర్ట్ డైరెక్టర్ తోట తరణి అందిస్తున్నారు.



# శాసనమండలి భవనం పునర్‌నిర్మాణ పనుల పరిశీలన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలోని తెలంగాణ శాసనమండలి భవనం (హెరిటేజ్ బిల్డింగ్) పునర్‌నిర్మాణ పనులను మంగళవారం తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పరిశీలించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లెజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహా చార్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. అదే సమయంలో హెరిటేజ్ భవనం అయినందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రా నున్న సమావేశాలు ఈ భవనంలో నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి రే వంత్ రెడ్డి పనులను పరిశీలించడానికి వస్తారని, పనులలో ఎలాంటి జాప్యం చేయకుండా , వేగంగా పూర్తి చేసి శాసనమండలి అధికారులకు అప్పగించాలన్నారు. అనంతరం రోడ్లు, భవనాల శాఖ అధికారులు, అగాఖాన్ సంస్థ ప్రతినిధులతో అసెంబ్లీ స్పీకర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.



## బాంబుదాడులు

(మొదటి పేజీ తరువాయి)

ఖండించారు. కాగా మరోవైపు ఇజ్రాయెల్‌లో బందీల కుటుంబాలు దోహా దాడుల నేపథ్యంలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. హమాస్ కక్షగట్టి బందీలుగా ఉన్న తమ బంధువులకు హాని చేస్తుందని భయపడుతున్నారు. గాజాలో హమాస్ వద్ద దాదాపు 20 మంది ఇజ్రాయలీలు బందీలుగా ఉన్నారు. ఇదిలా ఉండగా, గాజా సిటీ ని ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ సైన్యం ప్రజలకు ఆదేశించింది. ఇప్పటికే ప్రజలు దక్షిణ ప్రాంతాలకు తరలివెళుతున్నారు. ఈ ఆదేశాలతో ప్రజలు భయంతో మూటలు సర్దుకుని దొరికిన వాహనాలపై వెళ్ళిపోతున్నారు. భారీసంఖ్యలో వాహనాల్లో ప్రజలు గాజాసిటీని ఖాళీ చేస్తున్నారు. భారీస్థాయిలో నగరంలో యుద్ధం జరుగుతుందిగనుక గాజా సిటీని ప్రజలు వదిలివెళ్ళిపోవాలని ప్రజల కు ఇజ్రాయెల్ సైన్యం ఆదేశించడంతో ప్రజలు ఆగమేగాలపై ఇళ్ళుఖాళీ చేసి వెళ్ళిపోతున్నారు. గడచిన మూ డు రోజులుగా గాజాసిటీలో 30 హై రైజ్ భవంతులను సైన్యం ధ్వంసం చేసిందని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇ జ్రాయెల్ కట్జ్ మంగళవారం ప్రకటించారు. ఈ భవంతులను హమాస్ ఉగ్రవాదులు తమ కేంద్రాలుగా ఉపయోగించుకుంటున్నాయని తెలిపింది. మరోవైపు గాజాసిటీ శివారులో హమాస్ చేసిన దాడిలో నలుగురు ఇజ్రాయె లీ సైనికులు మరణించారు. గాజాలో యుద్ధం మొదలై మంగళవారంనాటికి 704 రోజులు పూర్తయింది.

## పట్టుబడిన అధికారిణి

(మొదటి పేజీ తరువాయి)

చేయాలంటే రూపాయలు 10 లక్షలు ఇవ్వాలని టిపిఓ మణిహారిక డిమాండ్ చేసింది దీంతో వినోద్ ఎసిబి అధికారులను ఆశ్రయించారు. సోమవారం ఎసిబి డిఎస్పి శ్రీధర్ ఆధ్వర్యంలో ఎసిబి అధికారులు పక్కా ప్లాన్‌తో మున్సిపల్ కా ర్యాలయంలో సోదాలు నిర్వహించారు రూ.4 లక్షలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎసిబి అధికారి డిఎస్పి శ్రీధర్ మా ట్లాడుతూ ఈ సమాచారము మాకు వారం రోజుల క్రితమే అందిందని ఆయ న అన్నారు.మంచిరేవుల గ్రామానికి చెందిన వ్యక్తి సంబంధించిన ప్లాట్ ఎల్ఆర్ఎస్ ప్రోసిడింగ్ ఇవ్వడానికి మణిహారికను కలిస్తే ఆమె రూ.10 లక్షలు డి మాండ్ చేసినట్లు అంతా నేను ఇవ్వలేనని చెప్పడంతో తర్వాత వచ్చి కలిసి రిక్వెస్ట్ చేస్తే నాలుగు లక్షల యాభై వేలకు ఒప్పుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 11:30 గంటలకు మున్సిపల్ ఆఫీస్‌లో టిపిఓ చాంబర్లోనే నాలుగు లక్షలు ఇచ్చాడు. ఆ డబ్బులను ఆమె డ్రాలోనే పె ట్టుకున్నది. మేము రెడ్ హ్యాండెడ్‌గా నాలుగు లక్షలు పట్టుకున్నాం. అల్కాపూర్ టౌన్‌షిప్‌లో ఆమె ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్నామని ఆమెను అరెస్ట్ చేసి కో ర్టులో హాజరు పరుస్తామని ఆయన తెలియజేశారు. ఈ సోదాలు నాలుగు నెల ల పాటు కొనసాగుతాయని అన్నారు. లంచం అడిగిన సందర్భంలో టోల్ ఫ్రీ నెంబర్ 1064కు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## అనుమతివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

మాజీ మంత్రి కేటీఆర్, ఎ2గా సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, ఎ3గా హెచ్ఎండిఎ మాజీ ఇంజినీర్ బిఎల్ఎన్ రెడ్డిలతో పాటు ఎ4, ఎ5లపై ఎసిబి అధికారులు చార్జీషీటు దాఖలు చేయనున్నారు. ఈ కేసులో ఇప్పటికే మాజీమంత్రి కెటిఆర్‌ను రెండుసార్లు, ఐఏఎస్ అధికారి అరవింద్‌ను మూడు సార్లు ఎసిబి ప్రశ్నించిన విషయం తెలిసిందే.అయితే, ఫార్ములా ఈకారు రేస్లో భారీగా అవినీతి జరిగినట్లుగా ఏసీబీ తేల్చింది. కేసులో క్విడ ప్రోకోను అధికారులు స్పష్టమైన సాక్షాధారాలతో నిరూపించినట్లుగా సమాచారం అందుతోంది. ఫార్ములా ఈరేసు కోసం స్పాన్సర్షిప్ ఇచ్చిన సంస్థ నుంచి రేసు నిర్వహించిన సంస్థకు రూ.44 కోట్లు చెల్లింపులు జరిగినట్లుగా గుర్తించారు. అందుకు బదులుగా స్పాన్సర్షిప్ సంస్థ నుంచి రూ.44 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్ను బీఆర్ఎస్ తీసుకున్నట్లుగా తెలుస్తోంది. రామకృష్ణా రావు వద్దకు రిపోర్టు చేరింది. అక్కడి నుంచి అనుమతి రాగానే ఫార్ములా ఈరేసు కేసులో ఎ1గా ఉన్న మాజీ మంత్రి కేటీఆర్, ఎ2గా సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, A3గా హెచ్ఎండీఏ మాజీ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలతో పాటు ఎ4, ఎ5లపై ఎసిబి అధికారులు చార్జీషీటు దాఖలు చేయనున్నారు. ఈ కేసులో ఇప్పటికే మాజీ మంత్రి కేటీఆర్ను రెండు సార్లు, ఐఏఎస్ అధికారి అరవింద్ను మూడు సార్లు ఏసీబీ ప్రశ్నించిన విషయం తెలిసిందే. అయితే, ఫార్ములా ఈ కారు రేస్లో భారీగా అవినీతి జరిగినట్లుగా ఎసిబి తేల్చింది. కేసులో క్విడ్ ప్రోకోను అధికారులు స్పష్టమైన సాక్షాధారాలతో నిరూపించినట్లుగా సమాచారం అందుతోంది. ఫార్ములా ఈరేసు కోసం స్పాన్సర్షిప్ ఇచ్చిన సంస్థ నుంచి రేసు నిర్వహించిన సంస్థకు రూ.44 కోట్లు చెల్లింపులు జరిగినట్లుగా గుర్తించారు. అందుకు బదులుగా స్పాన్సర్షిప్ సంస్థ నుంచి రూ.44 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్ను బిఆర్ఎస్ తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

### ఇది లొట్టపీసు కేసు : కెటిఆర్

'ఫార్ములా ఈ కార్ ' కేసు ఒక లొట్టపీసు కేసు అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు పునరుద్ఘాటించారు. ఈ విషయంలో ఎవరైనా తనతో లై డిటెక్టర్ పరీక్ష చేసుకోవచ్చని సవాలు విసిరారు. హైదరాబాద్ ఫార్ములాఈ కారు రేసును తీసుకురావడానికి తాను అన్ని ప్రయత్నాలూ చేశానని, ఈ రేసు కోసం ప్రభుత్వం నుండి రూ. 46 కోట్లు ఇవ్వాలని తానే ఆదేశాలు ఇచ్చానని, ఆ డబ్బులు నేరుగా నిర్దేశిత ఖాతాలోకి చేరాయని కెటిఆర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కారు రేసులో ఒక్క రూపాయి కూడా ఎక్కడా తారుమారు కాలేదని, ప్రతి రూపాయికి లెక్క ఉందని, అలాంటప్పుడు అవినీతి ఎక్కడిదని ప్రశ్నించారు. ప్రాసిక్యూషన్ చేసినా, ఛార్జిషీట్లు వేసినా ఏమీ చేయలేరన్నారు. సిఎం తాను(కెటిఆర్) ఇద్దరం కలిసి టివి ఛానల్ ముందు లైవ్ డిటెక్టర్ పరీక్షను ఎదుర్కొందామని అన్నారు. ప్రజల సమస్యల నుండి దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం ఫార్ములాఈ కేసును ముందుకు తీసుకొచ్చారని కెటిఆర్ ఆరోపించారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com